ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

నిజామాబాద్

fb.com/vaartha Digital

Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-5-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 107 పేజీలు: 10+4 వెల: 6.50

జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు బంద్ 3

బంగాళాఖాతంలో 'శక్తి' తుఫాన్ 7



## ఇందిర సౌర గిరి జల వికాస పథకం నేడు ప్రారంభం

### నాగర్‌కర్నూల్‌కు సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే18:** తెలంగాణ రాష్ట్రంలో రూ.12,600 కోట్ల బడ్జెట్‌తో కూడిన ఇందిర సౌర గిరి జల వికాసం పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించనుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సోమవారం నాగర్ కర్నూల్ జిల్లాలో అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. రూ.12,600 కోట్ల బడ్జెట్‌తో 'ఇందిర సౌర గిరి జల వికాసం" పథకం, ఒక్కో యూనిట్‌కు రూ. 6 లక్షల చొప్పున వంద శాతం సబ్సిడీతో లబ్ధిదారులకు అందించనున్న ప్రభుత్వం. ఈ పథకాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు సోలార్ పంపుసెట్లను సిఎం పంపిణీ చేయనున్నారు అనంతరం సీతారామాంజనేయ ఆలయాన్ని దర్శించుకుని బహిరంగ సభకు హాజరు కానున్నారు. ఈ కార్యక్రమం >>2

# భగ్గుమన్న భవనం

## 17 మంది దుర్మరణం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

### హైదరాబాద్ గుల్జార్‌హౌజ్‌లోని నగలదుకాణంలో భారీ అగ్ని ప్రమాదం
### మృతులలో 8 మంది చిన్నారులు, ఐదుగురు మహిళలు
### 2 కుటుంబాలలో విషాదం.. నలుగురిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది
### నిద్రలో ఉండగా పేలిన ఎసి కంప్రెషర్.. రెండంతస్తులకు వ్యాపించిన మంటలు
### దట్టమైన పొగకు ఊపిరాడక యజమాని, కుటుంబ సభ్యుల మృతి
### వేసవి విడిదికోసం వచ్చి ప్రాణాలు కోల్పోయిన కుమార్తెలు, సోదరుడు, పిల్లలు
### ఉస్మానియాలో బాధితులను పరామర్శించిన డి.సిఎం భట్టి, మంత్రులు దామోదర, పొన్నం

**హైదరాబాద్, (చార్మినార్) మే 18, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని చార్మినార్ సమీపంలోగల గుల్జార్‌హౌజ్‌వద్ద నగల దుకాణం యజమాని ఇంట్లో ఆదివారం ఉదయం సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో 17మంది దుర్మరణం చెందగా నలుగురిని అగ్నిమాపక శాఖ సిబ్బంది కాపాడారు. కాగా మృతులంతా నగలదుకాణం యజమానితోపాటు ఆయన సోదరుడు వారి కుటుంబీకులే కావడం, మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులు, ఐదుగురు మహిళలు వుండడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం >>2


చార్మినార్ సమీపంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ చిన్నారిని బయటకు తీసుకువస్తున్న అగ్నిమాక సిబ్బంది

## విచారణకు సిఎం రేవంత్ ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే18:** గుల్జార్ హౌజ్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విచారణకు ఆదేశించారు. ఈ >>2

## మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే18:** పాతబస్తీలోని గుల్జార్ హౌస్ సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి ఐదు లక్షల >>2

## పసివారిని రక్షిస్తూ మరణించిన ప్లహాద్ కుమారులు

2

గుల్జార్‌హౌజ్ అగ్ని ప్రమాదంలో ఒక కుటుంబంలో 15 మంది, మరో కుటుంబంలో ఇద్దరు మృత్యువాత

## ప్రధాని మోడీ దిగ్భ్రాంతి

### రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే18:** పాతబస్తీ పరిధిలో చార్మినార్ సమీపంలోని గుల్జర్ హౌస్ అగ్నిప్రమాదంలో పలువురి మృతి కలచివేసిందని భారత్ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఈ >>2

## సరస్వతి పుష్కరాలకు పోటెత్తిన భక్తులు

జనసంద్రంగా కాళేశ్వరం

7

## 'కమాండ్ కంట్రోల్'లో వరల్డ్ 'మిస్'లు

**హైదరాబాద్,మే 18,ప్రభాతవార్త:** రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ, మహిళలు పిల్లలపై వేధింపుల నివారణ, డ్రగ్స్ కట్టడికి చేపట్టిన చర్యలు, నేరాల నియంత్రణ, నేర నివారణలో ఉప యోగిస్తున్న ఆధునిక శాస్త్ర సాంకేతిక పద్ధతులు తదితర అంశాలపై తెలంగాణా పోలీస్ శాఖ చేపట్టిన పటిష్టమైన చర్యలపట్ల మిస్ వరల్డ్ కాంటెస్టర్లు సంతృప్తిని వ్యక్తం చేశారు. డ్రగ్స్ నివారణకై తెలంగాణా పోలీస్ చేపట్టిన చర్యలకు తమ సంపూర్ణ మద్దతు తెలియ చేస్తూ పోస్టర్లపై సంతకాలు చేసి పలు మెసేజ్ లను కూడా రాసారు. 107 దేశాల మిస్ వరల్డ్ కాంటెస్టులు ఆదివారం బంజారా హిల్స్ లోని తెలంగాణా ఇంటిగ్రేటెడ్ కమండ్ కంట్రోల్ సెంటర్ ను సందర్శించి, రాష్ట్రంలో శాంతి భద్రతల రక్షణకు ప్రభుత్వం అమలు >>2


ఆదివారం హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఆయుధాలను పరిశీలిస్తూ గన్ ఎక్కుపెట్టిన మిస్‌వరల్డ్ భామలు






ఆదివారం హైదరాబాద్‌లోని చార్మినార్ వద్ద అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతంలో భారీగా గుమిగూడిన ప్రజలు



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న డి.సిఎం భట్టి, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

# భగ్గుమన్న భవనం

>> నెలకొంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో గల నగల దుకాణంలో ఏసి కంప్రెషర్ పేలడం వల్ల ఒక్కసారిగా మంటలు, పొగ చెలరేగి, నిమిషాల వ్య వధిలో మొదటి అంతస్తుకు, రెండవ అంతస్తుకు వ్యాపి ంచడంతో ఆ సమయంలో గాడ నిద్రలో వున్న వారు పొగతో ఊపిరి ఆడకుండా స్పృహ కోల్పోయారు. నగల దుకాణంలో మంటలు చెలరేగిన విషయమై అగ్ని మాపక శాఖ అధికారులకు సమాచారం అందగానే పది నిమిషాల వ్యవధిలో మొగల్‌పురా ఫైర్ స్టేషన్ నుంచి రెండు యంత్రాలు, ఆ తరువాత మరో ఎనిమిది అగ్నిమాపక యంత్రాలను రంగంలో దించి మంటలను ఆర్పారు. మూడు గంటల పాటు శ్రమించిన తరువాతే మంటలు అదుపులోకి వచ్చాయి. ఈ ఘటనలో నగల దుకాణం యజమాని ప్రహ్లాద్ మోడి (72)తో పాటు ఆయన సోదరుడు రాజేందర్ మోది (65), ప్రహ్లాద్ మోది భార్య మున్నీ భాయి మోది (68), రాజేందర్ మోది భార్య సుమిత్ర (60), ప్రహ్లాద్ మోది పెద్ద కుమారుడు కుమారుడు పంకజ్ మోది (43), కో డలు వర్ష (36), కుమార్తెలు శీతల్ (35), రజని (32), రెండవ కుమారుడు సోదరుడు అభిషేక్ (31) మరణించారు. వీరితో పాటు పంకజ్ మోది పిల్లలు అన్య మోది (12) ఇదికా మోది (8). ఇరాజ్ మోది (2)లు, శీతల్ జైన్ కుమార్తె ఆరుషీ జైన్ (17), రజని కుమార్తె హర్షాలి గుప్తా (7), రాజేందర్ మోది మనవలు ప్రి యాంషి అగర్వాల్ (6). హామేయ్ (7), రిషబ్ (4)లు మరణించారు. కాగా ఈ ఘటనపై సిఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేయగా ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క హుటాహుటిన ఉస్మానియా ఆసుపత్రికి వెళ్లి గాయపడ్డ బా ధితులను పరామర్శించారు. అనంతరం ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదంపై అధికా రులను అడిగి తెలుసుకున్నారు. మంటలు చెలరేగిన భవనంలో పైకి వెళ్లేందుకు ఒకటే మెట్ల మార్గం వుండడం, అది కూడా చిన్నదిగా వుండడం వల్ల ప్రమాద తీ వ్రత పెరిగిందని, లోపలి భాగంలో మంటలను ఆర్పేందుకు రోబోను కూడా పంపామని అగ్నిమాపక శాఖ అధికారులు చెబుతున్నారు.

పాతబస్తీలోని నగలు, ముత్యాల అమ్మకాలకు ప్రసిద్ధిగాంచిన గుల్జార్‌హౌజ్ వద్ద ఓ నగల దుకాణంలో సంభవించిన భారీ అగ్నిప్రమాదం రెండు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. పూనంచంద్ అనే వ్యక్తికి చెందిన రెండంతస్తుల భవనంలో ఒక భాగంలో పూనం చంద్ జ్యెల్లర్స్, దీని పక్కనే కృష్ణా ముత్యాల దు కాణం వుంది. భవనం మొదటి అంతస్తులో నగల దుకాణం యజమాని ప్రహ్లాద్ మోది ఆయన సోదరుడు రాజేందర్ కుమార్ మోది కుటుంబం నివసిస్తోంది. హ రియాణాలోని నౌరోలి ప్రాంతానికి చెందిన ప్రహ్లాద్ మోది 40 ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వలసవచ్చి ఇక్కడే స్థిరపడ్డాడు. ఆయన ఇద్దరు కుమారులు పంకజ్ మోది, రెండవ కుమారుడు అభిషేక్ మోదితో పాటు పెద్ద కోడలు వర్ష వారి ముగ్గురు పిల్లలు ఇదే ఇంట్లో వుంటున్నారు. వేసవి సెలవులు కావడంతో పహ్లాద్ మోది సోదరుడు రాజేందర్ మోది, ఆయన భార్య సుమిత్రతో పాటు నగరంలోనే వుంటున్న ప్లహాద్ మోది కుమార్తెలు శీతల్ జైన్, రజని గుప్తా వారి పిల్లలంతా వేసవి విడిది కోసం తండ్రి ఇంటికి వచ్చారు. వీరంతా వారం రోజుల క్రితమే గుల్జార్‌హౌజ్‌కు వచ్చారు. శనివారం నాడు పలుచోట్ల వారు పర్యటించి, ఆదివారం మరి కొన్నిచోట్ల తిరిగేందుకు నిర్ణయించుకున్నారు. రాత్రి 12 గంటల వరకు కుటుంబ సభ్యులంతా మాట్లాడుకుని నిద్రపోయారు. ఉదయం ఆరు గంటల సమయంలో కింది భాగంలో గల నగల దుకాణంలో వున్న ఏసి కంప్రెషర్ ఒక్కసారిగా పేలిపోవడంతో నిమిషాల వ్యవధిలో మంటలు చెలరేగి దుకాణంలోని వస్తువులతో పా టు ఫర్నీచర్ అగ్నికి ఆహుతయ్యింది. వెను వెంటనే మంటలు మొదటి అంతస్తు, రెండవ అంతస్తుకు వ్యాపించాయి. మంటతో పాటు పొగ కూడా మొదటి, రెం డవ అంతస్తుకు వ్యాపించడంతో ఇక్కడ గాడ నిద్రలో వున్న ప్రహ్లాద్ మోది, రాజేందర్ మోదిల కుటుంబ సభ్యులు, వారి పసిపిల్లలు ఏం జరిగిందో కూడా తెలు సుకునే వీలులేని పరిస్థితి నెలకొనడంతో ఊపిరి ఆడక ఉక్కిరి బిక్కిరి అయ్యారు. సరిగ్గా ఇదే సమయంలో స్థానికులు దీనిపై పోలీసులతో పాటు అగ్నిమాపక శా ఖకు ఫిర్యాదు చేయడంతో వారు హుటాహుటిన రంగంలో దిగి అగ్నిమాపక యంత్రాలతో మంటలను ఆర్పారు. మంటలను ఆర్పేందుకు రోబోను ఉపయోగిం చారు. భవనం పై భాగంలో వెళ్లేందుక గల మెట్ల మార్గం చిన్నదిగా వుండడం, అక్కడ మంటలతో పాటు పొగ చూరడంతో అగ్నిమాపక సిబ్బంది ముందుకు వెళ్లలేక పోయారు. దీంతో నిచ్చెన ద్వారా మొదటి అంతస్తులో వెళ్లి అక్కడ ఊపిరి ఆడకుండా స్పృహలేని పరిస్థితిలో వున్న 17 మందిని బయటకు తరలించి మల క్‌పేట యశోధ ఆసుపత్రితో పాటు హైదర్‌గూడ అపోలో, ఉస్మానియా ఆసుపత్రికి తరలించ గా అప్పటికే వారంతా మరణించారు. వీరి మృతదేహాలను ఉస్మానియా మార్చ్యురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృత దేహాలను వారి కుటుంబీకులకు అప్పగించారు. కాగా అంతకు ముందు భవనం మొదటి అంతస్తు నుంచి బయటకు తీసుకువచ్చిన నలుగురి ఆరోగ్యం బాగానే వుందని పోలీసులు తెలిపారు. వీరికి అక్కడే ప్రథమ చికిత్స అందించి ఇళ్లకు పంపారు. ఘటనా స్థ లాన్ని ఆర్ అండ్ బి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు డిజిపి జితేందర్, సిటీ కొత్వాల్ ఆనంద్, ఫైర్ సర్వీస్ డిజి నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తది తరులు సందర్శించారు. ఈ ఘటన ప్రమాద వశాత్తూ జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు డిజిపి జితేందర్, కమిషనర్ ఆనంద్ తెలిపారు.

## విచారణకు సిఎం రేవంత్ ఆదేశం

>> ప్రమాదానికి దారితీసిన అసలైన కారణాలను లోతుగా దర్యాప్తు చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా నివారణ చర్యలను చేపట్టాలని, ప్రజలను అప్రమత్తం చేయాల్సి న అవసరం ఉందని అన్నారు. మంటల్లో చిక్కుకున్న వారిలో 17 మంది మృతి చెందడం పట్ల సీఎం రేవంత్ విచారంవ్యక్తం చేశారు. చనిపోయిన వారికిసంతాపం ప్రకటించారు. వారి కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ప్రమాదం సమాచారం తెలిసిన వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి అగ్నిమాపక శాఖ, పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు ఫోన్‌లో మాట్లాడి సహాయక చర్యలను పర్యవేక్షించారు. సహాయక చర్యలను వేగవంతం చేయటంతో పాటు బాధితులకు మెరుగైన వైద్య సాయంఅందించేందుకు అందుబాటులో ఉన్న మంత్రులు, అధికారులు వెంటనే ఘటన స్థలానికి వెళ్లాలని సీఎం ఆదేశించారు. సంఘటన స్థలానికి వెళ్లిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఐజీ నాగిరెడ్డిని ఫోన్‌లో మాట్లాడి గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేలా ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేశారు. అక్కడున్న బాధిత కుటుంబీకులతో ముఖ్యమంత్రి నేరుగా ఫోన్ లో మాట్లాడారు. ప్రభుత్వం తరఫున తప్పకుండా ఆదుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించటంతో భారీ ప్రాణనష్టం తప్పిందని, అగ్నిమాపక సిబ్బంది నలుగురిని ప్రాణాపాయ స్థితి నుండి సురక్షితంగా బయటకు తీసుకురాగలిగారని ముఖ్యమంత్రి అన్నారు. మంటల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు ఫైర్ టీమ్ తమ శక్తి యుక్తులు ప్రదర్శించిందన్నారు.

## ప్రధాని మోడీ దిగ్భ్రాంతి

>> ప్రమాదంపై మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానని చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రధాని మోడీ ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ట్వీట్ చేశారు.

## మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా

>> రూపాయల చొప్పున ఎక్స్రేషియాను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు ఖమ్మం జిల్లా మధిర నుంచి హుటాహుటిన ఉస్మానియా ఆసుపత్రికి చేరుకొని అగ్నిప్రమాదంపై మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజా నరసింహాతో కలిసి పరిస్థితిని సమీక్షించారు. మార్చురీ వద్ద మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపం సానుభూతిని తెలిపారు. వారి కుటుంబాలకు మనోధైర్యం భగవంతుడు కల్పించాలని ప్రార్థించారు. ప్రమాద సంఘటన సంబంధించిన వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్, జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్, అగ్నిమాపక శాఖ డీజీ వై నాగిరెడ్డి తో ప్రమాద సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ గేటు వద్ద మీడియాతో మాట్లాడారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పాతబస్తీలోని గుల్జార్ హౌస్ సమీపంలో ఈరోజు ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మంది మృతి చెందడం అత్యంత దురదృష్టకరమని, ఈ ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యావత్తు మంత్రిమండలి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిందని తెలిపారు. ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగంగా స్పందించి మంత్రులు, సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి అగ్ని ప్రమాద నివారణ చర్యలు చేపట్టడంతో పాటు బాధితులకు సహాయక చర్యలు చేపట్టాలని మినీ టు మినిట్ పర్యవేక్షణ చేశారని చెప్పారు. హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సంఘటన జరిగిన విషయం తెలిసిన వెంటనే అక్కడికి చేరుకొని పరిస్థితిని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారని తెలిపారు. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉస్మానియా ఆసుపత్రికి చేరుకొని వైద్య బృందంతో సమీక్షించి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూశారని చెప్పారు. ప్రాథమిక విచారణలో ఈ అగ్ని ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందని అధికారులు చెప్పారు. ఉదయం 6 గంటల 16 నిమిషాలకు అగ్గి ప్రమాదం జరిగిన పరిసర ప్రాంతం నుంచి అగ్నిమాపక శాఖకు ఫోన్ రావడంతో ఉదయం 6 గంటల 17నిమిషాలకు మొగల్ పురా నుంచి ఫైర్ ఇంజన్ బయలుదేరి ఉదయం 6గంటల 20 నిమిషాలకు సంఘటన స్థలానికి చేరుకొని ఆపరేషన్ ప్రారంభించినట్లు వెల్లడించారు. అగ్ని ప్రమాదంలో చిక్కుకున్న వారిని అగ్నిమాపక శాఖ సిబ్బంది రక్షించి ఆసుపత్రికి తరలించారని చెప్పారు. గతంలో జరిగిన ఇలాంటి అగ్ని ప్రమాదాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా తీసుకొని పునరావృతం కాకుండా తీసుకోవలసిన అన్ని చర్యలపై రాష్ట్ర క్యాబినెట్లో రెండు మూడుసార్లు సమీక్షించినట్లు చెప్పారు.

### 'గుల్జార్‌హౌజ్' మంటలను ఆర్పేందుకు

## రోబోను వినియోగించాం

### -ఫైర్ సర్వీస్ డిజి నాగిరెడ్డి వెల్లడి

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** పాతబస్తీలోని గుల్జార్‌హౌజ్ వద్ద ఆదివారం నాడు జరిగిన భారీ అగ్ని ప్రమాదంపై సమాచారం అందగానే స్పందించామని ఫైర్ సర్వీస్ డిజి నాగిరెడ్డి తెలిపారు. ఈ ప్రమాదంలో ఫైర్ సర్వీస్ సవ్యంగా వ్యవహరించలేదని కొందరు చెబుతున్న మాటలు నిజం కావని ఆయన తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉదంయ ఆరు గంటల 16 నిమిషాలకు గుల్జార్‌హౌజ్ వద్ద మంటలు చెలరేగాయని సమాచారం అం దగానే మొగల్‌పురా ఫైర్ స్టేషన్ నుంచి మొదటి అగ్నిమాపక యంత్రం ఆరు గంటల 20 నిమిషాలకు ఘటనా స్థలికి చేరిందని తెలిపారు. ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించి గ్రౌండ్ ఫ్లోర్ నుంచి రెండంతస్తులకు వ్యాపించిందని ఆయన తెలిపారు. ఈ ప్రమాదంలో ఫైర్ సర్వీస్ సిబ్బంది నలుగురిని కాపాడరని ఆయన తెలిపారు. పొగ కారణంగా తీవ్రంగా అనారోగ్యం పాలైన 17 మందిని తమ సిబ్బంది సమీపంలోని పలు ఆసుపత్రులకు తరలించారని అ యితే వారి ఆరోగ్యం క్షీణించి చనిపోయారని ఆయన వెల్లడించారు. ఈ భవనంలో ప్రవేశ మార్గం సవ్యంగా లేక పోవడం వల్ల మంటలను వేగంగా ఆర్పలేక పో యామని, పైకి వెళ్లేందుకు ఒకటే మెట్ల మార్గం వుందని, ఇది కూడా ఒక మీటర్ కన్నా తక్కువ వెడల్పుతో భవనం మధ్యలో వుందని, మెట్ల సమీపంలోనే మంట లు చెలరేగడం వల్ల పొగ విపరీతంగా వచ్చిందని ఆయన తెలిపారు.మం టలను ఆర్పేందుకు 11 యంత్రాలు వాడగా ఇందులో ఒక రోబోట్ యంత్రం కూడా వుందని ఆయన తెలిపారు. ఈ ప్రమాదం సమయంలో అడ్వాన్స్‌డ్ ఫైర్ రోబోట్,బ్రాంబో స్కై లిఫ్ట్,హైడ్రాలిక్ ప్లాట్ ఫాం ఉపయోగించామని ఆయన తెలిపారు. మంటల్లో చిక్కు కున్న వారిని కాపాడేందుకు భవనం గోడకు రంధ్రం చేయాల్సి వచ్చిందని, ఈ క్రమంలో హైదరాబాద్ డిఎఫ్ఓ వెంకన్న కూడా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఆయన తెలిపారు.

## వారం - వర్జ్యం

తేది : 19-05-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
షష్ఠి ఉ.6.11
శ్రవణ రా.7.25
వర్జ్యం రా.11.26-1.02
దు.ము.12.31-1.23, 2) మ.3.06-3.58
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. విలువైన వస్తువులు జాగ్రత్త అవసరం.

**వృషభం :** పనులలో జాప్యం ఒరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**మిథునం:** ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. కీలక నిర్ణయాలలో తొందరపాటు వద్దు. స్వల్ప ధనలాభం.

**కర్కాటకం:** విందు, వినోదాలు, శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు. సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**సింహం:** కుటుంబంలో సమస్యలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగతారు. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**కన్య :** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. దూర ప్రాంతాల నుండి శుభ ఆహ్వానాలు.

**తుల :** ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. ఆర్థికపరిస్థితి అంతంత మాత్రమే.

**వృశ్చికం:** ప్రముఖుల నుండి సలహాలు స్వీకరిస్తారు. పుణ్యక్షేత్రాల సందర్శనం. శుభవార్తలు అందుకుంటారు.

**ధనుస్సు:** వ్యాపారాలలో ఆటంకాలు ఏర్పడి చికాకులు పెడతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రముగా వుంటుంది.

**మకరం:** ఋణబాధలు తప్పవు. కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**కుంభం:** నూతన మిత్రులతో పరిచయాలు పెరుగుతాయి. సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది.

**మీనం:** వ్యవహారాలలో విజయం సాధిస్తారు. దూరప్రాంతాల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి. ధనలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్


### పసివారిని రక్షిస్తూ మరణించిన

# ప్లహాద్ కుమారులు

### గుల్జార్‌హౌజ్ అగ్ని ప్రమాదంలో ఒక కుటుంబంలో 15 మంది, మరో కుటుంబంలో ఇద్దరు మృత్యువాత









అగ్ని ప్రమాదంలో మరణించిన ప్రహ్లాద్ మోడీ, మున్నీ మోడీ, పంకజ్ మోడీ, వర్ష మోడీ, రాజేందర్ కుమార్ మోడీ, సుమిత్ర మోడీ, అభిషేక్ మోడీ

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** పాతబస్తీలోని గుల్జార్‌హౌజ్‌లో ఆదివారం ఉదయం సంభవించిన భారీ అగ్ని ప్రమాదం రెండు కుటుంబాల్లో పెను విషాదం నింపింది. ఈ ప్రమాదంలో ఒక కుటుంబంలో కుటుంబ పెద్దతో పాటు ఆయన భార్య ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, పెద్ద కోడలు, మనవళ్లు, మనవ రాళ్లు మొత్తం 15 మంది మరణించారు. రెండవ కుటుంబంలో కుటుంబ పెద్ద ఆయన భార్య చనిపోయారు. కాగా ఈ ఘటనలో ఫైర్ సర్వీస్ సేవలు సవ్యంగా లేవని, ఘటనా స్థలికి వచ్చిన అంబులెన్స్‌లో ఒక్కదానిలో కూడా ఆక్సిజన్ కిట్లు లేవని మృతుల కుటుంబీకులు చెబుతున్నారు. మృతులంతా హైదరాబాద్‌కు చెం దిన వారుగా పోలీసులు తెలిపారు.

పూనం చంద్ మోది అనే నగల వ్యాపారి హైదరాబాద్‌లోని గుల్జార్‌హౌజ్‌లో 70 ఏళ్లకు పైగా వ్యాపారం చేస్తున్నాడు. ఆయన పెద్ద కుమారుడు ప్రహ్లాద్ మోది, రెండవ కుమారుడు రాజేందర్ మోది గుల్జార్‌హౌజ్ వద్ద వున్న ఇంట్లో వుంటున్నారు. ఇద్దరు అన్నదమ్ములు ఇక్కడు బంగారు నగలతో పాటు ముత్యాల వ్యాపా రం చేస్తున్నారు. నగల వ్యాపారుల సంఘంలో వీరికి మంచి పేరు వుంది. ప్రహ్లాద్ మోది, రాజేందర్ మోది నగల దుకాణంలో మిస్ వరల్డ్ పోటీదారులు చార్మి నార్‌కు వచ్చినపుడు కొన్ని నగలను ఖరీదు చేయడం గమనార్హం. అయితే అనుకోని విపత్తులా ఆదివారం ఉదయం వీరి కుటుంబాలను అగ్ని ప్రమాదం రూపం లో కాటేసింది. ఏసి కంప్రెషర్ పేలడంతో మంటలు చెలరేగాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో చెలరేగిన మంటలు నిమిషాల వ్యవధిలోనే మొదటి, రెండవ అంతస్తుకు పాక డంతో అందులో వున్న వారు పొగ కారణంగా ఊపిరి పీల్చుకునేందుకు ఇబ్బంది పడ్డారు. ఈ సమయంలో ప్రహ్లాద్ మోది కుమారులు పంకజ్, అభిషేక్‌లు మొ దట మెట్ల మార్గం ద్వారా బయటకు వచ్చారు. ఇంతలో భవనంలో చిక్కుకున్న తల్లిదండ్రులతో పాటు ఇతర కుటుంబ సభ్యులను, చిన్నారులను కాపాడేందుకు మంటలు, పొగ వున్నా ధైర్యంగా వెళ్లారు. అయితే అక్కడ పొగ, మంటలు ఎక్కువగా వుండడంతో ఏమీ కానరాక కిందపడిపోయారు. ఈ ఘటనలో ప్రహ్లాద్ మోదితో పాటు ఆయన భార్య మున్ని భాయి మోది, కుమారులు పంకజ్ మోది, అభిషేక్ మోది, పంకజ్ మోది భార్య వర్ష, వారి ఇద్దరు కుమారులు, కుమార్తె మరణించారు. వీరితో పాటు ప్రహ్లాద్ మోది ఇద్దరు కుమార్తెలు శీతల్ జైన్, రజని గుప్తా వారి పిల్లలు ముగ్గురు కూడా చనిపోయారు. వీరితో పాటు ప్రహ్లాద్ మో ది సోదరుడు రాజేందర్ మోది ఆయన భార్య సుమిత్ర మోది కూడా కన్ను మూశారు. వాస్తవానికి ప్రహ్లాద్ మోది కొన్ని నెలల క్రితం అత్తాపూర్‌లో ఒక ఇంటిని ఖరీదు చేశారు. ఈ ఇంట్లోకి కుటుంబ సమేతంగా వెళ్లాలనుకున్నా వ్యాపార కార్యకలాపాలరీత్యా ఇంకా వెళ్లలేదు. ఈ ఇంట్లో ప్రహ్లాద్ మోది పెద్ద కుమారుడు గో విండ్ మోది వుంటున్నాడు. ఆయన కూడా తండ్రికి ఇంటికి శనివారం రావాల్సి వున్నా కొన్ని కారణాల వల్ల రాక పోవడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నా రు. ప్రహ్లాద్ మోది పెద్ద కుమార్తె శీతల్ జైన్ సనత్‌నగర్‌లో వుంటున్నారు. ఆమె భర్త రాజేష్ జైన్ వ్యాపారి. ఆయన కూడా మామగారి ఇంటికా రావాల్సి వుండ గా చివరి నిమిషంలో వ్యాపార కార్యకలాపాలరీత్యా రాలేదు. శీతల్ జైన్‌తో పాటు ఆమె కుమార్తె ఆరుషి జైన్ కూడా ఈ ప్రమాదంలో మరణించారు. ప్రహ్లాద్ మోది రెండవ కుమార్తె రజని గుప్తా బంజారాహిల్స్‌లోని మోతినగర్‌లో వుంటున్నారు. ఈ ప్రమాదంలో ఆమెతో పాటు ఇద్దరు పిల్లలు కూడా మరణించారు. ఈ దుర్ఘటన సమయంలో ఫైర్ సర్వీస్ సిబ్బంది సవ్యంగా వ్యవహరించలేదని మృతుల కుటుంబీకులు ఆవేదన చెందారు. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే అగ్ని మాపక యంత్రం వచ్చినా నీరు వేగంగా పంప్ చేసేందుకు అవసరమైన పొడవాటి పైప్ వెంట తేలేదని, ఇది వచ్చేసరికి ఆలస్యం అయ్యిందని వారు తెలిపారు. ఘటనా స్థలికి వచ్చిన అంబులెన్స్‌లలో దేనికీ ఆక్సిజన్ కిట్లు లేదని, ఇవి వుండివుంటే కచ్చితంగా కొందరు బతికి వుండే వారని మృతుల కుటుంబీకులు చెబుతు న్నారు. ప్రమాదం జరిగిన వెంటనే మజ్లిస్ నాయకులతో పాటు స్థానికులు వేగంగా స్పందించారని, వారికి కృతజ్ఞతలు చెబుతున్నట్లు మృతుల కుటుంబీకులు తెలిపారు.

## ఇందిర సౌర గిరి జల వికాస పథకం నేడు ప్రారంభం

>> అనంతరం స్వగ్రామం కొండారెడ్డిపల్లెకు చేరుకోనున్నారు. కొండారెడ్డిపల్లెలో ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత సాయంత్రం కొండారెడ్డిపల్లె నుంచి తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆర్‌ఓఎఫ్ఆర్ చట్టం,2006 ప్రకారం, 2,30,735 గిరిజనులకు అటవీ భూములపై హక్కులను గుర్తించి, 6.69 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అటవీ భూమిపై యాజమాన్యపు హక్కులు సంక్రమింపజేస్తూ ఆర్‌ఓఎఫ్ఆర్ హక్కు పత్రాలను జారీ చేసింది. ఇప్పటివరకు, 23,886 ఎస్టీ రైతులకు చెందిన 69,039 ఎకరాల భూమికి వివిధ పథకాల కింద రూ.141.57 కోట్ల వ్యయంతో నీటిపారుదల సౌకర్యాన్ని కల్పించడం జరిగినది. విద్యుత్తు సంబంధిత అంశాలపై అటవీ శాఖ అభ్యంతరాల వలన 2,10,000 గిరిజన రైతులకు సంబంధించిన మిగిలిన 6.00 లక్షల ఎకరాలు నీటిపారుదల సౌకర్యం, ప్రాథమిక సౌకర్యాలు జీవనోపాధి చర్యలు చేపట్టలేదు. 10.01.2025 తేదీన జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక పథకం కింద 100 గ్రాంట్‌తో ఆర్‌ఓఎఫ్ఆర్ భూములను కలిగి ఉన్న గిరిజన రైతులకు సోలార్ పంపు సెట్‌లను అందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క నాయకత్వంలో ప్రస్తుత ప్రభుత్వం ఆర్‌ఓఎఫ్ఆర్ భూములకు నీటిపారుదల సౌకర్యాలను కల్పించేందుకు ప్రాధాన్యత నిచ్చింది. సౌర పంపు ఆధారిత నీటిపారుదల వ్యవస్థలను అమలు చేయడం ద్వారా భూమి ఉత్పాదకతను పెంచడం.గిరిజన రైతుల జీవనోపాదిని మెరుగుపరచడం ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.దీని ప్రకారం,2,10,000 మంది గిరిజన రైతులకు చెందిన ఆర్‌ఓఎఫ్ఆర్ భూములు, అటవీ ప్రాంతంలోని నాన్-ఆర్‌ఓఎఫ్ఆర్ భూములు సమగ్ర భూ అభివృద్ధి కోసం భూమి అభివృద్ధి పనులు,ఉద్యాన వనాల అభివృద్ధి, సోలార్ పంపు సెట్ (ఆఫ్‌గ్రిడ్) ఆధారిత నీటిపారుదల సౌకర్యం కోసం ఇందిర సౌర గిరి జల వికాసం పథకం రూపొందించారు. రూ.12,600 కోట్ల మొత్తం బడ్జెట్ వ్యయంలో ఈ పథకం ఎస్‌టిడిఎఫ్ కింద ప్రతి లబ్దిదారునికి రూ.6లక్షల యూనిట్ ఖర్చుతో అమలు చేయనున్నారు.

## 'కమాండ్ కంట్రోల్'లో వరల్డ్'మిస్'లు

>> చేస్తున్న పలు విధానాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారు. బంజారాహిల్స్ లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ కు చేరుకున్న మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ లకు పోలీస్ అశ్వీక దళం, పైపు బ్యాండ్, మోటర్ సైకిల్ రైడర్స్, స్నిప్పర్ డాగ్ స్క్వాడ్ లతో పోలీస్ శాఖ స్వాగతం పలికింది. పోలీస్ కమాండ్ కంట్రోల్ ఆడిటోరియంలో ఈ కాంటెస్టులకు పోలీస్ శాఖ అమలు చేస్తున్న పలు విధానాలు, అవి పనిచేసే విధానంపై ప్రసెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పటిష్టమైన విధానాలవల్ల రాష్ట్రంలో 17 శాతం నేరాలు తగ్గాయని, వివిధ అంశాలలో తెలంగాణా పోలీస్ కు అంతర్జాతీయ అవార్డులు కూడా లభించాయని వివరించారు.

అనంతరం, తెలంగాణా పండగలు, సంస్కృతీ, సంప్రదాయాలను కళ్ళ ముందించేలా శాస్త్రీయ నృత్య ప్రదర్శనను వారు తిలకించారు.ఈ పర్యటనలో భాగంగా ఏర్పాటు చేసిన పోలీసు ఆయుధాల ప్రదర్శన, ఆక్టోపస్, గ్రే హౌండ్స్, పోలీస్ జాగిలాల ప్రదర్శనలు, పైప్ బ్యాండ్, అశ్వీక దళం లను కాంటెస్టర్లు ఆసక్తిగా పరిశీలించారు.

సెల్ఫీలను దిగారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను నిరంతరం పరిశీలించే అత్యాధునిక కమాండ్ కంట్రోల్ గదిలో ఏర్పాటు చేసిన ఆధినిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, సర్వేలెన్స్ ఫీడ్ లు, తక్షణమే స్పందించే వ్యవస్థను మిస్ వరల్డ్ కాంటెస్టర్లు స్వయంగా పరిశీలించారు. ప్రమాణాలు పెంపొందించడం, సురక్షిత టూరిజంకు, రాష్ట్ర అభివృద్ధికి భద్రతా చర్యలు ఎంతటి కీలక పాత్ర వహిస్తాయో తెలంగాణా పోలీస్ ను ఉదాహరణ చెప్పవచ్చని మిస్ వరల్డ్ కాంటెస్టర్లు అభిప్రాయం వ్యక్తం చేసారు. అనంతరం, మరే రాష్ట్రంలో లేని విధంగా, ట్రాఫిక్ నియంత్రణా చర్యలకు సేవలందిస్తున్న ట్రాన్స్ జెండర్లతో కలసి మిస్ వరల్డ్ కాంటెస్టర్లు ఫోటో దిగారు.

## ఓల్డ్ సిటీలోని గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాద ఘటన బాధాకరం

### కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** ఓల్డ్‌సిటీలోని గుల్జార్ హౌస్ వద్ద జరిగిన అగ్నిప్రమాదంలో 17మందిమరణించడం బాధాకరం అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశానని, మృతుల్లో చిన్నారులు సైతం ఉండడం దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. గాయపడ్డవారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి మోడీ స్పందించారని, దిగ్భ్రాంతి వ్యక్తం చేశారన్నారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా, క్షతగాత్రులకు రూ.50 వేల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి మళ్లీ నగరంలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

**ప్రగాఢ సానుభూతి: కేంద్రమంత్రి బండి సంజయ్**

పాతబస్తీలో గుల్జార్ హౌస్ వద్ద జరిగిన ఘటన బాధకరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు.. మృతుల కుటుంబాలను అన్ని విధాల కేంద్రం అండగా ఉంటుందన్నారు.

**మృతుల కుటుంబాలను ఆదుకుంటాం: ఉపముఖ్యమంత్రి భట్టి**

ఉస్మానియా మార్చురీకి చేరుకున్న ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు మందడి అనిల్‌కుమార్‌యాదవ్, చార్మినార్ నియోజకవర్గం శాసనసభ్యుడు మీర్‌జుల్ఫకర్ అలీపలువురు ప్రజాప్రతి నిధులు ఉస్మానియా మార్చురీకి చేరకున్నారు. మరణించిన కుటుంబాలక తమ ప్రగాడ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కుటుంబాలను ఆదుకుంటామని హామి ఇచ్చారు.

**సమగ్ర విచారణ జరిపించాలి: బిజెఎల్పీ నేత ఏలేటి**

హైదరాబాద్ పాతబస్తీలోని చార్మినార్ సమీపంలో ఉన్న గుల్జార్ హౌస్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగి 17 మంది మృత్యువాత పడడంతో దిగ్భ్రాంతి చెందానని బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు.

**ఉదారంగా నష్టపరిహారం అందించాలి : బిజెపి ఎంపిలు**

అగ్నిప్రమాదంలో 16 మంది మృతిచెందడం దురదృష్టకరం, అత్యంత బాధాకరం అని బిజెపి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. క్షతగ్రాత్రులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని ఎంపి డికె అరుణ పేర్కొన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను.

**రాజకీయాలు చేయాల్సిన సమయం కాదు : మాజీమంత్రి తలసాని**

షాట్ సర్క్యూట్ మూలంగా గుల్జార్ హౌజ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 17మంది మరణించడం భాదకరమైన విషయమని మాజీ మంత్రి, శాసనసభ్యులు తలసానిశ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరంలోనిపాతబస్తీలో ఘోర సంఘటన కలిచి వేసిందన్నారు.

## అంగన్‌వాడీ గుడ్ల టెండర్ల గడువు మరో 10 రోజులు

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్ల సరఫరా కోసం టెండర్ల గడువును మూడోసారి పొడిగించారు. ఈ నెల 15 తేదీ వరకు విధించిన గడువును మరో పది రోజులు పొడిగించారు. ఈ మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టరేట్ అధికారులు సర్క్యులర్ జారీ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో టెండర్లను తెరిచి తక్కువగా కోట్ చేసిన వారికి సరఫరా బాధ్యతలను కట్టబెడతారని అనుకుంటున్న తరుణంలో మళ్లీ గడువు పొడిగించడం విశేషం. కాగా తెలంగాణలోని అంగన్వాడీలలో చదివే పిల్లలకు నాణ్యమైన, పౌష్ఠికమైన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో అంగన్వాడీలకు కోడిగుడ్ల సరఫరా టెండర్లపై ప్రభుత్వం కొన్ని ఆంక్షలు విధించింది. అగ్‌మార్క్ రెప్లికా సీరియల్ నంబర్ కలిగిన వారే టెండర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చూసించినట్టు తెలుస్తోంది. అయితే ఈ టెండర్లపై ప్రభుత్వం విధించిన ఆంక్షలను సవాల్ చేస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు. అయితే ప్రభుత్వ ఆంక్షలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు ఇటీవల విచారణ చేపట్టింది. టెండర్ షరతులను సవాల్ చేస్తూ దాఖలైన అన్ని పిటిషన్లపై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు ఇరువైపు వాదనలు విన్న తర్వాత ఆ పిటిషన్లను కొట్టివేస్తూ నాలుగు రోజుల క్రితం కీలక తీర్పును వెలువరించింది. కోడిగుడ్ల టెండర్‌లో నాణ్యత కోసం ప్రభుత్వం విధించిన షరతులను హైకోర్టు సమర్థించింది.



## షోలాపూర్ ఫ్యాక్టరీలో ప్రమాదం

### ఎనిమిది మంది మృతి

**ముంబయి, మే 18:** సోలాపూర్‌జిల్లాలో ఆదివారం ఒక ఫ్యాక్టరీలో జరిగిన తీవ్రస్థాయి అగ్నిప్రమాదంలో ఎనిమిది మంది చనిపోయారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఒక చిన్నారి కూడా ఉన్నారని ఫైర్ అధికారులు తెలిపారు. తెల్లవారుఝామున 3.45 గంటలకు సెంట్రల్ టెక్స్‌టైల్ మిల్స్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తోంది. సోలాపూర్‌లోని అక్కల్‌కోట్‌రోడ్డులో ఉన్న ఎంఐడిసి ప్రాంతంలో ఉన్న ఈ ఫ్యాక్టరీలో ఈప్రమాదం జరిగింది. ఫ్యాక్టరీ యజమానికూడా చనిపోయారు. హాజీ ఉస్మాన్ హసన్‌భాయ్ మన్సూరి అని గుర్తించారు. ఆయన కుటుంబంలోని ముగ్గురుసభ్యులు కూడా చనిపోయారు. ఏడాదిన్నర మనుమడు, నలుగురు వర్కర్లు ఈ ప్రమాదంలో ప్రాణాలు వదిలారు. వీరిలో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు. మంటల తీవ్రత వల్ల ఫైర్ అధికారులకు మంటలు అదుపులోకి తెచ్చేందుకు ఆరుగంటలు పట్టిందని తెలిపారు.

## దేశంలోనే అత్యల్ప ద్రవ్యోల్బణం తెలంగాణలోనే

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త :** దేశంలోనే తెలంగాణ అత్యల్ప ద్రవ్యోల్బణాన్ని నమోదు చేసింది. ఏప్రిల్ నెలలో తెలంగాణలో ద్రవ్యోల్బణం 1.26 శాతంగా ఉంది. తెలంగాణ తర్వాత అత్యల్ప ద్రవ్యోల్బణం ఢిల్లీలో నమోదైంది. అక్కడ ద్రవ్యోల్బణం 1.77 శాతంగా నమోదైంది. ఈ రెండు రాష్ట్రాల్లో మాత్రమే ద్రవ్యోల్బణం రెండు శాతానికి దిగువగా ఉంది. భారతదేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 3.16 శాతానికి తగ్గిందని గణాంకాల శాఖ విడుదల చేసిన తాజా సమాచారం వెల్లడించింది. ఇది జూలై 2019 తర్వాత దేశంలో నమోదైన అతి తక్కువ స్థాయి ద్రవ్యోల్బణం. ముఖ్యంగా ఆహార ధరలు తగ్గడమే దీనికి ప్రధాన కారణంగా పేర్కొంది. తెలంగాణలో ఏప్రిల్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 1.26 శాతంగా నమోదైంది. ఇది మార్చిలో నమోదైన 1.06 శాతం కన్నా స్వల్పంగా పెరిగినా, దేశ సగటు స్థాయి 3.16 శాతం కంటే చాలా తక్కువ. ఈ రేటు భారత రిజర్వ్ బ్యాంక్ సూచించిన ఆరోగ్యకరమైన ద్రవ్యోల్బణ పరిధి (2 నుండి 4 శాతం ) కంటే దిగువగా ఉండడం గమనార్హం. విభాగాల వారీగా చూస్తే, తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం కేవలం 0.44 శాతంగా నమోదైంది, ఇది దేశంలో అత్యల్పంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో ఇది 1.99 శాతంగా ఉంది, ఇది ఢిల్లీ తర్వాత రెండవ తక్కువ రేటు. దేశస్థాయిలో గ్రామీణ ద్రవ్యోల్బణం సగటు 2.92 శాతం కాగా, పట్టణంలో అది 3.36 శాతంగా ఉంది. మార్చిలో 1.06 శాతం, ఫిబ్రవరిలో 1.31 శాతం, జనవరిలో 2.22 శాతం ద్రవ్యోల్బణంతో తెలంగాణ తక్కువ స్థాయిల్లో కొనసాగుతోంది. ఇది దేశంలో మొత్తం ద్రవ్యోల్బణం తగ్గుదల నేపథ్యంలో ముఖ్యమైన అంశంగా నిలుస్తోంది. ఆహార ధరల తగ్గుదలతో కలిపి, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం లోనవుతున్న తీరును ఇది ప్రతిబింబిస్తోంది. రాష్ట్రాలవారీగా చూస్తే, కేరళ ఏప్రిల్‌లోనూ దేశంలో అత్యధిక ద్రవ్యోల్బణాన్ని నమోదు చేసిన రాష్ట్రంగా నిలిచింది. ఇది వరుసగా నాల్గో నెలగా కొనసాగుతోంది. మార్చిలో 6.59 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 5.94 శాతానికి తగ్గినప్పటికీ, ఇది ఇప్పటికీ దేశంలో అత్యధికంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో కేరళ ద్రవ్యోల్బణం 6.46 శాతంగా ఉండగా, పట్టణాల్లో ఇది 4.91 శాతంగా నమోదైంది.

# జనావాసాల మధ్య ఆగని అగ్నికీలలు

**ఇరుకైన ప్రాంతాల్లోనూ రెండు నుంచి ఐదంతస్తుల భవనాలు**

**అనేకమందిని బలితీసుకొంటున్న అగ్నిప్రమాదాలు**

**గోదాములు, టన్నెళ్లను తలపించే మెట్ల మార్గాలు**

**ప్రమాదం వేళ మంటలు ఆర్పడం కష్టమవుతున్న వైనం**



**ప్రజల్లో అవగాహన మరింత పెరగాలంటున్న నిపుణులు**

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** జంట నగరాలలో వరుస అగ్ని ప్రమాదాలు ఆయా ప్రాంతాల ప్రజలను భీతిల్లేలా చేస్తున్నాయి. ఓవైపు జనావాసాల మ ధ్య గల గోదాములు, చట్ట వ్యతిరేకంగా కొనసాగుతున్న వాణిజ్య సంస్థల వద్ద జరుగుతున్న ప్రమాదాలు అక్కడి ప్రజలను హడలెత్తిస్తుండగా మరోవైపు ఇరుకైన ప్రాంతాలలో గల బహుళ అంతస్తుల భవనాల్లో సంభవిస్తున్న దుర్ఘటనలు అనేక మందిని బలితీసుకుంటున్నాయి. 2023 నవంబర్ నెలలో నాంపల్లిలోని బజా ర్‌ఘాట్‌లో జనావాసాల మధ్య గల రసాయన గోదాములో సంభవించిన ప్రమాదం కారణంగా పక్కనే గల ఇళ్లలో వున్న తొమ్మిది మంది మరణించిన ఘటన మ రువగా ముందే తాజాగా ఆదివారం నాడు గుల్జార్‌హౌజ్ వద్ద రెండతస్తుల భవనంలో చెలరేగిన మంటలకు రెండు కుటుంబాలకు చెందిన 17 మంది మృత్యువా త పడ్డారు. ఇటువంటి ఘటనలు జంట నగరాలలో వరుసగా జరుగుతున్నా సర్కారీ విభాగాలు నివారణ చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వున్నాయి.

దేశంలో ఐదవ అతిపెద్ద నగరంగా గుర్తింపు పొందిన హైదరాబాద్ నగరంలో అనేకచోట్ల కాలనీలు, జన సమ్మర్థం గల బస్తీలలో గల అపార్ట్‌మెంట్ల సెల్లార్లు, గ్రౌండ్ ఫ్లోర్లలో చట్ట విరుద్ధంగా కొనసాగుతున్న వ్యాపార సముదాయాలు అగ్ని ప్రమాదాలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. నిన్నమొన్నటి వరకు శివార్లలోని పారిశ్రామికవాడల్లోనే అగ్ని ప్రమాదాలు ఎక్కువగా సంభవించేవి. కానీ నేడు స్క్రాప్ గోదాములు, ప్లాస్టిక్ వస్తువుల గోదాములు, టింబర్ డిపోలు, హోటళ్లు, వాణిజ్య సంస్థలతో పాటు అపార్ట్‌మెంట్లలోని సెల్లార్‌లు, రహదారులపై గల రెండు నుంచి ఐదంతస్తుల భవనాలలో అనేక కారణాల వల్ల ప్రమాదాలు చెలరేగుతున్నాయి.

పారిశ్రామికవాడలతో పాటు గోదాములు, డిపోలలో అగ్నిప్రమాద నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సి వున్నా ఇలాంటివి ఎక్కడా కానరావడం లేద నేది బహిరంగ రహస్యమే. ఇరుకైనచోట్ల గల అపార్ట్‌మెంట్లతో పాటు ప్రధాన రహదారులపై గల బహుళ అంతస్తుల భవనాలలో అనుకోకుండా మంటలు చెలరేగి భారీ అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయి. 2023 నవంబర్ నెలో బజార్‌ఘాట్‌లో ఇలాంటి ప్రమాదమే జరగగా ఆదివారం గుల్జార్‌హౌజ్ వద్ద మళ్లీ ఇలాంటి ప్రమాదం సంభవించి 17 మందిని బలి తీసుకుంది.

మూడేళ్ల క్రితం బోయిగూడ టింబర్ డిపోలో సంభవించిన ఘోర అగ్ని ప్రమాదంలో 11 మంది స జీవ దహనం అవడం సంచలనం రేపింది. బోయిగూడలో పక్కపక్కనే గల టింబర్, స్క్రాప్ డిపోలు ఇరుకైన ప్రదేశంలో ఒకదానికి మరొకటి ఆనుకుని వుండడ ంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా వుంది. ఇక స్క్రాప్ డిపోలు సైతం ఇలాగే మారిపోయాయి. పాతబస్తీతో పాటు ముషీరాబాద్ నుంచి సికింద్రాబాద్ వరకు గల మార్గంలో పదుల సంఖ్యలో స్క్రాప్ గోదాములు వున్నాయి. వీటిలో అనేకసార్లు అగ్నిప్రమాదాలు సంభవించి కోట్లాది రూపాయల ఆస్తి నష్టం సంభవించాయి. ఇదే సమయంలో వీటి పక్కనే గల ఇళ్లు సైతం మంటల్లో చిక్కుకున్నాయి. రెండేళ్ల క్రితం సికింద్రాబాద్‌లోని రూబీ హోటల్ సెల్లార్‌లో ఎలక్ట్రిక్ వాహనాల గోదా ములో మంటలు చెలరేగి ఎనిమిది మంది మరణించారు.

దీని తరువాత రాంగోపాల్‌పేట్‌లో జరిగిన ఘటనలో ముగ్గురు కాలి బూడిదవగా అనంతరం సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన ఇంకో దుర్ఘటనలో ఆరుగురు మరణించారు. బజార్‌ఘాట్ ఘటనలో తొమ్మిది మంది మరణించారు. గుల్జార్‌హౌజ్ వద్ద రెండంతస్తుల భవనంలో చెలరేగిన ప్రమాదంలో 17 మంది మరణించారు. మొత్తం మీద రెండేళ్ల వ్యవధిలో నగరంలో జరిగిన భారీ అగ్ని ప్రమాదాల్లో వం ద మందికిపైగా మృత్యువాత పడ్డారు.

**ప్రజల్లో అవగాహన మరింత పెరగాలంటున్న నిపుణులు**

రాష్ట్రంలో ఇప్పుడున్న అగ్నిమాపక కేంద్రాలకు తోడుగా మరో 30 కేంద్రా లను ఏర్పాటు చేయాలని నిపుణులు కోరుతున్నారు. పట్టణ ప్రాంతాలు పెరుగుతున్న ఒదున అగ్నిమాపక కేంద్రాలను పెంచాల్సిన అవసరం వుందని వారంటున్నారు. ఇక అగ్ని ప్రమాదాలపై వాణిజ్య సంస్థలు, హోటళ్లు, ఇతర వర్గాలతో పాటు ప్రజలు ముఖ్యంగా అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్తుల భవనాల్లో వుండే ప్రజలు అగ్ని ప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ప్రమాదాలు సంభవించిన సమయంలో అగ్నిమాపక అధికారులు వచ్చేలోపు మంటలను అదుపు చేసేందుకు నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని వారంటున్నా రు. ఇదే సమయంలో అపార్ట్‌మెంట్లలో వుండే కమిటీలు, స్థానిక బస్తీ కమిటీలు ప్రమాదాల విషయంలో జాగ్రత్తలు పాటించాలని నిపుణులు కోరుతున్నారు. తా జా ఘటన తరువాత అగ్ని ప్రమాదాల విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని నిపుణులు కోరుతున్నారు.

## గాజాపై భీకర దాడులు..125 మంది మృతి



**గాజాసిటీ, మే 18:** గాజాపై ఇజ్రాయెల్ బాంబు దాడులు కొనసాగుతున్నాయి. హమాస్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులను కొనసాగిస్తోంది. శనివారం అర్ధరాత్రి నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్న పలు నివాసాలు, శిబిరాలపై టెల్ అవీవ్ వైమానిక దాడులు జరపడంతో ఖాన్ యూనిస్‌లో 20 మంది, ఉత్తర గాజాలో 36 మంది, బాలియాలోని శరణార్థి శిబిరంలో 10 మంది సహా మొత్తం 125 మంది మరణించారని అక్కడి అధికారులు ప్రకటించారు. మొత్తం మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన 9 మంది ఉన్నారని, వారిలో ఏడుగురు చిన్నారులు ఉన్నారని అధికారులు తెలిపారు.

పదుల సంఖ్యలో క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. తాజా దాడులపై ఇజ్రాయెల్ సైన్యం ఎలాంటి ప్రకటన చేయలేదు. మార్చి 18న కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన జరిగినప్పటి నుంచి 3 వేల మందికిపైగా పాలస్తీనియన్లు మృత్యువాత పడినట్లు అక్కడి విదేశాంగ శాఖ వెల్లడించింది. ఇదిలావుంటే ఇజ్రాయెల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు ఇటీవల కీలక ప్రకటన చేశారు. కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపునకు హమాస్ అంగీకరించని కారణంగానే దాడులను తీవ్రం చేసినట్లు తెలిపారు.

తమ బందీలను విడుదల చేయడానికి హమాస్ పదేపదే నిరాకరిస్తోందని ఆయన ఆరోపించారు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ ప్రతిపాదించిన కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపునకు నిరాకరించిందని అన్నారు. గాజాలోని హమాస్ స్థావరాలే లక్ష్యంగా దాడులు చేస్తున్నామని ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

## ప్రపంచంలోనే తొలి ఎఐ క్లినిక్ 'డాక్టర్ హువా'

### సౌదీలో ప్రయోగాత్మకంగా అమలు

**న్యూఢిల్లీ, మే 18:** కృత్రిమ మేధ సాయంతో రోగులను పరీక్షించే క్లినిక్ ప్రపంచంలోనే తొలిసారిగా సౌదీ అరేబియాలోప్రారంభించారు. చైనాకు చెందిన వైద్య విజ్ఞాన సంస్థ సైన్యీ ఎఐతో భాగస్వామ్యంతో ఆల్‌మూసా హెల్త్‌గ్రూప్‌ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తెచ్చింది. సౌదీలోని అల్ ఆహ్సా ప్రావిన్స్‌లో ఏర్పాటుచేసారు. రోగులతో తొలుత సంభాషించి వ్యాధి నిర్ధారణ, చికిత్స చేసే బాధ్యత వైద్యులనుంచి తప్పించడం ఈ ఎఐ క్లినిక్‌ప్రత్యేకత. ముందుజాగ్రత్తగా వైద్యుల పర్యవేక్షణ కొనసాగుతుందని, వ్యాధి నిర్ధారణ, చికిత్స ఫలితాలు సమీక్షిస్తారని సైన్యీ సంస్థ తెలిపింది. ఎఐ వైద్యవ్యవస్థకు డాక్టర్ హువా అని పేరు పెట్టారు. క్లినిక్‌కు వచ్చాక ఒక ట్యాబ్ సాయంతో ఎఐకి తమ వ్యాధి లక్షణాలను రోగి వివరించాలి. వెంటనే అది మరిన్ని ప్రశ్నలు సంధిస్తుంది. మానవ సహాయకుల సాయంతో సేకరించిన డేటాను చిత్రాలను విశ్లేషిస్తుంది. ఈ ప్రక్రియ పూర్తికాగానే డాక్టర్ హువా ఒక చికిత్సప్రణాళికను అందిస్తుంది. దీన్ని వైద్యుడు కూలంకషంగా సమీక్షించి సంతకంచేస్తారు. అయితే ఎఐ పరిశీలించలేని అత్యవసర కేసుల కోసం వైద్యులు అందుబాటులో ఉంటారు. ప్రస్తుతం ఈ ఎఐ డాక్టర్ ద్వారా ఉబ్బసంసహా 30 రకాల శ్వాసకోశ రుగ్మతలకు సంబంధించిన కన్సల్టేషన్‌సేవలు అందిస్తున్నారు. వైద్యుల డేటాబేస్‌ను విస్తరించి 50వరకూ శ్వాస, జీర్ణకోశ, చర్మసంబంధ వ్యా ధులకు ఈ సేవలను అందించాలని భావిస్తున్నట్లు సైన్యీ ఎఐ తెలిపింది.



## మధ్యస్థంగా జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్ష

**22 నుంచి అందుబాటులో రెస్పాన్స్‌షీట్లు**

**26న ప్రాథమిక కీ.. జూన్ 2 ఫలితాలు విడుదల**


**పరీక్షను నిర్వహించిన ఐఐటి కాన్పూర్**

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** దేశంలోని ప్రతిష్టాత్మకమైన ఐఐటీల్లో చేరడానికి జాతీయ స్థాయిలో నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జెఇఇ) అడ్వాన్స్‌డ్-2025 పరీక్ష ఆదివారం దేశ వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. ఉదయం పేపర్-1 జరగగా.. మధ్యాహ్నం పేపర్-2ను నిర్వహించారు. పేపర్-1కి సంబంధించిన ప్రశ్నాపత్రం మధ్యస్తంగా ఉన్నట్టు విద్యార్థులు, జెఇఇ నిపుణులు చెబుతున్నారు. గణితం, ఫిజిక్స్ మధ్యస్థంగా ఉండగా.. కెమిస్ట్రీ ప్రశ్నలు సులువుగా ఉన్నట్టు విద్యార్థులు చెబుతున్నారు. మొత్తం 48 ప్రశ్నలు రాగా .. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఒక్కో సబ్జెక్టు నుంచి 16 ప్రశ్నలు చొప్పున ఇచ్చారు. జెఇఇ అడ్వాన్స్‌డ్- 2025 పరీక్షను ఐఐటి కాన్పూర్ నిర్వహించింది. విద్యార్థులకు సంబంధించిన రెస్పాన్స్‌షీట్స్‌ను ఈ నెల 22 నుంచి అందుబాటులోకి ఉంచనున్నట్టు ఐఐటీ కాన్పూర్ ప్రకటించింది. ఈ నెల 26న ప్రాథమిక కీని విడుదల చేయనున్నారు. 26, 27 తేదిల్లో అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఫైనల్ కీని ఫలితాలను జూన్ 2న విడుదల చేయడానికి ఐఐటీ కాన్పూర్ ప్రణాళికను సిద్ధం చేసింది. జెఇఇ అడ్వాన్స్‌డ్-2025కి .. దేశ వ్యాప్తంగా జెఇఇ మెయిన్ పరీక్ష రాసిన వారిలో 2.50 లక్షల మందికి అర్హత కల్పించారు. పేపర్-1 పరీక్షను ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ... పేపర్-2 పరీక్షను మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహించారు. జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షకి తెలంగాణ రాష్ట్రంలోని 13 నగరాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని హైదరాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, కోదాడ, వరంగల్, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నల్గొండ, నిజామాబాద్, సత్తుపల్లి, సిద్ధిపేట, సూర్యాపేట నగరాల్లో పరీక్ష జరుగుతుంది. తెలంగాణ నుంచి సుమారు 40వేల మంది వరకు హాజరయ్యే అవకాశం ఉంది.

## జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు బంద్

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త :** తెలుగు సినిమా ప్రేక్షలకు అనూహ్య షాక్ తగిలింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఫిల్మ్ ఎగ్జిబిటర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. వచ్చే జూన్ 1వ తేదీ నుంచి రెండు రాష్ట్రాల్లో సినిమా థియేటర్లు బంద్ చేయాలని నిర్ణయించారు. అద్దె ప్రాతిపదికన సినిమాలను ప్రదర్శించలేమని, పర్సంటేజీల రూపంలో చెల్లిస్తేనే సినిమాలు ప్రదర్శిస్తామని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు నిర్మాతలకు లేఖ రాయాలని ఫిల్మ్ ఛాంబర్ కార్యాలయంలో నిర్వహించిన ఎగ్జిబిటర్ల సంయుక్త సమావేశంలో తీర్మానించారు. అప్పటివరకు థియేటర్లన్నీ మూసేయాలని భావించారు. కాగా, గతంలోనూ ఎగ్జిబిటర్లు ఈ తరహా డిమాండ్ చేశారు. కాకపోతే అప్పుడు సింగిల్ స్క్రీన్స్ థియేటర్లలో ఇకపై అద్దె ప్రాతిపదికన కాకుండా వాటాల విధానంలోనే సినిమాలను ప్రదర్శిస్తామని స్పష్టం చేశారు. బెనిఫిట్ షోలు, అదనపు ఆటలను ప్రదర్శించడం వల్ల నష్టపోతున్నామని, అందువల్ల వాటిని కూడా నిలిపివేయాలని నిర్ణయించుకున్నట్లు తెలంగాణ ఎగ్జిబిటర్స్, నిర్వహణ అసోసియేషన్ సభ్యులు నాడు ప్రకటించారు.

అయితే తరచూ ఎగ్జిబిటర్లు ఈ తరహా డిమాండ్ చేయడంతో నిజంగానే థియేటర్ల మనుగడ కష్టంగా కనిపిస్తోందని సినీ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. ఓటీటీ ప్లాట్ఫామ్స్ వచ్చాకే ఈ పరిస్థితి వచ్చిందని అంటున్నారు.



## ముంబయి ఎయిర్‌పోర్టు సిబ్బంది నుంచే బంగారం స్వాధీనం!

### కస్టమ్స్ అధికారుల వలలో రూ.5.10 కోట్ల బంగారం

**ముంబయి, మే 18:** ముంబయి ఎయిర్‌పోర్టులో విదేశాలనుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణీకులనుంచి కస్టమ్స్ అధికారులు రూ.5.10 కోట్ల విలువైన బంగారం స్వాధీనంచేసుకున్నారు. ఎయిర్‌పోర్టు లాంజ్‌లో పనిచేస్తున్న ఒక వ్యక్తి బయటకువెల్లేప్రాంతం దాటుతుండగా అడ్డగించి తనిఖీచేస్తే ఆతడివద్ద ఆరు గోల్డ్‌పౌచ్‌లు లభించాయి. వాటిని ఆతడు లోదుస్తుల్లో దాచినట్లు తేలింది. ఆపౌచ్‌లలో మైనం రూపంలో ఉన్న బంగారుధూళి ఉంది. నికరబరువు 2800 గ్రాములు. విలువ 2.48 కోట్లరూపాయలుంటుందని తెలిపారు. ఈ బంగారాన్ని ఒకట్రాన్సిట్‌ప్రయాణీకుడు ఆతడికి ఇచ్చనట్లు తేలింది. మరోకేసులో విమానాశ్రయంలో కాంట్రాక్టుప్రాతిపదికన చేస్తున్న ఒక వ్యక్తి బయలుదేరే ప్రాంతంలో నిష్క్రమణ స్థానం దాటుతుండగా అడ్డగించి తనిఖీలుచేసారు. తనిఖీలునిర్వహించాక ఆతడినుంచి మరో ఆరుపౌచ్‌లు స్వాధీనంచేసుకున్నారు. మొత్తం2950 గ్రాముల బరువున్న బంగారుమైనం ఉంది. విలువ రూ.2.62 కోట్లుగా ఉంటుందని అంచనా. నిందితుడు జాకెట్‌జేబులో బంగారుమైనం దాచి ఉంచారు. ఈ మొత్తం ఒకట్రాన్సిట్‌ప్రయాణీకుడు ఆతడికి అందించాడని కస్టమ్స్ అధికారులు తెలిపారు. ఇద్దరినీ అరెస్టుచేసి 1962 కస్టమ్స్ చట్టం కింద కేసునమోదుచేసారు. అలాగే శనివారం కూడా ముంబయి డిఆర్ఐ అధికారులు ఆడిస్ అబాబానుంచి వచ్చిన చాడియన్ దేశస్తుడుని తనిఖీచేస్తే తన చెప్పుల మడమలలో తెలివిగా దాచిన విదేశీ మూలం బంగారు కడ్డీలను గుర్తించారని అధికారులు తెలిపారు. మొత్తం బరువు 4015 గ్రాములు విలువ 3.86 కోట్లు అని తేలింది.

# గిరిజనుల కల నెరవేరుతోంది..

**ఇందిరా సౌర గిరిజల వికాసంతో సాధ్యం**

**రెండు లక్షల రైతులకు ప్రయోజనం: మంత్రి జూపల్లి**



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 18, ప్రభాతవార్త:** శతాబ్దాల కాలం నుండి అడవు లను నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్న గిరిజనుల ఆర్థిక అభివృద్ధి తోడ్పాటు కల ఇందిరా సౌర గిరిజల వికాసంతో సహకారం కానుందని ఎక్సైజ్ పర్యాటక సంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట నియోజకవర్గం, అమ్రాబాద్ మండలం, మాచారంలో సోమవారం ఇందిర సౌరగిరి జల వికాస పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభి స్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అచ్చంపేట శాసనసభ్యుడు చిక్కుడు వంశీకృష్ణ, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌లతో కలిసి ఆదివారం మంత్రి జూపల్లి కృష్ణా రావు బహిరంగ సభ, ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పా ట్లు, ఇందిర సౌరగిరి జల వికాస పథకం లబ్ధి దారులైన రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమాల ఏర్పాట్లను, హెలిపాడ్ నిర్మాణ పనులను, మీడియా పాయింట్ ఏర్పాట్లు, బారి కేడింగ్, బందోబస్తు వంటి అంశాలను ముఖ్యమంత్రి భద్రత సిబ్బందితో కలిసి పరిశీలించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. అడవిని నమ్ముకున్న గిరిజనులకు పోడు భూముల పట్టాలి ఇచ్చి బోర్లు వేయించి సౌర విద్యుత్ ద్వారా సాగునీటి వసతులు కల్పించి పండ్ల తోటలను పెంచుకునే విధంగా పండ్ల మొక్కలు నాటి లబ్ధిదారులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఒక ఎకరానికి ఆరు లక్షల రూపాయలను ఖర్చు చేసి ప్రభుత్వం నిధులనుండే ఖర్చు చేస్తున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కొరకు ప్రత్యేకంగా ఆలోచన చేసి వారి ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం పెద్ద రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుండి ఎత్తున ఇందిరా సౌర గిరి జల వికాసం పథకానికి నిధులు కేటాయించినట్లు, 2 లక్షల రైతులకు ప్రయోజనం చేకూర్చనున్నట్లు మంత్రి చెప్పారు. ఈ పథకాన్ని మా పాలమూరు జిల్లాలో ప్రారంభిస్తున్నందున మహబూబ్‌నగర్ జిల్లా గిరిజన సోదరుల తరపున గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక అభినందనలు తెలిపారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, గిరిజనుల సంక్షేమం కోసం 12,600 కోట్ల రూపాయలతో ముఖ్యమంత్రి చేతులమీదులుగా ఇందిర సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభం కానున్నదని తెలిపారు. అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ.. నల్లమల్ల అటవీ ప్రాంతమైన అచ్చంపేట నియోజకవర్గంలో ఇందిరా సౌరగిరి జల వికాస పథకం మా నియోజకవర్గ ప్రజల మధ్యలో ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

**భారత్ డైనమిక్స్ లిమిటెడ్**
(భారత ప్రభుత్వ సంస్థ)
రక్షణ మంత్రిత్వ శాఖ
గచ్చిబౌలి, హైదరాబాద్ - 500 032

Ref: BDL/CC/OT/GT/001/2025-26 తేది: 19.05.2025

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన**

దేశీయ పోటీ బిడ్డింగ్ ఆహ్వానిస్తోంది

| క్ర.సం. | టెండర్ ID | వివరణ |
|---|---|---|
| 1 | 66328 | BDL యొక్క అన్ని యూనిట్‌లకు మందుల సరఫరా |

తదుపరి వివరాలకు వెబ్‌సైట్ https://bdltenders.abcprocure.com దయచేసి వీక్షించండి. బిడ్‌లను ఆన్‌లైన్ మాత్రమే దాఖలు చేయవలెను. "సవరణ ఏదైనా మా ఇ-పోర్టల్ ద్వారా మాత్రమే జారీ చేయబడుతుంది మరియు వార్తా పత్రికలలో కాదు"

అడిషనల్ జనరల్ మేనేజర్

వార్త

మనం తలపెట్టిన కార్యం మంచిదనే నమ్మకం మనకున్నప్పుడు, అవాంతరాలెన్ని ఎదురైనప్పటికీ పట్టించుకోరాదు.

న-ఫిలిప్‌మాసింగర్

# అగ్ని ప్రమాదాలు ఆపలేమా!

ప్రమాదాలంటే అనుకోకుండా వచ్చేవని అందరికీ తెలిసిన విషయమే. అయినా ప్రమాదాల నివారణ, నిరోధకతలో మనమెంత వెనుకబడి ఉన్నామో ఆదివారం తెలతెలవారుతుండగా జరిగిన దుస్సంఘటన వివరాల్లోకి వెళ్తే ఎవరికైనా ఒళ్ళు జలదరిస్తుంది. భాగ్యనగరంలో భారీ అగ్నిప్రమాదంలో ఒక వ్యాపారి కుటుంబానికి చెందిన బంధు వర్గమంతా సజీవ దహనం అయ్యారన్న సమాచారం దిగ్భ్రాంతి కలిగించే విషయం. హైదరాబాద్ పాత బస్తీ చార్మినార్ ప్రాంతంలో గుల్జార్ హౌస్ కింద అంతస్తులో కృష్ణ పెరల్స్ వ్యాపారం నిర్వహిస్తూ, మొదటి అంతస్తులో నగల వ్యాపారి నివాసం ఉంటున్నారు. ఆదివారం తెల్లవారుఝామున జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో 17 మంది సజీవ దహనం అయ్యారు. వారిలో 8 మంది చిన్నారులున్నారు. ఒక్కసారిగా మంటలు చెలరేగి భవనమంతటా వ్యాపించాయి. బాధితులు మంటలు, కమ్ముకున్న పొగలను దాటుకుని బయటకు రాలేక అక్కడికక్కడే దగ్ధమయ్యారు. ముగ్గురు అక్కడికక్కడే చనిపోగా మరో 14 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. హైదరాబాద్ చూడటానికి సెలవుల్లో తమ పిల్లలతో వచ్చిన నాలుగు కుటుంబాల సభ్యులు అగ్నికి ఆహుతి అయ్యారు . వీరిలో చాలా మంది బెంగాల్ వాసులే. వారి శరీరాలు బాగా కాలిపోయినందున చికిత్స వరకు తరలించలేక పోయే పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రమాదానికి కారణం ఎలెక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ వల్లనేనని ప్రాథమిక అభిప్రాయానికి వచ్చారు. ఈ ప్రమాద స్థలికి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది సన్నద్ధతపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వెలిబుచ్చారు. అగ్ని మాపక దళాల వద్ద ఆక్సిజన్ పరికరాలు ఏవీ లేకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. కొన్ని అగ్ని ప్రమాదాలు మాత్రం మానవ నిర్లక్ష్యం ,తప్పిదాల వలనే వస్తాయన్నది అంగీకరించాల్సిన విషయం. ఇలాంటి ప్రమాదాలను అరికట్టే విషయంలో ప్రభుత్వాలు అగ్ని మాపక యంత్రాంగాన్ని సిద్ధం చేయకపోవడమూ ఒకటి. అదే జరిగితే దానికి ప్రభు త్వాలే బాధ్యత వహించాల్సి ఉంటుంది. అసలే వేసవి కాలం. ఎక్కడో అక్కడ చిన్నదో, పెద్దదో అగ్ని ప్రమా దాలు జరుగుతాయనేది ప్రతీతి. అగ్ని మాపక దళం వారు ఈ సీజన్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా చూసేందుకు ప్రత్యేక అగ్నిమాపకవారోత్సవాలు కూడా నిర్వహించడం పరిపాటి. అయినా అగ్నిమాపక నివా రణలో వారు తగినంత సమాయత్తమైన పరిస్థితి కనపడలేదు. దాదాపు జంట నగరాల్లో సంవత్సరానికి ఒక వెయ్యికి పైగా అగ్ని ప్రమాదాలు జరిగిన రికార్డు ఉంది. కాగా నేటి ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకునేసరికి ఆక్సిజన్ పరికరాలు తెచ్చుకోక పోవడంతో వారు ఏ మేరకు సన్నద్ధతలో ఉన్నదీ అర్థమౌతోంది. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రాణనష్టానికి దారితీసిన అగ్ని ప్రమాదాలన్నీ చేదు అనుభవాలనే మిగిల్చింది. ఈ మధ్య కాలంలో జరిగిన అగ్ని ప్రమాదాలలో ఇదే పెద్దది. ఇంతకు ముందు జరిగిన అగ్ని ప్రమాదాలతో పోల్చి చూసుకుంటే ఈసారి జరిగిన ప్రాణ నష్టం చాలా ఎక్కువే. కానీ ప్రమాదం జరిగిన రీతిని గమనిస్తే ఆ భవనంలో వారు నిద్రిస్తున్న సమయంలో మంటలు చుట్టుముట్టడం, పొగ చూరి ఊపిరాడకపోవడంతో ఎవరూ తప్పించు కోలేకపోయారు. 2023లో బజార్ ఘాట్ నాలుగు అంతస్తుల నివాస భవనంలో అగ్ని ప్రమాదం సంభవించి 10 మంది మరణించారు. గ్రౌండ్ ఫ్లోర్ కార్ గ్యారేజీలో రసాయన సీసాలు పేలడం వల్ల ఈ సంఘటన జరిగింది, ఇది త్వరగా పై అంతస్తులకు వ్యాపించి నివాసితులను ఇబ్బందులకు గురిచేసింది. వెంకటేశ్వర కాలనీ అగ్ని ప్రమాదంలో నాలుగు అంతస్తుల భవనంలో భారీ అగ్నిప్రమాదం సంభవించి, 10 ఏళ్ల బాలిక మృతి చెందింది. మార్చి 2023లో సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో ఆరుగురు మరణించారు.జనవరి 2023లో సికింద్రాబాద్ నల్లగుట్ట వద్ద ఓ బట్టల దుకాణంలో భారీ అగ్ని ప్రమాదంలో ముగ్గురు కార్మికులు సజీవ దహనమయ్యారు. సెప్టెంబర్ 2022లో సికింద్రాబాద్‌లోని ఓ బహుళ అంతస్తుల కాంప్లెక్స్‌లోని హోటల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందారు. మార్చి 2022లో సికింద్రాబాద్‌లోని ఓ స్క్రాప్ గిడ్డంగిలో జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో 11 మంది వలస కార్మికులు సజీవ దహనమయ్యారు. ఈ సంఘటనలు హైదరాబాద్లో అగ్నిమాపక భద్రతా చర్యలు, అత్యవసర సంసిద్ధత ప్రాముఖ్యతను తెలియ జేస్తున్నది. అగ్ని ప్రమాదాలు సంభవించకుండా జాగ్ర త్తలు తీసుకోవడం ద్వారా నివారించడం ఒకటైతే, మంట లను ఆర్పివేసి నిరోధించడం రెండవది. ఆపై ప్రాణ నష్టం కలుగకుండా చూసుకోవడమూ ముఖ్యమే. జంట నగరాల్లో అగ్ని ప్రమాదాలకు కారణం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ లేనని తెలిసినందున అలాంటి అగ్ని ప్రమాదా లను నివారించడానికి ముందు జాగ్రత్తలు తీసుకుంటే చాలు. నాణ్యత కలిగిన విద్యుత్ , వైరింగ్ ఉపకరణా లను వాడాలి. నీటి వనరుల దగ్గర లేదా తేమతో కూడిన ప్రాంతాలలో విద్యుత్ ఉపకరణాలను వాడరాదు.ఇలాంటి విషయాలను ప్రజల్లో అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

విజయం మేధావిని వినయవంతుణ్ని చేస్తుంది. సామాన్యుడిని ఆశ్చర్యపరుస్తుంది. అవివేకిని అహంభావిగా మారుస్తుంది.



స్వామి వివేకానంద

ఒక మనిషి అభివృద్ధికి, దిగజారడానికి స్వయంకృతమే కారణం అవుతుంది.



అబ్రహాంలింకన్

# ప్రజావాక్కు



### సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలి

చైనా దశాబ్దాల క్రితమే భారత్‌లోని తూర్పు భాగాన ఉన్న అరుణాచలప్రదేశ్ రాష్ట్రంలో సుమారు 38000 చదరపు కిలోమీటర్ల స్థలాన్ని చట్టవ్యతిరేకంగా ఆక్రమించుకుని తన స్థావరాలను ఏర్పరుచుకుంది. ఆ ప్రదేశంలో గడ్డి కూడా మొలవదని మన దేశాన్ని ఏలిన నాయకులు ఆ రోజుల్లోనే నిర్లక్ష్యంగా వదలివేసారు. ఆక్రమించుకున్న ప్రదే శాలకు చైనా తమ దేశానికి చెందిన పేర్లను పెడుతోందని నిన్న మొన్నటివార్త. వెంటనే విదేశాంగ శాఖ రంగం లోకి దిగి పేర్లు పెట్టుకున్నంత మాత్రాన అవి భారత్ భూభా గానికి చెందకుండా పోతాయా అని చప్పిడి మాటలు మాట్లాడుతోంది. చైనా ఆక్రమించిన మొదట్లోనే ఎందుకు ఖండించలేదు? మళ్ళీ మొదటికొస్తే పాక్ ఆక్రమిత కాశ్మీర్ నూ తెలిగ్గాతీసుకుంటూ అది భారత్‌లోనిదే అంటూ కాలయాపన చేసారు. మొండి వాడు రాజుకున్న బలవంతుడే నన్నసామెత మనమే పుట్టించుకున్నాము. భారత్‌తోశాంతి చర్చలకోసం ఉవ్విళ్లూరుతూ అనేక ఎత్తుగడలతో వస్తున్న పాకిస్థాన్ పిఓకేను వదలి పెడుతుందా? అనుమానమే.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### అక్రమ దందా

రాష్ట్రంలోమినరల్ వాటర్ పేరిటకోట్ల రూపాయల అక్రమ వ్యాపారం మూడు పూవ్వులు ఆరు కాయలుగా సాగు తుంది. పల్లెలు, పట్టణములు, నగరాలలో గుర్తింపు లేని వాటర్ ప్లాంట్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకు వచ్చి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి.అనుమతులు లేకుండా నీళ్ల వ్యాపారం నడుస్తుంది. అధికారులు కూడా మామూళ్లకి ఆశపడి ఈ వాటర్ ప్లాంట్‌ల వైపు చూడడం లేదు. మిన రల్ నీళ్లుతాగడం వల్ల కీళ్ల నొప్పులు, అనారోగ్యం బారిన పడుతున్నారు.అనుమతిలేని వాటర్ ప్లాంట్‌లను అధికారు లు తక్షణమే సీజ్ చేసి ప్రజల ఆరోగ్యంని కాపాడాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

### ఆడపిల్లలు జాగ్రత్త

నేడు సోషల్ మీడియా విస్తృతంగా వ్యాప్తి చెందింది. ఫేస్‌బుక్ ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ వాడకం అధికమైపో యింది.వీటివల్ల కొత్తస్నేహాలు, పరిచయాలు పెరిగిపో యాయి.మొదట్లో నమ్మకం కలిగించేలా ప్రవర్తిస్తూ తరు వాత తమ అసలు రూపాన్ని చూపెడుతున్నారు.

### విద్యాశాఖ ప్రత్యేక దృష్టి

దేశంలో ఏరాష్ట్రంలో లేనటువంటి పర్యవేక్షణతెలంగాణ ముఖ్య మంత్రి విద్యాశాఖపై చూపుతున్నారని చెప్పడం లో అతిశయోక్తి లేదు.ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న మరుక్షణం నుండి విద్యాశాఖ పై సమీక్షలు చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ఉపాధ్యాయ దీర్ఘకాలిక సమస్యల పై నిర్ణయం తీసుకున్నారు. 11062 టీచర్ పోస్టులు భర్తీ చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష సం..లో రెండు సార్లు నిర్వహిస్తున్నారు. ప్రతి స్కూల్‌లో మౌలిక వసతుల కోసం ప్రత్యేక నిధులు ఇస్తున్నారు. స్కావెం జర్ల వ్యవస్థ ఏర్పాటుచేశారు. వంట పాత్రలు కొత్తవి మంజూరు చేశారు. విద్యా సంవత్సరంముందే విద్యార్థులకు బుక్స్, యుని ఫాం ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. 25వేల మంది ఉపాధ్యా యులను కోరుకున్న చోటుకు బదిలీ చేశారు. దాదాపు 20 వేల మందికి ప్రమోషన్స్ ఇచ్చారు. ఇప్పుడు వేసవి సెలవుల్లో పాత కొత్తటీచర్లకి 5రోజుల శిక్షాణకార్యక్రమాలు నిర్వహించనున్నారు.

-రావుల రామ్మోహన్ రెడ్డి, హైదరాబాద్

### పారదర్శకతతో సీటు ఇవ్వాలి

దేశంలో కొన్ని వందల విశ్వవిద్యాలయాలు ఉంటాయి. వాటి పరిధిలో వేల విద్యార్థుల వృత్తి విద్యా కోర్సులు లక్షలు ఖర్చు చేసి, శ్రమతో భవిష్యత్తు కోసం రిస్క్ తీసుకుంటారు. అది ఏ కోర్సు అయినా అభ్యర్థి ర్యాంకు, కేటగిరి ఒకటే. సదరు ప్రవేశ పరీక్షకు అన్ని కోణాల్లో స్పష్టమైన నిబంధాలు ఉంటాయి. కళా శాల ప్రవేశం సమాన ప్రతిభ ఉన్నప్పుడు, ఏ అంశం మీద ప్రా ధాన్యత ఉందో తెలియపరుస్తూ అభ్యర్థికిలేక పేరెంట్‌కి అను మానం నివృత్తి చేయడం అవసరం. అభ్యర్థులు వారికి సీటు రానందుకు కోర్టునీఆశ్రయించడం, తిరిగి యూనివర్సిటీ కోర్టుకి వెళ్ళడం,విద్యార్థికి నష్టపరిహారం ఇవ్వడం చిన్నవిషయం కాదు.

- బొల్లోజు మేఘానధ్, విశాఖపట్నం

### టేకు కర్ర తరలింపులు

వనమహోత్సవాలు ఒకపక్క జరుగుతుంటే మరొకప్రక్క అడవు లలోఉన్న టేకుకర్రతో కొందరు దొంగ చాటుగా ఫర్నిచర్ కోసం బడా వ్యాపారాలు చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో గంగారం కొత్త గూడా మండలాలలో ఈ వ్యాపారం ఎక్కువగా దొరుకుతుంది. అడవీ శాఖ అధికారులు ఈ ప్రాంతాలలో జరు గుతున్నఈవ్యాపారాన్ని నిలిపివేయాలి.వనసంరక్షణ జర గాలి. రాజకీయ జోక్యం అధికారుల అలసత్వం వీడాలి.

-రాపాక రవీందర్, జనగాం

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# న్యాయస్థానాల వికేంద్రీకరణ అవసరమే!

**విశాఖపట్టణం అన్ని సదుపాయాలతో అలరారుతున్న అద్భుతనగరం. అక్కడ హైకోర్టు బెంచి నెలకొల్పబడటం కూడా అందరూ అభిలషిందగ్గ విషయమే. యుపిలో అలహాబాదులో హైకోర్టుతో పాటు లక్నోలో మహారాష్ట్రలో ఔరంగాబాదు, నాగపూర్‌లో హైకోర్టు బెంచిలు ఉన్నాయి. ఇలా పనిఒత్తిడితో న్యాయం సామాన్యుడికి అందుబాటులో ఉండటం కోసం చాలా రాష్ట్రాలలో హైకోర్టు బెంచిల డిమాండ్లు పెరుగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితులలో న్యాయస్థానాలు ముఖ్యంగా ఉన్నత న్యాయస్థానాలు ప్రజలకు అందుబాటులో ఉన్నప్పుడే వికేంద్రీకరణ అన్ని రంగాలలో జరుగుతున్నదన్న నైతిక బలాన్ని సమన్యాయాన్ని అందుబాటులోకి తెచ్చిన భావన కలుగుతుంది. ప్రధాని మోడీ అన్ని వ్యవస్థలను బలోపేతం చేసినట్లే హైకోర్టు బెంచీల అవశ్యకతను గుర్తించి న్యాయ వ్యవస్థను కూడా బలపర్చాలి. ప్రస్తుతానికి ఎపిలో హైకోర్టు బెంచి కర్నూలులో రావటం ఖాయమని అనిపిస్తున్నది.**



రావులపాటి సీతారాంరావు

కొన్నాళ్ల క్రిందటి వరకూ ఒక సామెత లాంటిది ప్రజల నోళ్లల్లో నానుతుండేది. మహమ్మద్ మౌంటెన్ దగ్గరకు పోకపోతే, మౌంటెనే మహ మ్మద్ దగ్గరకు వస్తుందనే అతిశయం తో కూడిన మాట వాడుకలోఉండేది. పోలిక సరిగ్గా ఉంచకపోవచ్చు. కానీ ప్రజాస్వామ్యం ద్వారానే పాలనసాగా లనుకున్న దేశాలలో ప్రజలచేత ఎన్ను కోబడ్డ ప్రభుత్వాలే ప్రజల వాకిట ఉండి పాలన సాగిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండక తప్పదు. ప్రభుత్వం అనేది ఒక విధంగా మేరు పర్వతంలాంటిదే. అక్కడికి చేరుకోవటం సామాన్యుడికి సాధ్యపడకపోవచ్చు. అయినాసరే 'గవర్న మెంట్ ఎట్ యువర్ డోర్ స్టెప్' అన్న భావనకు న్యాయం జరుగుతున్నదని ప్రజలు భావించిన నాడు ప్రజాస్వామ్యం లో ప్రభుత్వ బాధ్యత ప్రజలు ఏర్పరుచుకున్న లక్ష్యం నెర వేరినట్లే అని అనుకోక తప్పదు. ప్రభుత్వానికి ముఖ్యమైన అంగం న్యాయవ్యవస్థ. మిగతా రెండు అంగాలూ పాలనా వ్యవస్థ, శాసన వ్యవస్థ తమ విధులను సంతృప్తికరంగా నిర్వహించినినాడు ఆదేశంలో ప్రజలు ఎప్పుడూ ప్రజాస్వా మ్యాన్నే కోరుకుంటారు. ఈ మధ్యకాలంలో పాలనా ఫలం చిట్టచివరి పౌరుడికి కూడా చేరాలనే అభిలాష విజ్ఞులూ రాజ కీయులూ, అధికారులే కాదు ప్రజలు కూడా మనసా వాచా వాంఛిస్తున్నారు. దానికి అనుగుణంగానే డివిజన్ ఆఫ్‌పవర్స్ చేపట్టేనే పాలన ఫలవంతంగా మారుతుందని ఏకాభిప్రా యంగా అందరి నోటా వినపడుతున్నది. న్యాయవ్యవస్థను కూడా ప్రజలకు చేరువగా తీసుకొనిపోవటం ద్వారా న్యాయ పాలన అందుబాటులో తెచ్చినట్లవుతుందని న్యాయం అంద రికీ అందే విధంగా ఉంటుందని ప్రభుత్వాలు చాలా కాలం నుంచి ప్రణాళికలు ఈమార్గంలో రచిస్తున్నాయి. మహారాష్ట్ర లాంటి రాష్ట్రాలలో హైకోర్టు (రాష్ట్రంలోని ఉన్నత న్యాయ స్థానం) బెంచీలు ఒకటి, రెండు ప్రాంతాలలో ఏర్పాటు చేసి న్యాయం సత్వరం అందేలా రాజధానికి రానవసరం లేకుం డానే ఉన్నత న్యాయస్థానపు వ్యవస్థను దగ్గరకు తెచ్చి, ప్రజ లకు న్యాయం చేస్తున్నది. తెలుగు రాష్ట్రాలలో తెలంగాణలో దాదాపు అన్ని జిల్లాల ప్రజలు మూడు గంటలలోనే (హైదరాబాద్) రాజధానికి వచ్చి ఉన్నత న్యాయస్థానంలో న్యాయ సంబంధిత విషయాలు తేల్చుకోవడానికి వెసులు బాటు ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో అమరావతిలోని హైకోర్టుకు లిటిగేషన్ల సందర్భంగా ఇతర జిల్లాల నుంచి లాయర్లు, ప్రజలు రావడానికి దూరాల వల్ల ఎక్కువ కాలం ప్రయాణా ల్లోనే ఉండాల్సి వస్తుంది. ముఖ్యంగా రాయలసీమలో హైకోర్టు బెంచి ఒకటి ఏర్పాటు చేయాలని ఎంతో కాలం నుంచి ఉన్న డిమాండ్‌ను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వేగిరం తీర్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తెలుపుతున్నాయి. రాష్ట్ర అసెంబ్లీ కర్నూలులో హైకోర్టు బెంచిని ఏర్పాటు చేసేందుకు ఏకగ్రీవ తీర్మానం ఆమోదించింది. సంబంధిత కార్యక్రమాలు కూడా వేగిరం జరుగుతాయన్న ఆశ రాయలసీమ ప్రజలకు ఏర్పడింది. కర్నూలులో ఏర్పడబోతున్న హైకోర్టు బెంచి వల్ల న్యాయ పాలన వికేంద్రీకరించబోతున్నది. రాష్ట్ర హైకోర్టు పరిధిలోని





కేసుల్లో దాదాపు 33 శాతం రాయలసీమకు చెందినవే. హైకోర్టు మొత్తం అమరావతి నుంచి కర్నూలుకు తరలిం చడం కంటే హైకోర్టు బెంచి కర్నూలుతో ఏర్పాటు చేయడం తేలిక అని అందరూ ఒప్పుకుంటున్నారు. ఇంతకు మునుపు హైకోర్టులోని కొన్ని రాయలసీమ కేసులను వర్చువల్ విధా నం ద్వారా పరిష్కరించే ఏర్పాటు చేసినప్పటికిని, రాయల సీమ జిల్లాల నుంచి లాయర్లు ఎనిమిది, తొమ్మిది గంటలు ప్రయాణం చేసి హైకోర్టులో మాండేటరీ పిటిషన్లు, రెగ్యులర్ అప్పీళ్లు వేయాల్సిన పరిస్థితి. బెంచి ఏర్పడితే రాయల సీమలోని నాలుగు జిల్లాలనుంచి పిటిషన్‌దారులు కర్నూలు కొచ్చి న్యాయ వ్యవహారాలు చూసుకొనే వెసులుబాటుతో పాటు అమరావతి దాకా దూరప్రయాణం చేసే పరిస్థితి తప్పుతుంది. కొందరు లాయర్లు హైకోర్టు బెంచి రాయల సీమకు చెందిన కర్నూలులో ఉండటం వల్ల మరికొన్ని లాభాలు కూడా చెప్పారు. సర్వీసు లిటిగేషన్లు, లేబర్ చట్టాలు లాంటివి కూడా న్యాయవ్యవస్థ తీర్పులకు లోబడి ఉంటాయి. కాబట్టి వాటికి సంబంధించిన కార్యాలయాలు, మరికొన్ని సంబంధిత ప్రభుత్వ సంస్థలు కూడా కర్నూలు తరలిరాక తప్పదు. వాణిజ్య సముదాయాలు కూడా కర్నూలు పట్టణంలో చోటు చేసుకుంటాయి. హైదరాబాద్‌కు కర్నూలు దగ్గరగా ఉండటం వల్ల రోడ్డు, రైళ్లు, విమాన సర్వీసు కనెక్టివిటీ కూడా బాగా కలిసివస్తుంది. నల్లమల అడవులతోపాటు శ్రీశైలం, మంత్రాలయం లాంటి పేరుగాం చిన దేవాలయాలను మరింత ఎక్కువగా దర్శించే భక్తులు, పర్యాటకులూ ఇబ్బడిముబ్బడిగా పెరగడంతో టూరిజం ఆర్థిక పరిశ్రమగా నిలదొక్కుకునే అవకాశాలు ఉన్నాయి. విశాఖ పట్టణంలో హైకోర్టు బెంచి కావాలని 1993 నుంచి అక్కడి లాయర్లు,ప్రజలు డిమాండ్ చేయడమే కాదు ఆందో ళనలు కూడా చేసిన దాఖలాలు ఉన్నాయి. అయితేఅప్పుడు కోస్టల్ జిల్లాలకు రాజధాని హైదరాబాద్ దూరంగా ఉండ టం చేత ఆ డిమాండ్ ఆరోజులలో ప్రాధాన్యత సంతరిం చుకుంది. ఇప్పుడున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా, కర్నూలుతోబాటు మరో హైకోర్టు బెంచి విశాఖపట్నంలో ఉండటం న్యాయమైన డిమాండ్ అని అనేక కారణాలు డిమాండ్‌కు అనుకూలంగా లేవనెత్తే వారిసంఖ్య పెరుగుతు న్నది కూడా. విశాఖలో అనేక విద్యాసంస్థలు ఉన్నాయి. దామోదరం సంజీవయ్య జాతీయ లా యూనివర్సిటీతో పాటు, ఆంధ్రా యూనివర్సిటీ లా కాలేజీ,గీతం లాస్కూల్, లాంటివి అందులో కొన్నిగా చెప్పుకోవచ్చు. అయితే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అంశం మరొకటి ఉంది. విశాఖబార్ అసోసియేషన్‌లో 5000 మందికిపైగా అడ్వకేట్లు ఉన్నారు. అందులో 1,200 మంది మహిళా లాయర్లు కూడా ఉండ టం విశేషం. ప్రభుత్వం ఈ ప్రతిపాదనను కూడా తప్ప కుండా పరిశీలించే విధంగా పరిస్థితులు ఏర్పడుతున్నాయి. విశాఖపట్టణం అన్ని సదుపాయాలతో అలరారుతున్న అద్భు తనగరం. అక్కడ హైకోర్టు బెంచి నెలకొల్పబడటం కూడా అందరూ అభిలషిందగ్గ విషయమే. యుపిలో అలహాబాదు లో హైకోర్టుతోపాటు లక్నోలో మహారాష్ట్రలో ఔరంగాబాదు, నాగపూర్‌లో హైకోర్టు బెంచిలు ఉన్నాయి. ఇలా పనిఒత్తిడి తో న్యాయం సామాన్యుడికి అందుబాటులో ఉండటంకోసం చాలా రాష్ట్రాలలో హైకోర్టు బెంచిల డిమాండ్లు పెరుగుతు న్నాయి. ప్రస్తుత పరిస్థితులలో న్యాయస్థానాలు ముఖ్యంగా ఉన్నత న్యాయస్థానాలు ప్రజలకు అందుబాటులో ఉన్నప్పు డే వికేంద్రీకరణ అన్ని రంగాలలో జరుగుతున్నదన్న నైతిక బలాన్ని సమన్యాయాన్ని అందుబాటులోకి తెచ్చిన భావన కలుగుతుంది. ప్రధాని మోడీ అన్ని వ్యవస్థలను బలోపేతం చేసినట్లే హైకోర్టు బెంచీల అవశ్యకతను గుర్తించి న్యాయ వ్యవస్థను కూడా బలపర్చాలి. ప్రస్తుతానికి ఎపిలో హైకోర్టు బెంచి కర్నూలులో రావటం ఖాయమని అనిపిస్తున్నది. ●

# రద్దీవేళ.. తొక్కిసలాటలు ఆపలేమా?

ఐ.ప్రసాద రావు

ఉత్తర ప్రదేశ్ ప్రయాగరాజ్‌లో జరిగిన కుంభమేళా సందర్భంగా ఢిల్లీ రైల్వేస్టేషన్లో జరిగిన తొక్కిసలాటలో అనేక మంది అమాయక భక్తులు మరణించడం జరిగింది. తదుపరి తిరుపతిలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా జరి గిన తొక్కిసలాటలో, గత వారంలో సింహాచలంలో చంద నోత్సవం సందర్భంగా గోడ కూలిన సందర్భంగా కొందరు భక్తులు మరణించడం జరిగింది. అంతే కాకుండా, శనివారం గోవాలో శ్రీ లరాయ్ మాత ఆలయం వద్ద జరిగిన తొక్కిస లాటలో కొందరు భక్తులు మరణించడం జరిగింది. ఇలా వరుసగా వివిధ దేవాలయాలకు వెళ్లిన భక్తులు అకాలంగా మరణించడం చాలా బాధాకరం.దీనికి కారణం కొంతమేరకు భక్తుల తొందరపాటు కారణం అయితే, ఎక్కువగా ప్రభు త్వాలు, దేవస్థాన కమిటీలు తీసుకుంటున్న చర్యల్లో సమ తౌల్యం లోపించడం అని తేటతెల్లం అవుతుంది. ముఖ్యంగా రైల్లో సీట్లకు మించి టికెట్ల తీసుకుని (టిక్కెట్లు ఎలా ఇస్తున్నారో) వివిధ రైల్లో ప్రయాణాలు ప్రజలు ఎలా ప్రయా ణం చేస్తున్నారో, కొన్ని సందర్భాల్లో ప్రమాదాల్లో చిక్కు కుంటున్నారో... అదే పద్ధతిలో దైవ దర్శనాలకు కూడా ముఖ్యంగా కొన్ని ప్రత్యేక పండుగ, జాతర సందర్భాల్లో ఎక్కువ మంది దేవాలయాలకు రావడంతో అదుపుతప్పి తొక్కిసలాటలు సంభవించడం, కొందరు భక్తులు ప్రాణాలు కోల్పోవడం మరికొందరు గాయాలు పాలవడం పరిపాటిగా మారుతుంది. మన దేశంలో నేటికీ అనేక దేవాలయాలు పురాతన కాలంలో నిర్మించినవి కావడంతో ప్రాకారాలు, పై గోడలు, ఇరుకు దైవ దర్శనాల మార్గాలుగా ఉండటంతో పలుమార్లు తొక్కిసలాట జరుగుతుంది. అంచనాలకు మించి ఒకో సందర్భంలో భక్తులు చేరటంతో తగినన్ని సౌకర్యాలు




కల్పించడంలో ప్రభుత్వాలు దేవస్థాన కమిటీలు, బందోబస్తు ఫెయిల్ అవుతున్నారు. ఇదే సమయంలో భక్తులు కూడా ఆచితూచి దైవదర్శనాలకు వెళ్లటం శ్రేయోష్కరం. వృద్ధులు, దివ్యాంగులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. మనదేశంలో నేటికీ చాలా దేవాలయాలు చాలా పురాతనమైనవి. మర మ్మతులు చేయవలసి ఉంది. ఆధునీకరణ చేయాలి. అదే సందర్భంలో నేడు పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ద్వారాలు,మార్గాలు సంబంధిత పండితుల సలహా మేరకు విశాలపరచాలి. నిర్మాణ సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి.అలాగే చాలా దేవాలయాలు పర్వతప్రాంతాల్లో, అటవీ ప్రాంతాల్లో, కొండల్లో నెలకొన్నాయి. ఇటువంటి పరి స్థితుల్లో పెరుగుతున్న భక్తులు రద్దీకి అనుగుణంగా రవాణా సౌకర్యాలు, దేవాలయాలకు చేరే మార్గాలు, ద్వారాలు వద్ద పగడ్బందిగా బందోబస్తు, రక్షణ కోసం చర్యలు తీసుకోవాలి. అడవి మృగాల నుంచి, విష సర్పాలనుంచి భక్తుల ప్రాణా లు కాపాడాలి. వివిధ దేవాలయాల్లో జరిగే వివిధ ప్రత్యేక పండుగలు సందర్భంగా ముందస్తు చర్యలు పగడ్బందిగా తీసుకోవాలి.తాగునీటి సౌకర్యం,రవాణా సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. దర్శన టిక్కెట్లు పారదర్శకంగా మంజూరు చేయడం తోపాటు సామర్థ్యానికి మించి మంజూరు చేయకూడదు. సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. శారీరక, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, వృద్ధులకు ప్రత్యేక సదుపాయాలు మరింత మెరుగ్గా ఉంచాలి. అమాయక ప్రజల ప్రాణాలు కాపాడాలి. అదే సమయంలో భక్తులు కూడా ప్రభుత్వాలు దేవస్థాన కమిటీలు పోలీసులు జారీ చేసే సూచనలను అనుసరించాలి. మూఢ నమ్మకాలు, మూఢ విశ్వాసాలు విడనాడాలి. పరిస్థితిని బట్టి ప్రయాణం చేయడం, దర్శనా నికి వెళ్ళడం ప్రస్తుత సమయంలో అత్యావశ్యకం. ●

# డిజిటల్ ఇండియాలో మహిళా సాధికారత ఎక్కడ?

డి జె మోహన రావు

నేడు భారతదేశం సాంకేతిక యుగంలోకి శరవేగంగా దూసుకుపోతున్న వేళ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక డిజిటల్ ఇండియా కార్యక్రమం డిజిటల్ సేవలను ప్రతి పౌరుడికి అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ సాంకేతిక పురోగతి నిజమైన అభివృద్ధిని సాధించాలంటే పురుషులతో సమానంగా మహిళలు కూడా ఈ ప్రయాణం లో భాగస్వాములు కావడం అత్యంత ఆవశ్యకం. 'డిజిటల్ పరివర్తనలో లింగ సమానత్వం' అనేది మనం సాధించడం అత్యంత ఆవశ్యకం. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతు న్న దేశానికి అత్యంత కీలకమైన ఈ అంశంపై సమగ్ర గణాంకాలతో కూడిన లోతైన అవగాహన అవసరం. మన దేశంలో డిజిటల్ లింగ అంతరం వివిధ స్థాయిల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రాథమిక ఇంటర్నెట్ వినియోగం నుండి అధు నాతన సాంకేతిక నైపుణ్యాల వరకు మహిళలు పురుషుల కంటే వెనుకబడి ఉన్నారు. నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ 2023గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా కేవలం 33శాతం మంది మహిళలు మాత్రమే ఇంటర్నెట్‌ను ఉపయోగిస్తుండ గా పురుషుల వినియోగం 57శాతంగా ఉంది.ఉపయోగించే పురుషుల్లో 71శాతం స్మార్ట్‌ఫోన్లను వాడుతుండగా, మహిళ ల్లో సంఖ్య కేవలం 46శాతం మాత్రమే ఉంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఈ అంతరం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో కేవలం 28 శాతం మంది మహిళలు మాత్రమే ఇంటర్నెట్‌ను వినియోగి స్తుండగా,పురుషుల వినియోగం 53శాతంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో ఈ అంతరం కాస్త తక్కువగా ఉన్నప్పటికీ 41 శాతం మంది మహిళలు,61శాతం మంది పురుషులు ఇంట ర్నెట్‌ను ఉపయోగిస్తున్నారు. అయితే పూర్తి సమానత్వం ఇంకా సాధించలేదు. డిజిటల్ నైపుణ్యాల విషయానికి వస్తే ఈ అంతరం మరింత అధికంగా ఉంది. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ గణాంకాల ప్రకారం ప్రాథమిక డిజిటల్ అక్షరాస్యత కలిగిన మహిళలు కేవలం 25శాతం మాత్రమే ఉండగా పురుషుల్లో ఈ సంఖ్య 48శాతంగా ఉంది. కోడింగ్ వంటి అధునాతన డిజిటల్ నైపుణ్యాల విషయానికి వస్తే మహిళల ప్రాతినిధ్యం కేవలం 10 -15శాతం మధ్యే ఉంది. సాంకేతిక రంగంలోని ఉద్యోగాల్లో కూడా ఇదే అసమతుల్యత కనిపిస్తోంది. విశ్వసనీయ నివేది కల ప్రకారం భారతీయ ఐటీ, సాంకేతిక రంగంలో మహి ళలు దాదాపు 34శాతం మంది ఉన్నారు. మధ్య, ఉన్నత మహిళలు ఉన్నారు. పరిశ్రమ వర్గాల అంచనా ప్రకారం, స్టార్టప్ వ్యవస్థాపకుల్లో మహిళల శాతం కేవలం 14శాతం మాత్రమే. డిజిటల్ పరివర్తనలో లింగ సమానత్వం కేవలం సామాజిక న్యాయం మాత్రమే కాదు. ఇది భారతదేశ ఆర్థికా భివృద్ధికి గణనీయమైన ఊతమిస్తుంది. ప్రపంచ బ్యాంకు, మెకిన్సే గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ వంటి సంస్థల అంచనాల ప్రకా రం డిజిటల్ లింగ అంతరాన్ని తగ్గించడం ద్వారా భారత



దేశ జీడీపీ 0.5శాతం నుండి 1.5శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. అంతేకాకుండా మహిళల ఉద్యోగిత రేటు పెరిగితే ఆర్థిక వృద్ధి మరింత బలపడుతుంది. డిజిటల్ నైపుణ్యాలను పొందడం ద్వారా మహిళలు ఐటీ రంగంలోనే కాకుండా ఆర్థిక సేవలు, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం వంటి వివిధ రంగాల్లో కొత్త ఉద్యోగ అవకాశాలను పొంద గలరు. ఈకామర్స్ వేదికలు మహిళలకు తమ ఉత్పత్తులను దేశవ్యాప్తంగా విక్రయించడానికి, చిన్న వ్యాపారాలను స్థాపిం చడానికి అవకాశాలను అందిస్తాయి. తద్వారా వారి ఆర్థిక స్వావలంబన పెరుగుతుంది. మెరుగైన డిజిటల్ అక్షరాస్యత ప్రభుత్వ పథకాలు, ఆరోగ్య సమాచారం, విద్యా వనరులకు మహిళల ప్రాప్తిని సులభతరం చేస్తుంది. తద్వారా వారి జీవన ప్రమాణాలు సమగ్రంగా మెరుగుపడతాయి. ఈ ఆందోళనకరమైన గణాంకాల వెనుక సంక్లిష్టమైన సామాజిక ఆర్థిక అడ్డంకులు ఉన్నాయి. పేదరికం, నిరక్షరాస్యతలుఅనేక మంది మహిళలకు స్మార్ట్‌ఫోన్‌లు ఇంటర్నెట్ వంటి ప్రాథ మిక డిజిటల్ సాధనాలను అందుబాటులో లేకుండా చేస్తు న్నాయి. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసెర్చ్ సర్వే ప్రకారం అనేక గ్రామీణ గృహాల్లో డిజిటల్ పరికరా లపై మహిళలకు పరిమిత నియంత్రణ ఉంది. సాంఘిక కట్టుబాట్లు, కుటుంబ నియంత్రణలు తరచుగా మహిళలు డిజిటల్ సాంకేతికతలను స్వేచ్ఛగా ఉపయోగించకుండా అడ్డుకుంటున్నాయి. ఆన్‌లైన్ భద్రత గురించిన భయాలు, సైబర్ వేధింపుల ముప్పు వారిని డిజిటల్ ప్రపంచం నుండి దూరం చేస్తున్నాయి. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యా థమెటిక్స్ (స్టెమ్) విద్యలో మహిళల తక్కువ ప్రాతినిధ్యం ఉన్నత స్థాయి సాంకేతిక ఉద్యోగాల్లో వారి సంఖ్య తక్కు వగా ఉండటానికి ఒక ముఖ్యమైన కారణం. దీనిని ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ధృవీకరిస్తోంది. దురదృష్టవశాత్తు సమాజంలో పాతుకుపోయిన పితృస్వామ్య ఆలోచనలు సాంకేతిక రంగంలో మహిళల పట్ల ఉన్న పక్ష పాతాలు అన్ని స్థాయిల్లో వారి వృత్తిపరమైన ఎదుగుదలకు అడ్డంకులు సృష్టిస్తున్నాయి. ఈ సంక్లిష్ట పరిస్థితిని పరిష్క రించడానికి సమగ్రమైన, బహుళస్థాయి కార్యాచరణ ప్రణాళి కను అమలు చేయడం అత్యవసరం. డిజిటల్ మౌలిక సదు పాయాలు అందుబాటును మెరుగుపరచాలి. ప్రభుత్వం ము ఖ్యంగా గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో విశ్వసనీయమైన ఇంటర్నెట్, మొబైల్ నెట్‌వర్క్‌లను విస్తరించడానికి గణనీ యంగా పెట్టుబడులు పెట్టాలి. భారత్‌నెట్ వంటి కార్యక్ర మాలను వేగవంతం చేయడం చాలా ముఖ్యం. మహిళలకు ప్రత్యేకంగా ప్రత్యేక రాయితీలుతో సరసమైన డేటా టారిఫ్ లను అందించే ఏర్పాటు కల్పించాలి. యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ వంటి నిధులను సమర్థవంతంగా ఉప యోగించడం కూడా కీలకం. దేశవ్యాప్తంగా మహిళల కోసం ప్రాథమిక స్థాయి నుండి అధునాతన స్థాయి వరకు ప్రత్యేక డిజిటల్ అక్షరాస్యత శిక్షణ కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వ హించాలి. నేషనల్ డిజిటల్ లిటరసీ మిషన్ వంటి కార్యక్ర మాల అమలును మెరుగుపరచడం చాలా ముఖ్యం. స్థానిక భాషల్లో శిక్షణ,మహిళా శిక్షకులను నియమించడంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. మొబైల్ లిటరసీ వ్యాన్‌లు,కమ్యూనిటీసెంటర్ల ద్వారా శిక్షణను విస్తరించడం కూడా అవసరం. ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి భవిష్యత్తులో డిమాండ్ ఉండే డిజిటల్ నైపుణ్యాలపై మహిళలకు శిక్షణఇవ్వడానికి ప్రత్యేక నైపుణ్యా భివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలి.ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన వంటి పథకాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం,వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించడం,శిక్షణ తర్వాత ఉపాధి అవకాశాలను కల్పించడానికి కంపెనీలతో

# భారత్ మామిడిపండ్లను తిరస్కరించిన అమెరికా!

## 15 కంటైనర్ల పండ్లను ధ్వంసంచేసిన ఎగుమతిదారులు



**లాస్ ఏంజెల్స్, మే 18:** భారతదేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయిన మామిడి పండ్ల పత్రాల్లో లోపాల కారణంగా తిరస్కరణకు గురయ్యాయి. సుమారు 15 కంటైనర్ల మామిడి పండ్లను అమెరికా అధికారులు వెనక్కి పంపారు. తప్పనిసరిగా చేయించాల్సిన ఇర్రేడియేషన్ ప్రక్రియకు సంబంధించిన డాక్యుమెంటేషన్‌లో పొరపాట్లు ఉన్నాయని వారు పేర్కొన్నారు. ఈ పరిణామంతో భారత ఎగుమతిదారులు సుమారు 5 లక్షల డాలర్లు అంటే దాదాపు రూ.4.15 కోట్లు నష్టపోయారని అంచనా. పండ్లను వెనక్కి రప్పించేందుకు అయ్యే ఖర్చు అధికంగా ఉండటంతో, వ్యాపారులు వాటిని అమెరికాలోనే ధ్వంసం చేయాల్సి వచ్చింది. లాస్ ఏంజెల్స్, శాన్ ఫ్రాన్సిస్కో, అట్లాంటా వంటి పలు అమెరికా విమానాశ్రయాల్లో ఈ మామిడి పండ్ల షిప్‌మెంట్లను నిలిపివేశారు. ఈనెల 8, 9 తేదీల్లో ముంబైలో ఈ మామిడి పండ్లకు ఇర్రేడియేషన్ ప్రక్రియ పూర్తిచేశారు. అయితే, ఈ ప్రక్రియకు సంబంధించిన పత్రాల్లో ముఖ్యంగా పీపీక్యూ203 ఫారంలో తప్పులు దొర్లాయని అమెరికా అధికారులు గుర్తించినట్లు తెలిసింది. పండ్లలో పురుగులు ఉన్నందువల్ల కాకుండా, కేవలం నిర్వాహణ లోపాల వల్లే ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. ఇర్రేడియేషన్ అనేది పండ్లలోని కీటకాలను నిర్మూలించి, వాటి నిల్వ కాలాన్ని పెంచడానికి ఉపయోగించే ప్రక్రియ.

"పీపీక్యూ203 ఫారం సరిగ్గా జారీ చేయనందున" సరకును తిరస్కరించినట్లు అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ తమకు తెలిపిందని ఓ ఎగుమతిదారు వాపోయారు. సరకును వెనక్కి పంపాలి లేదా ధ్వంసం చేయాలి. దీనికి అయ్యే ఖర్చును అమెరికా ప్రభుత్వం భరించదు అని యూఎస్‌డీఏ స్పష్టం చేసినట్లు ఆయన తెలిపారు. నవీ ముంబైలోని ఇర్రేడియేషన్ కేంద్రంలో అమెరికా వ్యవసాయ విభాగం (యూఎస్‌డీఏ)ప్రతినిధి పర్యవేక్షణలోనే ఈ ప్రక్రియ జరుగుతుంది. అమెరికాకు మామిడి పండ్ల ఎగుమతికి అవసరమైన పీపీక్యూ203 ఫారంను కూడా ఆయనే ధ్రువీకరించాలి. ఇర్రేడియేషన్ కేంద్రంలో జరిగిన పొరపాట్లకు మేం నష్టపోవాల్సి వస్తోంది అని ఒక ఎగుమతిదారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల తొమ్మిది, 11 తేదీల మధ్య లాస్ ఏంజిల్స్ విమానాశ్రయంలో తన సరకును నిలిపివేసి, ఆ తర్వాత ధ్వంసం చేయాలని ఆదేశాలు అందుకున్న మరో ఎగుమతిదారు మాట్లాడుతూ, తప్పనిసరి ఇర్రేడియేషన్‌కు సంబంధించిన నిబంధనలు పాటించలేదని మాకు తెలిపారు. ఇది పూర్తిగా అవాస్తవం. ఇర్రేడియేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాతే మాకు పీపీక్యూ203 ఫారం ఇచ్చారు. యూఎస్‌డీఏ అధికారి జారీ చేసిన ఆ ఫారం లేకుండా ముంబై విమానాశ్రయంలో మామిడి పండ్లను విమానంలోకి ఎక్కించడానికి కూడా అనుమతించరని ఆయన అన్నారు. భారతదేశ మామిడి పండ్లకు అమెరికా ప్రధాన ఎగుమతి మార్కెట్ కావడంతో, ఈ ఘటన వాణిజ్య సంబంధాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ సమస్యపై, ప్రభావితమైన మామిడి పండ్ల పరిమాణం, పత్రాల్లోని లోపాల గురించి అడిగిన ప్రశ్నలకు, వ్యవసాయ, ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి అథారిటీ (అపెడా) ఛైర్మన్ కార్యాలయం స్పందించలేదు. ఈ వ్యవహారం ముంబై వాషిలోని యూఎస్‌డీఏ ఆమోదిత మహారాష్ట్ర రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు (ఎంఎస్‌ఏఎంబీ) కేంద్రానికి సంబంధించింది. కాబట్టి దీనిపై వారినే వివరణ కోరాలని బదులిచ్చారు. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ కింద అపెడా పనిచేస్తుంది. అయితే, ఈమెయిల్ ద్వారా వివరణ కోరినప్పటికీ ఎంఎస్‌ఏఎంబీ నుంచి ఎలాంటి స్పందన రాలేదు.



# కాల్పుల విరమణకు స్పష్టమైన గడువు తేదీ ఏదీలేదు..

## భారత్ రక్షణశాఖ వెల్లడి

**న్యూఢిల్లీ, మే 18:** భారత్‌పాక్ మధ్య కాల్పుల విరమణకు ముగింపు తేదీ లేదని రక్షణ శాఖ వెల్లడించింది. కాల్పుల విరమణ అవగాహనకు గడువు ముగుస్తోందంటూ వార్తలను రక్షణ శాఖ వర్గాలు ఖండించాయి. ఈనెల 10న ప్రకటించిన కాల్పుల విరమణ అవగాహన మేరకే కొనసాగుతోందని స్పష్టంచేశాయి. ఆరోజు భారత్‌పాక్ డీజీఎంవోల చర్చల్లో తీసుకున్న నిర్ణయాలే కొనసాగుతాయని పేర్కొన్నాయి. 10వ తేదీన డీజీఎంవోల మధ్య జరిగిన చర్చల్లో తీసుకున్న నిర్ణయాలకు కాలపరిమితి లేదని రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. ఆదివారం ఎలాంటి డీజీఎంవో స్థాయి చర్చలు లేవని తెలిపాయి. అంతకుముందు మే 12న ఇరుదేశాల డీజీఎంవోల మధ్య చర్చలు జరిగాయి. అందులో ఇరుపక్షాలు ఇరుపక్షాలు ఒకరిపై ఒకరు కాల్పులు జరపకూడదని నిర్ణయం తీసుకున్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడొద్దని, శత్రుత్వ చర్యలు తీసుకోకూడదనే విషయాలకు కట్టుబడి ఉండాలనే దానిపై చర్చించారు. ఆదేవిధంగా సరిహద్దులు, ఫార్వర్డ్ బేస్ ప్రాంతాల్లో బలగాల తగ్గింపును పరిగణించాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయి. మరోవైపు ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి భారత సైన్యం వెస్టర్న్ కమాండ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ వీడియో పోస్ట్ చేసింది. ఉగ్రస్థావరాలు, పాకిస్థాన్ సైనిక స్థావరాలను ధ్వంసం చేసిన దృశ్యాలను అందులో పొందుపర్చింది. ఆపరేషన్ సిందూర్ పాక్‌పై ప్రతీకార దాడి కాదని పహల్గామ్ ఉగ్రదాడి బాధితులకు న్యాయం చేయడమని భారత సైన్యం పేర్కొంది. ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో వచ్చి పర్యటకులపై కాల్పులు చేశారు. పహల్గాం ఉగ్రదాడి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్ చేపట్టిన ప్రతీకార దాడులతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరయ్యింది. ఈ దాడుల్లో సుమారు 100మందికి పైగా ఉగ్రవాదులు మరణించినట్లు సమాచారం. అయితే, ఎదురు దాడులు చేసేందుకు దాయాది దేశం యత్నించినప్పటికీ భారత బలగాల దెబ్బకు తట్టుకోలేకపోయింది. చివరకు ఉద్రిక్తతలు తగ్గించాలని పాకిస్థాన్ కోరడంతో అందుకు భారత్ అంగీకరించడంతో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. పరిస్థితులు తీవ్ర రూపం దాలుస్తున్న వేళ ఇరు దేశాల మధ్య పరస్పర అవగాహనతో ఉద్రిక్తతలకు తాత్కాలికంగా తెరపడింది.

# మలివిడత బెయిలౌట్ ప్యాకేజికి ఐఎంఎఫ్ సవాలక్ష షరతులు



**న్యూయార్క్, మే 18:** దాయాది దేశం పాకిస్థాన్‌కు బిగ్ షాక్. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్‌పై అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ ఫుల్ ఫోకస్ చేసింది. ఈ క్రమంలో పాకిస్థాన్ తన బెయిలౌట్ ప్రోగ్రామ్ మలి విడత విడుదల కోసం 11 కొత్త షరతులను విధించింది. ఈ పథకం ఆర్థిక, బాహ్య, సంస్కరణ లక్ష్యాలకు గణనీయమైన ప్రమాదాలను పెంచుతాయని ఐఎంఎఫ్ హెచ్చరించింది. పాకిస్థాన్‌పై విధించిన కొత్త షరతులలో రూ.17.6 ట్రిలియన్ల బడ్జెట్‌కు పార్లమెంట్ ఆమోదం, విద్యుత్ బిల్లులపై రుణ సేవల సర్ ఛార్జ్ పెంపు, మూడేళ్లకు మించి ఉపయోగించిన కార్లను దిగుమతి చేసుకోవడంపై ఉన్న పరిమితులను తొలగించడం సహా 11 షరతులు ఉన్నాయి. తాజాగా విధించిన షరతులతో ఐఎంఎఫ్ పాక్‌కు విధించిన షరతుల సంఖ్య 50కి చేరింది. గత రెండు వారాల్లో భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు గణనీయంగా పెరిగాయి. స్టాక్ మార్కెట్ లాభాల్లో ఉంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి పాక్ రక్షణ బడ్జెట్ రూ.2.414 ట్రిలియన్లుగా ఉంది. ఇది గతేడాది పోలిస్తే రూ.252 బిలియన్లు లేదా 12శాతం ఎక్కువ. మే ప్రారంభంలో భారత్‌తో ఘర్షణ తర్వాత పాక్ సర్కార్ రూ.2.5 ట్రిలియన్లు లేదా 18శాతం ఎక్కువ బడ్జెట్ కేటాయించనుందని ఐఎంఎఫ్ నివేదికలో పేర్కొంది. 2025 జూన్ నాటికి ఐఎంఎఫ్ ఒప్పందానికి అనుగుణంగా వచ్చే ఆర్థికబడ్జెట్‌ను పార్లమెంట్ ఆమోదించాలి. అలాగే ఫెడరల్ బడ్జెట్ మొత్తాన్ని రూ.17.6 ట్రిలియన్లుగా అంచనా వేసింది ఐఎంఎఫ్. ఇందులో అభివృద్ధి వ్యయం కోసం కేటాయించిన రూ.1.07 ట్రిలియన్లు ఉంది. నాలుగు ప్రావిన్సులు కొత్త వ్యవసాయ ఆదాయపు పన్ను చట్టాలను అమలు చేయాలి. పన్ను రిటర్న్ ప్రాసెసింగ్, పన్ను చెల్లింపుదారుల గుర్తింపు, నమోదు, కమ్యూనికేషన్ క్యాంపెయిన్, సమ్మతిని మెరుగుపరచడానికి వ్యూహాల కోసం ఒక కార్యాచరణ వ్యవస్థను ఏర్పాటు చేయడం వంటివి ఉన్నాయి. ఐఎంఎఫ్ సూచించిన గవర్నెన్స్ డయాగ్నొస్టిక్ అసెస్మెంట్ ఆధారంగా ప్రభుత్వ బలోపేతానికి చేపట్టే యాక్షన్ ప్లాన్‌ను ప్రభుత్వం రూపొందించాలి. అంతేకాకుండా 2027 తర్వాతి ఆర్థిక రంగ వ్యూహాన్ని వివరించే ప్రణాళికను సిద్ధం చేయాలి. అలాగే ఇంధన రంగంలో నాలుగు కొత్త షరతులను విధించింది. ఇంధన సుంకాలను కాస్ట్ రికవరీ స్థాయిలలో నిర్వహించడానికి ప్రభుత్వం ఈ ఏడాది జులై 1 నాటికి వార్షిక విద్యుత్ సుంకాల పునర్వ్యవస్థీకరణ నోటిఫికేషన్‌లను జారీచేయాలి. 2035 నాటికి ప్రత్యేక సాంకేతిక జోన్లు, ఇతర పారిశ్రామిక ప్రాంతాలకు సంబంధించిన అన్ని ప్రోత్సాహకాలను తొలగించడానికి ప్రభుత్వం ఒక ప్రణాళికను సిద్ధం చేయాలని ఐఎంఎఫ్ షరతులు విధించింది.



## భారత్ విదేశాంగ శాఖ స్పష్టీకరణ

# రాహుల్ వ్యాఖ్యలు తప్పుదారిపట్టించేవిగా ఉన్నాయి

**న్యూఢిల్లీ, మే 18:** పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై గురిపెట్టిన విషయాన్ని ఆపరేషన్ సిందూర్ మొదలుపెట్టడానికి ముందే కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్‌కు సమాచారం అందించిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు సంచలనం సృష్టించాయి. ఇదే విషయంపై డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘై ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్ పేరిట పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసిన విషయాన్ని పాక్‌కు తెలియజేయడానికి ప్రయత్నించామని తెలిపారు. పాక్ లోని ఉగ్రవాద శిబిరాలపై దాడిచేసిన విషయాన్ని పాకిస్థాన్ డీజీఎంఓకు తెలియజేశాం. ఈ చర్యను పాకిస్థాన్ తిరస్కరించింది. ఆపరేషన్ సిందూర్ జరిగిన వెంటనే పాక్ ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసిన విషయాన్ని చెప్పేందుకు ప్రయత్నించామని, పాకిస్థాన్ ఈ విషయంపై తీవ్రంగా స్పందించిందని డీజీఎంఓ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘై వ్యాఖ్యానించారు. అంతకుముందు పాక్ ఉగ్రవాద వ్యవస్థలపై గురిపెట్టిన విషయాన్ని ఆపరేషన్ సిందూర్ మొదలుపెట్టడానికి ముందే కేంద్ర సర్కారు ఆ దేశానికి చెప్పి తప్పు చేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు.

పాక్‌పై దాడి గురించి ఆ దేశానికి ముందే సమాచారం ఇవ్వడం నేరం. కేంద్ర ప్రభుత్వం ఇదే పని చేసిందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ బహిరంగంగా అంగీకరించారు. వారికి అలా వెల్లడించడానికి ఎవరు అధికారం ఇచ్చారు. దాని ఫలితంగా ఈ ఆపరేషన్లో భారత వాయుసేన ఎన్ని విమానాలు కోల్పోయిందో చెప్పాలని రాహుల్ సోషల్‌మీడియాలో పశ్నలు గుప్పించారు. దీనికి జైశంకర్ వ్యాఖ్యల వీడియోను జోడించారు. అయితే రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. ఈ వ్యాఖ్యలు వాస్తవాలను పూర్తిగా తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని పేర్కొంది. ఆపరేషన్ సిందూర్ మొదలైన తొలి దశలో చేసిన హెచ్చరికను, ఆపరేషన్‌కు ముందు చేసినట్లు ఆరోపించడం తప్పుడు వ్యాఖ్యగా తెలిపింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట వైమానిక దాడులు జరిపింది. టెర్రర్ గ్రూప్స్ లష్కరే తోయిబా, జైషే మహ్మద్ స్థావరాలపై విరుచుకుపడింది. దీంతో దాదాపు 100 మంది ముష్కరులు హతమయ్యారు. ఆ తర్వాత పాక్ కూడా భారత్‌పై క్షిపణ దాడులు చేసేందుకు ప్రయత్నించగా, ఇండియన్ ఆర్మీ తిప్పికొట్టింది. ఆ తర్వాత ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది.

# సరిహద్దుల్లో సైనిక ఆపరేషన్

## పేలని పాక్ బాంబులు, గ్రెనేడ్లను నిర్వీర్యంచేసిన దళాలు

**అఖ్నూర్(జమ్ము), మే 18:** పాకిస్థాన్‌తో సైనిక ఉద్రిక్తతలు తగ్గిన నేపథ్యంలో సైన్యం సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తోంది. స్థానికుల భద్రతకు ప్రమాదకరంగా మారిన పేలని బాంబులు, ఆర్టిలరీ షెల్స్‌ను, గ్రెనేడ్లను నిర్వీర్యం చేస్తోంది. పహల్గాంలో 26మంది పర్యాటకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రదాడికి ప్రతీకారంగా ఈనెల 7న సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9ఉగ్ర స్థావరాలపై దాడులు జరిపింది. ఆ తర్వాత పాక్ రేంజర్లు నియంత్రణ రేఖతోపాటు, అంతర్జాతీయ సరిహద్దు వెంట పెద్దఎత్తున షెల్లింగ్‌కు పాల్పడ్డారు. జనావాసాలపై పెద్దఎత్తున దాడులకు పాల్పడ్డారు. వాటిని సైన్యం సమర్థంగా తిప్పికొట్టింది. అయితే పాకిస్థాన్ రేంజర్లు జరిపిన దాడుల్లో కొన్ని ఆర్టిలరీ షెల్స్, గ్రెనేడ్లు, బాంబులు పేలలేదు. వాటిలో కొన్ని నివాస ప్రాంతాలు, పంట పొలాల్లో పడ్డాయి. అవి స్థానికుల భద్రతకు ప్రమాదకరంగా మారాయి. అంతర్జాతీయ సరిహద్దు వెంట ఉన్న అఖ్నూర్ సెక్టార్‌లో సైన్యం ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. పేలని బాంబులు, ఆర్టిలరీ షెల్స్, గ్రెనేడ్లను నిర్వీర్యం చేస్తోంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు మొత్తం 16 షెల్స్‌ను సైన్యం నిర్వీర్యం చేసింది. అఖ్నూర్‌లో పెద్దఎత్తున బాంబు దాడులు జరిగాయి. షెల్స్ ఇళ్ల ముందూ, వెనుకా పడ్డాయి. కొన్ని పొలాల్లో పడ్డాయి. పేలనివి అలాగే ఉండిపోయాయి. వాటిని నిర్వీర్యం చేసేందుకు జమ్మూ నుంచి సైన్యం వచ్చింది. అఖ్నూర్‌కు ఓ బృందం వచ్చింది. రైతులు ఇచ్చిన సమాచారం మేరకు పొలాలకు వెళ్లిన సైన్యం వాటిని నిర్వీర్యం చేస్తోందని స్థానికులు చెప్పారు. పాకిస్థాన్ వైపు నుంచి పెద్దఎత్తున కాల్పులు జరిగాయి. పెద్దపెద్ద షెల్స్ పడ్డాయి. వాటిలో కొన్ని పేలలేదు. జమ్మూ నుంచి సైనిక బృందం వచ్చింది. పేలని బాంబులను నిర్వీర్యం చేస్తున్నారు. ఇప్పటి వరకు పది బాంబులను నిర్వీర్యం చేశారు. తమమ భద్రతకు ప్రమాదకరంగా మారిన షెల్స్‌ను నిర్వీర్యం చేసిన సైన్యానికి అఖ్నూర్ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పుడు తాము నిశ్చింతగా ఉండొచ్చని సంతోషం వ్యక్తం చేశారు. లేకుంటే ఎక్కడ, ఎప్పుడు ఏ బాంబు పేలుతుందో అనే భయంతో రోజులు గడపాల్సి వచ్చేదని స్థానికులు తెలిపారు.

# పాకిస్థాన్‌లో తీవ్రమౌతున్న ఆహార సంక్షోభం

## 11 మిలియన్ల మందికి దక్కని పౌష్టికాహారం

**న్యూయార్క్, మే 18:** పాకిస్థాన్ తీవ్ర ఆహార సంక్షోభంలో ఉందని ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని ఆహార, వ్యవసాయ సంస్థ నివేదికలో తేలింది. 11 మిలియన్ల మందిపై ఈ ఆహార కొరత ప్రభావం ఉంటుందని అంచనా వేసింది. 2024 నవంబర్ నుంచి 2025 మార్చి వరకు పాక్‌లో అధిక స్థాయిలో ఆహార సంక్షోభం కొనసాగిందని వెల్లడైంది. ఆహార సంక్షోభాలపై ప్రపంచ నివేదికను ఎఫ్ఏఓ విడుదల చేసింది. దీని ప్రకారం బలూచిస్థాన్, సింధ్, ఖైబర్ పఖ్తుంఖ్వా వంటి వరద ప్రభావిత జిల్లాల్లో 11 మిలియన్ల మంది లేదా జనాభాలో 22శాతం మంది తీవ్రమైన ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటారని అంచనా. ఇందులో 1.7 మిలియన్ల మంది పరిస్థితి మరింత దారుణంగా ఉందని తేల్చింది. 2024 గరిష్ఠ స్థాయి ఆహార కొరతతో పోలిస్తే 2025లో మరో 38 శాతం పెరిగే అవకాశం ఉంది. గతేడాది పోలిస్తే ఆహార కొరత తగ్గినప్పటికీ వాతావరణ పరిస్థితులు ప్రజల జీవనోపాధిని ప్రభావితం చేస్తాయి. 2023 నవంబర్ నుంచి 2024 జనవరి మధ్య 11.8



మిలియన్ల ప్రజలు అధిక స్థాయిలో తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొన్నారు. 2023 మార్చి 2024 జనవరి వరకు 6 నుంచి 59 నెలల వయసు గల 2.1 మిలియన్ల మంది పిల్లలు పోషకాహార లోపంతో ఇబ్బందిపడుతున్నారు. గర్భిణీలు, పాలిచ్చే బాలింతల్లో పోషకాహార లోపం ఎక్కువగా ఉంది. అలాగే సింధ్, ఖైబర్ పఖ్తుంఖ్వాలో చాలా మంది చిన్నారులు తక్కువ బరువుతో జన్మిస్తున్నారు. శీతాకాలంలో విరేచనాలు, తీవ్రమైన శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, మలేరియాతో బాధపడుతున్నారు. పారిశుధ్య సౌకర్యాలు, సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని ఎఫ్ఏఓ తన నివేదికలో తెలిపింది.

# మెరైన్ ఉత్పత్తుల్లో నాలుగో అతిపెద్ద దేశంగా భారత్

**న్యూఢిల్లీ, మే 18:** దేశ ఆర్థిక వ్యవస్థను పెంచడానికి తయారీ రంగానికి ప్రాధాన్యత ఉన్న చోట ప్రోత్సహిస్తోంది. మరోవైపు, ఎగుమతులను పెంచడంపై ప్రభుత్వం వేగంగా కృషి చేస్తోంది. అటువంటి పరిస్థితిలో, ప్రభుత్వం పడిన కష్టానికి ఇప్పుడు ఫలితం కనిపిస్తోంది. ఇప్పుడు, ఎగుమతులకు సంబంధించి భారతదేశానికి వచ్చిన వార్తలను బట్టి, ప్రపంచ స్థాయిలో భారతదేశం తన బలాన్ని అమాంతం పెంచుకుంటోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, భారతదేశం ఇప్పుడు సముద్ర ఉత్పత్తుల ఎగుమతి పరంగా ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద దేశంగా అవతరించింది. భారతదేశం ఇప్పుడు సముద్ర ఉత్పత్తుల ఎగుమతిదారులలో నాల్గవ అతిపెద్దదిగా అవతరించింది. 2014-15లో 105 దేశాలు భారతీయ సముద్ర ఉత్పత్తులను దిగుమతి చేసుకోగా, 2025 ఆర్థిక సంవత్సరంలో 130 దేశాలు పెరిగాయని వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. 2024-25లో, భారతదేశం 16.85 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటి) సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేయగా, 201415లో ఇది 10.51 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంది. ఆక్వాకల్చర్ పద్ధతుల్లో పురోగతి, మెరుగైన కోల్డ్ చైన్ మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ నాణ్యత నిబంధనలకు కట్టుబడి ఉంది. దీంతో దేశ సముద్ర ఎగుమతులు 2015 ఆర్థిక సంవత్సరంలో 5.4 బిలియన్ల నుండి 2024-25 నాటికి 7.2 బిలియన్లకు పెరుగుతాయని అంచనా. ఎగుమతి గమ్యస్థానాలు ఈ వైవిధ్యీకరణ మార్కెట్ నష్టాలను తగ్గిస్తుంది. దీర్ఘకాలిక వృద్ధికి అవకాశాలను తెరుస్తుందని ఆయన అన్నారు. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో భారతదేశం ర్యాంకింగ్ 2014-15లో ఎనిమిదవ స్థానం నుండి నాలుగు స్థానాలు మెరుగుపడింది. ఇది ప్రపంచ మార్కెట్‌లో దాని పెరుగుతున్న పోటీతత్వాన్ని, విశ్వసనీయతను సూచిస్తుంది. ఈ కాలంలో 3.15 శాతం సమ్మేళన వార్షిక వృద్ధి రేటుతో, భారతదేశం ప్రపంచ సగటు వృద్ధి రేటు 2.7 శాతం కంటే ముందుంది, అంతర్జాతీయ మత్స్యరంగంలో దాని వృద్ధి స్థానాన్ని మరింత బలోపేతం చేసింది.





# విస్తరిస్తున్న కొత్త కరోనా

## పెరుగుతున్న కేసులు..కొత్త వ్యాక్సిన్‌కు ఆమోదం!

**న్యూఢిల్లీ, మే 18:** ప్రపంచవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో, ముఖ్యంగా ఆసియా దేశాల్లో (హాంకాంగ్-సింగపూర్) పెరుగుతున్న కరోనా కేసులు ఆరోగ్య నిపుణుల్లో ఆందోళనను రేకెత్తించాయి. గత కొన్ని వారాల్లో కరోనా కేసులు గణనీయంగా పెరిగాయని పలు నివేదికలు పేర్కొంటున్నాయి. కరోనా ఇన్‌ఫెక్షన్ కేసులు పెరగడమే కాకుండా చాలాచోట్ల ఆస్పత్రుల్లో చేరే రోగులు సంఖ్య పెరిగింది. ఈ పెరుగుతున్న కేసులకు కొత్త వేరియంట్ కారణమని ఇప్పటివరకు నిపుణులు ప్రకటించలేదు. అయితే, వ్యాక్సిన్ రోగ నిరోధక శక్తి తగ్గుతోందని, ఫలితంగా వైరస్ ప్రభావం మరోసారి కనిపిస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తుగా కరోనాకు బూస్టర్ వ్యాక్సిన్ తీసుకోవాలనిఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. తద్వారా రక్షణ ఉంటుందన్నారు. గతంలో ఫ్లూ మాదిరిగానే కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోవాలని పలు ఆరోగ్య సంస్థలు సూచిస్తున్నాయి. ఈ క్రమంలో బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం హాంకాంగ్, సింగపూర్ వంటి నగరాల్లో ఆస్పత్రిలో చేరడం, మరణాలతోపాటు కొత్త కొవిడ్ కేసులు పెరుగుతున్నాయి. ఆరోగ్య సంస్థలు ప్రజలను అప్రమత్తం చేశాయి. మరోవైపు పెరుగుతున్న ముప్పు మధ్య యుఎస్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డిఎ) నోవావాక్స్ కొత్త వ్యాక్సిన్‌ను ఆమోదించింది. అమెరికాకు చెందిన నెబ్రాస్కా మెడిసిన్‌లో అంటువ్యాధుల నిపుణుడు డాక్టర్ మార్క్ ఇ రూప్ మాట్లాడుతూ ప్రస్తుతం అమెరికాతో సహా ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఎల్‌పి 8.1వేరియంట్ ద్వారా కేసులు పెరుగుతున్నాయన్నారు. 70శాతం కేసులకు ఈ వేరియంట్ కారణమని 9శాతం కేసులకు ఎక్స్‌ఎఫ్‌సి వేరియంట్ కారణమన్నారు. కాలక్రమేణా ప్రజల రోగనిరోధక శక్తి బలహీనపడడం వల్ల వైరస్ మరింత సులభంగా వ్యాపిస్తుందని పలు నివేదికలు పేర్కొన్నాయి.



# అమెరికాలో టోర్నడోల బీభత్సం

**మిస్సోరి, మే 18:** అమెరికాలోని లారెల్ కౌంటీలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో టొర్నడో బీభత్సం సృష్టించింది. దీంతో సుమారు 21 మంది ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల కోసం రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండడంతో మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఈ తుఫాన్, టోర్నడోల ఎఫెక్ట్‌తో ప్రభావిత ప్రాంతాల్లో గురువారం ఎమర్జెన్సీ ప్రకటించారు. భారీ ఈదురుగాలతో స్థంభాలు విరిగిపడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. మిస్సొరీలో, కెంటకీ రాష్ట్రాల్లో శుక్రవారం టోర్నడోలు బీభత్సం సృష్టించడంతో భారీగా ప్రాణనష్టం జరిగింది. కొన్ని నివేదకల ప్రకారం రద్దీగా ఉండే రహదారిపై ఈ టోర్నడోలు ప్రారంభమై నగరంలో 20 చదరపు బ్లాక్‌ల ప్రాంతంలో విధ్వంసం సృష్టించినట్టు తెలుస్తోంది. ఈ కారణంగా మిస్సోరీలో ఐదువేల భవనాలకుపైగా దెబ్బతిన్నాయని మేయర్ కారా తెలిపారు. స్కాట్ కౌంటీలోనూ టోర్నడోల బీభత్సంలో ఇద్దరు మరణించడంతో పాటు అనేక ఇళ్లు ధ్వంసంమైనట్టు తెలుస్తోంది. ఇవే కాకుండా ఇల్లినోయిలో కూడా టోర్నడోలు బీభత్సం సృష్టిస్తున్నట్టు యూఎస్ నేషనల్ వెదర్ సర్వీస్ తెలిపింది.

# లష్కరే ఉగ్రవాది సైఫుల్లా ఖలీద్ ఖతం

**న్యూఢిల్లీ :** పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో లష్కరే తోయిబా ఉగ్రవాది సైఫుల్లా ఖలీద్ హతమయ్యాడు. ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు సైఫుల్లా ఖలీద్‌ను మట్టుబెట్టినట్లు అక్కడి అధికారులు పేర్కొన్నారు. ఇండియాలో జరిగిన మూడు ఉగ్రదాడుల్లో సైఫుల్లా ఖలీద్ కీలకంగా వ్యవహరించాడు. 2001లో రాం పూర్‌లోని సీఆర్పీఎఫ్ క్యాంపుపై దాడి చేశాడు. బెంగళూరులో 2005లో నిర్వహించిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశంలో దాడులకు పాల్పడ్డాడు. 2006లో నాగ్‌పూర్‌లోని ఆర్ ఎస్ఎస్ ప్రధాన కార్యాలయంపై దాడికి పాల్పడడంలో కీలకంగా వ్యవహరించాడు సైఫుల్లా ఖలీద్. ఐదేండ్ల వ్యవధిలోనే జరిగిన ఈ దాడుల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ఇక ఖలీద్ నేపాల్‌లో స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు. అక్కడ వినోద్ కుమార్ పేరుతో తప్పుడు ధృవ పత్రాలు సృష్టించి, స్థానిక మహిళ నగ్మా బానును వివాహం చేసుకున్నాడు. లష్కరే తోయిబా కార్యకలాపాలను నేపాల్ నుంచే ఖలీద్ సమన్వయం చేసినట్లు సమాచారం. ఇటీవల ఖలీద్ తన స్థావరాన్ని పాకిస్తాన్‌లోని సింధ్ ప్రావిన్స్ బాదిన్ జిల్లాలోని మట్లీకి మార్చాడు. లష్కరే తోయిబాతో పాటు దాని ప్రధాన సంస్థ జమాద్‌ఉద్‌దవా కోసం ఖలీద్ పని చేస్తున్నాడు. ఉగ్రవాద కార్యకలాపాలతోపాటు నియామకాలు, నిధుల సేకరణపై సైఫుల్లా దృష్టి సారించాడు.



# ప్రపంచదేశాలకు మేం కూడా పంపిస్తున్నాం..

## భారత్‌ను కాపీకొడుతున్న పాకిస్థాన్



**ఇస్లామాబాద్, మే 18:** ఆపరేషన్ సిందూర్‌తో చావుదెబ్బ తిన్న పాకిస్థాన్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూనే ఉంది. ఉగ్రవాదానికి భారత్ వ్యతిరేకమనే సందేశాన్ని ప్రపంచ దేశాలకు పంపేందుకు కేంద్ర ప్రభుత్వం ఏడు బృందాలను విదేశాలకు పంపాలని నిర్ణయం తీసుకోవటంతో పాకిస్థాన్ కూడా తమ ప్రతినిధి బృందాన్ని పంపాలని ఆలోచిస్తోంది. పాకిస్థాన్ ప్రతినిధి బృందానికి సారథ్యం వహించాలని విదేశాంగ మాజీ మంత్రి బిలావల్ భుట్టోను పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కోరారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో బిలావల్ పోస్టు పెట్టారు. అంతర్జాజీయ సమాజానికి పాకిస్థాన్ వైఖరిని వివరించే బృందానికి నాయకత్వం వహించాలని ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ కోరగా అంగీకరించాను. నాపై పెట్టినబాధ్యతలనునిర్వర్తిస్తాను. ఇలాంటి కఠిన పరిస్థితుల్లో దేశానికి సేవ చేసేందుకు సిద్ధంగాఉన్నానని భుట్టో పోస్ట్ చేశారు.

# పూరీ జగన్నాథుని మహాప్రసాదానికి అపచారం

## డైనింగ్‌టేబుల్‌పై కూర్చుని తిన్న విడియో వైరల్

**పూరి, మే 18:** పూరీ జగన్నాథ ఆలయానికి చెందిన మహాప్రసాదాన్ని ఒక కుటుంబం డైనింగ్ టేబుల్‌పై కూర్చుని తింటున్న వీడియో వివాదానికి దారితీసింది. పూరీ జగన్నాథుడికి సమర్పించబడిన పవిత్ర ఆహారం మహాప్రసాదం, దీనిని సాంప్రదాయకంగా నేలపై కూర్చుని తింటారు. పూరీలోని ఒక బీచ్ రిసార్ట్‌లో డైనింగ్ టేబుల్ వద్ద పూజారి మహాప్రసాదం వడ్డిస్తుండగా పిల్లలతో సహా కనీసం 10 మంది కుటుంబ సభ్యులు తింటూ కనిపించారు. ఒక వ్యక్తి వారిని మహాప్రసాదం అలా తినకూడదు అని వారించారు. పూజారి మీరు అలా ఎందుకు వడ్డిస్తున్నారంటూ ప్రశ్నించాడు. ఈ వీడియో వైరల్ అవ్వడంతో జగన్నాథభక్తులలో ఆందోళనలు తలెత్తడంతో ఆలయ అధికారులు టేబుల్ వద్దమహాప్రసాదంతినడం సంప్రదాయానికి విరుద్ధమని పేర్కొంటూ ప్రకటన విడుదల చేశారు.



# నిజాం నాటి నక్షాలకు మోక్షం

## వచ్చే వారం నుండి ప్రయోగాత్మకంగా ఐదు గ్రామాల్లో రీసర్వే

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త :** రాష్ట్రంలో నిజాం కాలం నుంచి ఉన్న నక్షాలకు మోక్షం కల్పించ బోతున్నామని రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో తర తరాలుగా నిజాం కాలం నుండి సర్వే చేయని లేదా సర్వే రికార్డులు లేని 413 గ్రామాలు ఉన్నాయని గత పది సంవత్సరాలలో ఈ సమస్యకు ఆనాటి టిఆర్ఎస్ ప్రభుత్వం పరిష్కారం చూపలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ఇందిరమ్మ ప్రభుత్వం దీనికి పరిష్కారం చూపాలని నిర్ణయించిందని తెలిపారు. ఇందుకు గాను 413 గ్రామాల్లోని ఐదు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టు నిర్వహించి దానిలో వచ్చే ఫీడ్‌బ్యాక్ మేరకు మిగిలిన గ్రామాల్లో కూడా చేపడతామని తెలిపారు.

పైలట్ గ్రామాలు మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్‌నగర్, జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి (కొత్తది) గ్రామం, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం షాహిద్ నగర్ గ్రామాలను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలలో ఆధునిక సాంకేతికను వినియోగిస్తూ రెండు పద్దతులలో విస్తృత సర్వే జరుగుతుందని, ఏరియల్, డ్రోన్ సర్వే పద్దతి, ప్యూర్ గ్రౌండ్ ట్రూతింగ్ పద్దతుల్లో సర్వే చేసి జియో రిఫరెన్స్, క్యాడస్ట్రల్ మ్యాపులు, హక్కుల నమోదు పత్రాలను తయారుచేస్తారని తెలిపారు. ఈ నూతన విధానాల వలన భూమి సమాచారం, పారదర్శకత, వివాద పరిష్కారం, భూ యాజమాన్యంలో స్పష్టత వస్తుంది, ఫలితంగా రైతులు, గ్రామీణ భూయజమా నులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ రీ సర్వే కోసం వివిధ రాష్ట్రాలలో రీ సర్వే లో అనుభవం కలిగిన ఆర్వీ అసోసియేట్స్, మార్వెల్ జియో స్పేషియల్, ఐఐసి టెక్నాలజీస్, నియో జియో, డ్రోగో డ్రోన్ సంస్థలను ఎంపిక చేశామని మంత్రి తెలిపారు. పైలట్ గ్రామాల్లో ఈ సంస్థలు రీ సర్వే చేస్తాయని, సర్వే ఫలితాల ఆధారంగా మిగిలిన గ్రామాలకు విస్తరిస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఆధునిక యంత్రాలు, టెక్నాలజీని వాడుకుని శాశ్వతంగా భూ సమస్యలను పరిష్కరించే దిశగా మా ప్రభుత్వం అడుగులు వేస్తుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

**మున్నేరు, పాలేరు లింక్**

**కెనాల్‌కు రూ.162.54 కోట్లు విడుదల**

వృధాగా సముద్రంలోకి వెళ్తున్న మున్నేరు వాగు వరద నీటిని గ్రావిటీ కెనాల్ ద్వారా పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించడానికి మున్నేరు పాలేరు లింక్ కెనాల్ కు రాష్ట్ర ప్రభుత్వం రూ.162.54 కోట్లు విడుదల చేసిందని రెవెన్యూ, హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి జీవో నెంబర్ 98 ని విడుదల చేసినట్లు చెప్పారు.

సముద్రంలోకి పోయే వరద నీటిని రూపాయి ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా మళ్లించాలన్న ఆలోచన ఈ రాష్ట్రాన్ని పదేళ్ల ఏలిన ప్రభుత్వానికి రాలేదని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ఇందిరమ్మ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల వృధాగా పోతున్న వరద నీటిలో సుమారు 10 టిఎంసిల వరద నీటిని పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించవచ్చన్నారు. దీంత ఈ రిజర్వాయర్ పరిధిలో 2.54 లక్షల ఎకరాల ఆయ కట్టు స్థిరీకరణ జరుగుతుందని ఇందులో ఒక్క పాలేరు నియోజకవర్గంలోనే 1.30 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని తెలిపారు. పాలేరు లింక్ కెనాల్‌కు నిధులు విడుదల చేసిన సిఎం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అలాగే ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ జేస్తున్నా అన్నారు. సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలకు తాగునీరు, డోర్నకల్ నియోజకవర్గం పరిధిలో పది చెరువులకు సాగునీరు ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతీ ఏటా వర్షాకాలంలో వస్తున్న వరద నీరు వృధా కాకుండా ఒడిసి పట్టాలనే సంకల్పంతో మున్నేరు నుంచి పాలేరుకు లింక్ కెనాల్‌ను మంజూరు చేయించుకున్నట్లు తెలిపారు. నిర్దేశించిన గడువులోగా ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు.



# ప్రతి ఎకరం సాగులోకి తీసుకురావడమే లక్ష్యం

### రెండు నియోజకవర్గాలను సస్యశ్యామలం చేస్తాం

### పనుల జాప్యంపై మంత్రి ఉత్తమ్ ఆగ్రహం

**హుజూర్‌నగర్ (గరిడేపల్లి), మే 18, ప్రభాతవార్త :** కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ప్రతి ఎకరాన్ని సాగులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తంకుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం పాలకీడు మండలంలోని బెట్టే తండ లోని మూసీ నది వద్ద, జాన్ పహాడ్ సమీపంలోని కృష్ణా నది వద్ద నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకాల పనులను ఆయన పరిశీలించారు. మొదట పెట్టే తండా సమీపంలోని మూసీ నది వద్ద 33 కోట్ల 83 లక్షలతో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం నిర్మాణపు పనులను ఆయన పరిశీలించి అధికారులను పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆగస్టు నెల వరకు ఈ పథకం పూర్తవుతుందని మంత్రికి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ పథకం పూర్తి అయితే బెట్టే తండా, పాడే తండా, రాఘవాపురం, సజ్జాపురంలోని బడుగు బలహీన వర్గాల రైతులకు చెందిన 2,041 ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందని తెలిపారు.

గిరిజనులకు చెందిన 1877 మంది, షెడ్యూల్ కులాలకు చెందిన 34 మంది, బలహీన వర్గాలకు చెందిన 100 మంది, ఇతరులు 97 మంది మొత్తంగా 2,176 మంది రైతులకు చెందిన 2041 ఎకరాలు సాగులోకొస్తాయని తెలిపారు. ఈ పథకం అమలు అయితే ఈ ప్రాంతంలోని పేద రైతాంగానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆయన తెలిపారు. ఈ పథకానికి సంబంధించి భూ సేకరణ పూర్తయిందని వాటికి సంబంధించిన రైతులకు నష్టపరిహారం కూడా చెల్లించడం జరిగింది అని తెలిపారు.

ఈ పథకం అమల్లోకి వచ్చి రైతులకు సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులు ఆదేశించారు. అనంతరం జాన్ పహాడ్ సమీపంలోని కృష్ణా నది వద్ద 273 కోట్లతో నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పనులను ఆయన పరిశీలించారు. ఈ పథకం ద్వారా సుమారు 11 గ్రామాలకు చెందిన పదివేల ఎకరాలకి సాగునీరు అందించే లక్ష్యంతో ఈ పథకాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం నిర్మాణం పనులను ఇప్పటికి రెండుసార్లు పరిశీలించానని, ఇది మూడవ సారి పరిశీలించేందుకు వచ్చానని ఆయన పనుల్లో పురోగతి కనిపించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీ తీరుపై ఆయన మండిపడ్డారు. అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేదని ఆయన మందలించారు. నిర్మాణపు పనులు వేగవంతం చేయాలని అవసరమైన నిధులను విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

పనుల్లో జాప్యం బాగా జరుగుతుందని ఏజెన్సీ నిర్లక్ష్యం కనిపిస్తుందని ఇకనుంచి పథకాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని, అవసరమైతే ఎక్కువ మిషన్లను, కూలీలను పెంచుకొని నవంబర్ నాటికి పూర్తి చేయాలని ఏజెన్సీని ఆదేశించారు. నిర్మాణపు పనుల్లో జాప్యం జరిగిన నిర్లక్ష్యం వహించిన సహించేది లేదన్నారు. ఈ పథకం పూర్తి అయితే జాన్ పాడ్, గుండబోయిన గూడెం, గుండ్లపాడు, అలింగాపూర్, బొత్తల పాలెం, కోమటికుంట, మీగడం పాడు తండా, చెరువు తండా, పాలకవీడు, సజ్జాపురం, నాగిరెడ్డి గూడెం గ్రామాల్లోని పదివేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు.

# వన్ నేషన్-వన్ ఎలక్షన్‌పై ప్రజల్లో చైతన్యం నింపాలి

### ఒకేసారి ఎన్నికలు జరిగితే సమయం వృధాకాదు

### రాజకీయ, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చట్టాలు మార్చుకోవాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి




**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 76 సంవత్స రాలు పూర్తి చేసుకున్న ఇంకా బ్రిటిష్ వారి విధానాల్ని అవలంబిస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దేశంలో ఉన్నటువంటి వర్తమాన రాజకీయ, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చట్టాల్ని మార్చుకోవాల్సి న అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆదివారం ఒకే దేశం ఒకే ఎన్నికలు పేరుతో దేశవ్యాప్త అవగాహన కార్యక్రమంలో భాగంగా, నగరంలో ఒక హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ పరిస్థితులకు అనుగుణంగా ఇప్పటికే కొన్ని చట్టాలు మార్చుకున్నామన్నారు. కానీ దురదృష్టం ఏంటంటే మార్చే క్రమంలో వాటికి అడ్డంపడే ప్రయత్నం జరుగుతుందన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ సంబంధించి ప్రజల్లో చైతన్య నింపాల్సి న అవసరం ఎంతైనా ఉందని, ఈ నినాదాన్ని ప్రజల మధ్యకు తీసుకుని వెళ్లాలన్నారు. ఈ క్రమంలో రాజకీయ పార్టీలపై, మేధావులపై, విశ్లేషకులపై ఒత్తిడి తీసుకురావాల్సి న అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇది ఒక ప్రజా ఉద్యమంగా మారాలంటూ కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడ ఎలక్షన్ జరిగిన దేశమంతా చర్చ జరుగుతుందన్నారు. దీనివల్ల ఎన్నో పని గంటలు వృధా అవుతున్నాయన్నారు. ఒకేసారి ఎన్నికలు జరిగితే ఇలాంటి పరిస్థితి ఉండదన్నారు. దేశంలో మార్పు రావాలి అంటే మోడీ నాయకత్వంలోనే మార్పు వస్తుందన్నారు. జిఎస్టీ విషయంలో కావచ్చు, 370 ఆర్టికల్ విషయంలో కావచ్చు అది ఏదైనా మోడీ పట్టుదలతోనే అది సాధ్యమైందన్నారు. ట్రిబుల్ తలక్ విషయంలో కూడా అదే జరిగిందన్నారు. సిఏఏ న్యూ క్రిమినల్ యాక్ట్, తీసుకోచ్చింది మోడీ ప్రభుత్వమే అన్నారు. ఉగ్రవాదాన్ని మోడీ ప్రభుత్వమే కూకటి వేళ్ళతో పెకిలించే ప్రయత్నం చేస్తుందన్నారు. గతంలో హైదరాబాద్ నగరంలో ఎన్నో ఘటనలు మనం చూసామన్నారు.

పాకిస్థాన్ విషయంలో నేడు పరిస్థితి మారింది ఉగ్రవాద చర్యలకు పాల్పడితే పాకిస్తాన్ గడ్డమీదికి వెళ్లి వారిని తుద ముట్టించే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. పహల్గం దాడి తర్వాత క్యాండిల్ లైట్లతో ఎర్ర గులాబీలతో సంతాపం ప్రకటించలేదని, వారి స్థావరాల్ని పేల్చేశాం అన్నారు. ఇది దేశం గురించి ఆలోచించే వారికే సాధ్యమవుతుందన్నారు. అధికారం కోసం ఓట్ల కోసం పదవుల కోసం ఆలోచించే వారికి సాధ్యం కాదన్నారు. ఏదైనా దేశంలో సంస్కరణలు తీసుకు రావడం దేశం కోసం ఏదైనా చేయాలంటే అది మోడీ ప్రభుత్వానికి సాధ్యం అన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం, రైల్వేస్టేషన్ పునర్నిర్మాణం లాంటి అనేక చర్యలు చేపట్టిందన్నారు. ప్రస్తుతం దేశం పరిస్థితులు దేశం యొక్క అభివృద్ధి వన్ నేషన్ వన్ ఎలక్షన్ రావాల్సి ందే అన్నారు. ఎక్కడో ఒకచోట ఎప్పుడు ఎలక్షన్స్ ఉండడం వల్ల సిబ్బందికి ప్రభుత్వానికి ఇబ్బంది అన్నారు. అభివృద్ధికి అడ్డంకిగా మారుతుందని, ఈ విషయంలో ఒక్కసారి ప్రజలందరూ ఆలోచించాలన్నారు. దేశ అభివృద్ధి కోసం భవిష్యత్తు తరాల నిర్మాణం సంస్కరణలు తీసుకురావాల్సి ందేనని, తీసుకురావాల్సి న అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విషయంలో మోడి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలన్నారు. రాఫెల్ యుద్ధ విమానాల విషయంలో ప్రతిపక్షాలు ఎంత రాద్ధాంతం చేశాయో అందరికి తెలుసు. కానీ నేడు యావత్ ప్రపంచం మన దేశం వైపు చూస్తుందన్నారు. భవిష్యత్తు తరాలకు మంచి దేశాన్ని అందించాలంటే వన్ నేషన్ వన్ ఎలక్షన్ అవసరం ఉందని, దీనికి అందరూ ప్రజలు సహకరించాలన్నారు. మేధావులు అన్ని వర్గాలు ఆలోచించాలని, ప్రజలు సహకరించాలన్నారు.

## రూ.11 లక్షల విలువైన పటిక, బెల్లం పట్టివేత

### నల్గొండ, సిద్దపేటలో ఎక్సైజ్ అధికారుల దాడులు

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది మూడుచోట్ల దాడులు నిర్వహించి 6,740 కేజీల బెల్లం 250 పటిక పట్టుకున్నారు. బెల్లం పట్టిక విలువ రూ.11 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ అధికారులు అంచనా వేశారు. బెల్లం ఆలంతోపాటు పట్టుకున్న వాహనాల విలువ రూ. 23 నుంచి రూ.25 లక్షల మేర ఉంటుందని అంచనా వేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో లారీలో అక్రమంగా వెళుతున్న 8,000 కేజీల బెల్లం, 200 కేజీల పటికను స్వాధీనం చేసుకొని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నల్లగొండ జిల్లా కొండ మల్లేపల్లి రోడ్‌లో లారీలో వెళ్తున్న 2,400 కేజీల బెల్లాన్ని దేవరకొండలో పట్టుకున్నారు. నిర్మల్ ఖానాపూర్ ప్రాంతంలో ఎక్సైజ్ సిబ్బంది బైక్ పై తీసుకు వెళుతున్న 340 కేజీల బెల్లాన్ని 20 కేజీల ఆలమును ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.



## హెలికాప్టర్ ద్వారా సరస్వతిఘాట్‌ను పరిశీలించిన కలెక్టర్ రాహుల్‌శర్మ

**కాళేశ్వరం, మే 18, ప్రభాతవార్త:** హెలిప్యాడ్ వద్ద జాయ్‌రైడ్ హెలికాప్టర్, సరస్వతి ఘాట్‌ను ఆదివారం ఉదయం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. భక్తులు కాళేశ్వరం అందాలను వీక్షి ంచేందుకు అనువుగా జాయ్ రైడ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం సరస్వతి ఘాట్ ప్రాంతాలను పరిశీలించారు. ఏర్పాట్లను సమీక్షి స్తూ, వాకీటాకీ ద్వారా అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం భక్తుల రద్దీ పెరుగు తుందని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అధికారులు వారి కేటాయించిన విధుల్లో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విభాగం అధికారులు వారి ప్రదేశాల్లో నిరంతరం పర్యవేక్షణ చేపట్టి, భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టంగా ఆదేశించారు. స్నాన ఘాట్స్ వద్ద పరిశుభ్రత పాటించాలని సూచించారు భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని, శుభ్రత, నీటి సరఫరా, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు.

## 42 శాతం రిజర్వేషన్ల అమలు చేశాకే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

### 14 బిసి సంఘాలు డిమాండ్

**హైదరాబాద్(సైఫాబాద్), మే 18, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి లకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని 14 బిసి సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. రాజకీయ పార్టీల సవాళ్లు-ప్రతిసవాళ్లతో సమస్యను పక్కదారి పట్టిస్తే సహించేది లేదని హెచ్చరించాయి. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేష్ అధ్యక్షతన 14 బిసి సంఘాల సమావేశం జరిగింది. ఈ సమా వేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజ్యసభసభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కొంతమంది బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభుత్వానికి దమ్ముంటే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని సవాళ్లు విసురుతున్నారని, ఇలాంటి సవాళ్ల ఉద్దేశం ఏమిటీ?, రిజర్వేషన్‌లు పెంచకుండానే ఎన్నికలకు వెళ్లాలనా?, అన్ని పార్టీల ప్రతి సవాళ్లు రిజర్వే షన్‌లను పెంచకుండా తప్పించుకోవాలని చూస్తున్నాయా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం చేసిన వాగ్దానం ప్రకారం బిసి రిజర్వేషన్‌లను పెంచి ఎన్నికలు జరపాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సమావేశంలో బిసి నాయకులు జిల్లపల్లి అంజీ, పగిళ్ళ సతీష్, రాందేవ్, నిమ్మల వీరన్న, చిక్కుడు బాలయ్యముదిరాజ్, నిఖిల్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మద్యం ధరలు పెంపు

### వైన్‌షాపులకు సర్క్యులర్లు జారీ

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** తెలంగాణలోని మందుబాబులకు బ్యాడ్ న్యూస్. మద్యం ధరలు పెరగనున్నాయి. క్వార్టర్‌పై రూ. 10, హాఫ్‌పై రూ. 20, ఫుల్‌పై రూ. 40 పెంచేందుకు ఎక్సైజ్ శాఖ సర్క్యులర్లు పంపినట్లు సమాచారం. ఇటీవలే బీర్ల ధరలు పెంచిన ప్రభుత్వం, ఇప్పుడు ఇతర మద్యం ధరలు పెంచేందుకు డిసైడ్ అయింది. అయితే ఈ పెంపుపై ఎక్సైజ్ శాఖ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ధరలు పెరిగినా అమ్మకాలు తగ్గకపోవచ్చని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

తెలంగాణలో మద్యం ప్రియులకు ఇది నిజంగా షాకింగ్ న్యూసే. ఇటీవలే బీర్ల ధరలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వం, తాజాగా ఇతర మద్యం ధరలను కూడా పెంచడానికి సిద్ధమైంది. మార్కెట్ ధరల్లో మార్పుల కారణంగా ఈ కొత్త రేట్లు అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం. తెలంగాణ ఎక్సైజ్ శాఖ మద్యం ధరలను పెంచుతూ మద్యం దుకాణాలకు సర్క్యులర్లు పంపినట్లు తెలిసింది. ఈ సర్క్యులర్ల ప్రకారం, 180 (మిల్లీ లీటర్లు)క్వార్టర్ బాటిల్‌పై రూ. 10, 360 (మిల్లీ లీటర్లు)హాఫ్ బాటిల్‌పై రూ. 20, ఫుల్ బాటిల్‌పై రూ.40 ధరలు పెరగనున్నాయి. అయితే, ఈ ధరల పెరుగుదలపై ఎక్సైజ్ శాఖ నుండి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

అధికారిక ప్రకటన లేకపోవడంతో మద్యం ప్రియులు కొంత గందరగోళానికి గురవుతున్నారు. ఒకవైపు ధరల పెంపు గురించి వార్తలు వస్తుండగా.. మరోవైపు ఎక్సైజ్ శాఖ దీనిపై స్పందిచడం లేదు. ఒకవేళ ఈ ధరల పెరుగుదల వాస్తవమైతే మందుబాబుల జేబులకు మరింత చిల్లు ఎట్టే అవకాశముంది. గత అనుభవాలను బట్టి చూస్తే ధరలు పెరిగినా అమ్మకాలు ఆశించిన స్థాయిలో తగ్గకపోవచ్చని తెలుస్తోంది. తతెలంగాణలో మద్యం అమ్మకాల జోరు కొనసాగే అవకాశం ఉంది. ధరల పెంపుపై ఎక్సైజ్ శాఖ ఎప్పుడు అధికారికంగా ప్రకటన చేస్తుందో వేచి చూడాలి. ఇక తెలంగాణలో ఎండలు మండు తుండటంతో బీర్లకు డిమాండ్ భారీగా పెరిగింది. ఎండలు తీవ్రంగా ఉండటంతో చల్లని బీర్ తాగడానికి మందుబాబులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా బీర్ల అమ్మకాలు ఒక్కసారిగా పెరిగాయి.

సాధారణ రోజులతో పోలిస్తే అమ్మకాలు రెట్టింపు అయ్యాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా యువత బీర్లు ఎక్కువగా తాగుతున్నారు. అయితే, ఈ పెరిగిన డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, బేవరేజెస్ కంపెనీల విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే బీర్ల ధరలను 15 శాతం వరకు పెంచింది. ధరలు పెరిగినా అమ్మకాలు మాత్రం తగ్గడం లేదు. పెళ్లిళ్ల సీజన్ కూడా కొనసాగుతుండటంతో బీర్ల వినియోగం మరింతగా పెరిగింది. దీంతో వైన్ షాపుల్లో చల్లని బీర్లు దొరకడం కూడా కష్టంగా మారింది. గత ఏడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏడాది బీర్ల అమ్మకాలు రెట్టింపు అయినట్లు ఎక్సైజ్ శాఖ తెలిపింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో చల్లటి బీర్లకు కొరత ఏర్పడింది. ఏప్రిల్ నెలలో మద్యం అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి రూ. 3,272.32 కోట్ల ఆదాయం వచ్చింది. ఈనెలాఖరు వరకు బీర్ల డిమాండ్ ఇలాగే కొనసాగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## వణ్యప్రాణుల రక్షణకు 150 ప్రత్యేక బృందాల ఏర్పాటు

**హైదరాబాద్,మే 18,ప్రభాతవార్త :** వన్యప్రాణుల సంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించనుంది. ఇందులో భాగం వాటి సంరక్షణక ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. అడవులు, ఇతర ప్రాంతాల్లో వేటగాళ్ళ వేటకు అనేక వన్యప్రాణులు బలువుతున్నాయి. వేటగాళ్ళ బారి నుంచి వాటిని కాపాడేందుకు రాష్ట్రప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంది. వీటి సంరక్షణ కోసం ప్రత్యేకంగా 150 స్పెషల్ టీమ్స్ ఏర్పాటు చేసింది వేటగాళ్ల నుంచి జంతువులను రక్షించడంతోపాటు వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేలా ఈ బృందాలు పనిచేస్తాయి. జంతువుల రాకపోకలను పసిగట్టేందుకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 242 ట్రాక్టర్లు ఏర్పాటు చేయనున్నట్లు... రాజాగా ప్రకటన విడుదలైంది. వాటి దాహార్తి తీర్చడానికి మొత్తం 449 సోలార్ బోర్ వెల్స్ అమర్చబోతున్నారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో... వన్యప్రాణులకు చాలావరకు మేలు జరగడమే కాకుండా వేటగాళ్ళ ఆటను కూడా కట్టించనట్లు అవుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# తెలంగాణలో డమ్మీ పేలుళ్లకు ఐసిస్ కుట్ర

### ఇద్దరు ఉగ్రవాదుల అరెస్టు

### పాక్‌పై భారత్ దాడి చేసినందుకు కుట్ర

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** నిషిద్ధ ఐసిస్ ఉగ్రవాద సంస్థ తెలంగాణలో మరోసారి పేలుళ్లకు కుట్ర పన్నింది. పహల్గాం ఉగ్రదాడి తరువాత పాక్‌పై భారత్ దాడికి దిగినందుకు ప్రతీకారంగా వీరు ఈ కుట్ర పన్నినట్లు తేలింది. దీనిపై తెలంగాణ, ఎపి పోలీసులు పక్కా సమాచారంతో ఇద్దరు ఉగ్రవాదులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి పేలుడు పదార్థాలను జప్తు చేశారు. పట్టుబడ్డ ఉగ్రవాదుల్లో ఒకడు విజయనగరం వాసి కాగా మరొకతను హైదరాబాద్ వాసి. సౌది అరేబి యా నుంచి ఈ ఇద్దరు ఉగ్రవాదులకు ఐసిస్ పెద్దలు ఈ పేలుళ్ల కుట్రకు ఆదేశించినట్లు తేలింది. వివరాలు ఇలావున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, దాని తరువాత పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ దాడికి దిగడం, అనంతరం పాక్ డ్రోన్లతో ఎదురు దాడి చేయడం, వీటిని భారత సైన్యం ధ్వంసం చేయడం తెలిసిందే. దీని తరువాత పాక్ అనుకూల ఉగ్రవాద సంస్థ లు భారత్‌లో దాడులకు పాల్పడే వీలుందన్న నిఘా వర్గాల సమాచారంతో పోలీసులు దేశ వ్యాప్తంగా అప్రమత్త ంగా వుండసాగారు. ఈ క్రమంలో కాశ్మీర్‌లో పలువురు ఉగ్రవాదులు పట్టుబడగా ఆరుగురు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. దీంతో పాటు ముంబాయిలో ఇద్దరు ఐసిస్ ఉగ్రవాదులను జాతీయ దర్యాప్తు సంస్థ అరెస్టు చేసింది. వీరిద్దరు దుబాయ్ నుంచి భారత్‌కు రాగా ముంబాయి విమానాశ్రయంలో పట్టుబడ్డారు. వీరిద్దరు 2023 పూణె పేలుళ్ల కేసులో నిందితులు. వీరిని విచారిస్తున్న క్రమంలో అందిన సమాచారం ఆధారంగా విజయనగరం వాసి సిరాజ్, హైదరాబాద్‌కు చెందిన స మీర్ అనే ఐసిస్ ఉగ్రవాదులు హైదరాబాద్‌లో డమ్మి పేలుళ్లకు కుట్ర పన్నినట్లు తేలింది. పాక్‌పై భారత్ దాడులకు పాల్పడినందుకు వీరు హైదరాబాద్‌లో డమ్మీ పేలుళ్లకు పాల్పడి ప్రజలను భయాందోళనలకు గురిచేసేందుకు వ్యూహం పన్నినట్లు తేలింది. దీనిపై ఎన్ఐఎ అధికారులు తెలుగు రాష్ట్రాల పోలీసలును అప్రమ త్తం చేయడంతో రెండు రాష్ట్రాల కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు వెంటనే రంగంలో దిగి విజయనగరంలో సిరాజ్‌ను, హైదరాబాద్‌లో సమీర్‌ను అరెస్టు చేశారు. వీరిని విచారిస్తున్నారు. పోలీసుల విచారణలో వీరు తమ నేరాన్ని అంగీకరించినట్లు తెలిసింది. సోమవారం నాడు ఇద్దరు ఉగ్రవాదులను కోర్టులో హాజరు పరిచి రిమాండుకు తరలించే వీలుంది.

# నకిలీ మందుల అమ్మకాలపై నిరంతరం నిఘా పెట్టాలి

### డిసిఎ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసిం

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** మార్కెట్లో నకలీ మందుల వ్యాప్తిని అరి కట్టేందుకు దాడులు ముమ్మరం చేయాలని, నిరంతర నిఘా తోనే ఈ దందాను అరికట్టవచ్చని తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ షా నవాజ్ ఖాసీం అన్నారు. ఈ మేరకు ఆయన ఆబ్కారీ శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వ హించారు. నకిలీ ఔషధాల తయారీ, పంపిణీ, అమ్మకాలలో నిమగ్నమైన వ్యవహారాలను నిర్మూ లించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతరం నకిలీ డ్రగ్స్ తరలించి విక్రయా లకు పాల్పడు తున్న వారిపై నిఘా పెంచాలన్నారు.

అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్ దుర్వినియోగాన్ని అరికట్టడం మన శాఖ కర్తవ్యమన్న డైరెక్టర్ జనరల్ నకిలీ డ్రగ్స్ దందాను అరికట్టేందుకు సమిష్టి కృషి అవస రమన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి డ్రగ్స్ ఫ్రీతెలంగాణ లక్ష్యాన్ని నిజం చేసేందుకు, మత్తుపదార్థాల దుర్వినియో గాన్ని అరికట్టేందుకు మధ్యపాన నిషేధ శాఖతో సమన్వయంగా 1 కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఔషధ తనిఖీ అధికా రులు విక్రయ కేంద్రాలలో తనిఖీలు నిర్వ హిస్తూ తప్పని సరిగా క్యూఆర్ కోడ్లు ధృవీకరించాలని, నకిలీ ఔషదాలు గుర్తించేందుకు నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. అలాగే ప్రజలను తప్పుదారి పట్టించే అనధికారిక ప్రకటనలు చేసేవ్యక్తులపై కఠిన చర్యలు తీసుకో వాలని అధికారులను ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

## మంద కృష్ణమాదిగ, చెన్నయ్య రహస్యమిత్రులు

### పిడమర్తి రవి ఆరోపణ

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా హైకోర్టులో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య వేసిన కేసు వెనుక ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హస్తం ఉందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పడమర్తి రవి ఆరోపించారు. రాష్ట్రంలో మాదిగలకు 9 శాతం రిజర్వేషన్‌లు కల్పించి వర్గీకరణ అమలు చేస్తున్న తరుణంలో 5 శాతం కూడా లేని మాల సామాజిక వర్గానికి ప్రభుత్వం కల్పిస్తే దాన్ని కూడా ఓర్వలేని జి.చెన్నయ్య వర్గీకరణ అమలుపై హైకోర్టులో కేసు వేయడం వెనుక కృష్ణమాదిగ హస్తం ఉందని, ఆదే విధంగా జి.చెన్నయ్య, కృష్ణమాదిగ రహస్య మిత్రులని, గత మూడు దశాబ్ధాల కాలంలో మంద కృష్ణమాదిగ, జి.చెన్నయ్యకు డబ్బులు ఇచ్చి వర్గీకరణ వ్యతిరేక ఉద్యమం చేయించారని, ఇప్పుడు కూడా హైకోర్టులో ఫిటిషన్ దాఖలు చేయించారని ఆరోపించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పిడమర్తి రవి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వానికి మందిగలంతా సిఎం రేవంత్‌రెడ్డి పక్షాన ఉంటే దీన్ని ఓర్వలేక కృష్ణమాదిగ ఈ పనిచేశారని, భవిష్యత్తులో బిజెపి బలోపేతం కోసం కృష్ణమాదిగ ఈ పనిచేశారని, ఎన్ని కుట్రలు చేసినా రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో వర్గీకరణను అమలు చేసి తీరుతారని ఆయన స్పష్టం చేశారు. సరస్వతి పుష్కారాలలో ఎంపి వంశీకృష్ణకు ఆహ్వాన పత్రిక అందలేదని జి.చెన్నయ్య వ్యాఖ్యలు మానవ అహంకారానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో వర్గీకరణను అడ్డుకోవడం మనువాదమే అవుతుందని హెచ్చరించారు. జూన్ 1వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వర్గీకరణ ఉద్యమంలో పాల్గొన్న నాయకులను సన్మానిస్తున్నామని, ఈ కార్యక్రమం తొలుత హైదరాబాద్‌లో ప్రారంభమౌ తుందన్నారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్ కన్వీనర్ మీసాల మల్లేష్, బిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, నిమ్మల వీరన్న, వరలక్ష్మి, జోగు గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## సనంద్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న కేంద్రమంత్రి అమిత్‌షా

**సనంద్(గుజరాత్), మే 18:** ఆపరేషన్ సింధూర్‌తో భారత్ విజయానికి ప్రతీకగా దేశవ్యాప్తంగాజరుగుతున్న తిరంగార్యాలీల్లో కేంద్ర మంత్రులు కూడా పాల్గొంటున్నారు. గుజరాత్ బిజెపి ఆధ్వర్యంలో జరిగిన తిరంగా ర్యాలీలోకేంద్ర మంత్రి అమిత్‌షా పాల్గొన్నారు. మువ్వన్నెల జెండాను చేతపట్టి సనంద్‌లోని నల్ సరోవర్ చౌకిడినుంచి మెక్లింగ్‌జీరోడ్డులోని మహారాణప్రతాప్ చౌక్‌వరకూ పాదయాత్రచేసారు. ర్యాలీలో ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, హర్ష్‌సంఘ్వి తదితర రాష్ట్రమంత్రులు కూడా పాల్గొన్నార. ఎక్లింగ్‌జీరోడ్డులోనే 16వ శతాబ్దపు మహాయోధుడి విగ్రహం వద్ద నివాళి అర్పించి అనంతరం పాదయాత్రను కొనసాగించారు. స్థానిక ఎమ్మెల్యేలు, బిజెపి నాయకులు, వివిధ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. సనంద్‌పరిసరాలనుంచి కూడా సామాజిక రాజకీయ కార్యకర్తలు తిరంగా యాత్రలో పాల్గొని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలుచేసారు. త్రివిధ దళాల ధైర్యసాహసాలను ప్రతి ఒక్కరూ అభినందించారు. ఆపరేషన్‌సింధూర్ విజయవంతంచేయడంలో మన త్రివిధ దళాల శక్తిని ప్రపంచానికి చాటిచెప్పామని, మన యోధులకు గౌరవ సూచకంగానే ఈ యాత్రలునిర్వహిస్తున్నట్లు గుజరాత్ బిజెపి రాష్ట్రయూనిట ప్రకటించింది. గడచిన రెండురోజులుగా హోంమంత్రి అమిత్‌షా గుజరాత్ లోనే పర్యటిస్తున్నారు. వివిధ రోడ్డుపనులకు ఆయన శంకుస్థాపనలు, అభి వృద్ధి పనులకు ప్రారంభోత్స వాలు చేసారు.

## మహారాష్ట్రలో చీఫ్‌జస్టిస్ గవాయ్‌కి అవమానం

### ప్రొటోకాల్ పాటించని

### చీఫ్‌సెక్రటరీ, డిజిపి, కమిషనర్

**ముంబయి, మే 18:** న్యాయవ్యవస్థలో అత్యున్నత పదవి అయిన భారత ప్రధాన న్యాయమూర్తి పీఠంపై ఉన్న రెండో దళిత జడ్జి జస్టిస్ బీఆర్ గవాయ్‌కు సొంతరాష్ట్రంలో అవమానం జరిగింది. మహారాష్ట్రలో ఆయన హాజరైన ఓ కార్యక్రమానికి రాష్ట్ర సీఎస్, డీజీపీ, ముంబై పోలీసు కమిషనర్ ఎవరూ హాజరు కాలేదు. దీనిపై ఆయన తీవ్ర అస హనం వ్యక్తం చేసారు. స్వరాష్ట్రం మహా



రాష్ట్రకు తొలిసారి ఛీఫ్ జస్టిస్ హోదాలో అడుగుపెడితే ఇలా వ్యవహరిస్తారా అంటూ బీఆర్ గవాయ్ ఫైర్ అయ్యారు. సీజేఐ అయిన సందర్భంగా ముంబైలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి గవాయ్ హాజరయ్యారు. అనంతరం బాబాసాహెబ్ అంబేద్కర్ స్మారక చైత్య భూమిని సందర్శించారు. మహారాష్ట్ర, గోవా బార్ కౌన్సిల్ నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ప్రసంగించిన ఛీఫ్ జస్టిస్ ముగ్గురు కీలక అధికారులు మహారాష్ట్ర చీఫ్ సెక్రటరీ, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ముంబై పోలీస్ కమిషనర్ అక్కడికి రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. న్యాయమూర్తులు ప్రోటోకాల్ ఉల్లంఘిస్తే సుప్రీంకోర్టుకు ప్రత్యేక అధికారాలు కల్పిస్తున్న ఆర్టికల్ 142 గురించి చర్చలు మొదలుపెడతారని, కానీ మూడు రాజ్యాంగ వ్యవస్థలూ పరస్పరం గౌరవం ఇచ్చుకోవాలని, సహకరించు కోవాలని సీజే గవాయ్ సూచించారు. ప్రజాస్వామ్యానికి మూడు స్తంభాలైన న్యాయవ్యవస్థ, శాసనసభ, కార్యనిర్వాహక వ్యవస్థ సమానమని ఆయన తెలిపారు. ప్రతి రాజ్యాంగ సంస్థ ఇతర సంస్థలకు ప్రతిస్పందించాలని, గౌరవం చూపాలని ఆయన తెలిపారు. మహారాష్ట్ర నుండి ఒక వ్యక్తి భారత ప్రధాన న్యాయమూర్తి అయినప్పుడు, మొదటిసారి స్వరాష్ట్రాన్ని సంద ర్శించినప్పుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ లేదా ముంబై పోలీస్ కమిషనర్ హాజరు కావడం సముచితం కాదని భావిస్తే, వారు దాని గురించి ఆలోచించాలని సూచించారు. ప్రోటోకాల్‌లు కొత్తవి కావని, ఇది ఒక రాజ్యాంగ సంస్థ మరొక సంస్థకు ఇచ్చే గౌరవానికి సంబంధించిన ప్రశ్న అన్నారు. ఇవి చిన్న విషయాలుగా అనిపించవచ్చని, కానీ ప్రజలకు వాటి గురించి అవగాహన కల్పించాలని ఆయన కోరారు. సీజే వ్యాఖ్యల తర్వాత సీఎస్, డీజీపీ, ముంబై కమిషనర్ అక్కడికి హుటాహుటిన వచ్చారు.

## కొత్త ఇంటి కల తీరకుండానే..

### అగ్నిప్రమాదంలో దుర్మరణం

**హైదరాబాద్ (చార్మినార్), మే 18, ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ గుల్జారాహౌస్‌లోని ఓ భవనంలో 17 మంది మృతి చెందడంతో తీవ్ర విషాదం నెలకుంది.ప్రహ్లాద్ మోదీ కుటుంబం ఎన్నో సంవత్సరాలు క్రితం హర్యానాలోని నార్‌నౌల్ ప్రాంతం నుంచి గుల్జారాహౌస్‌కు వచ్చారు.ప్రహ్లాద్ మోదీ తన భార్య మున్నీ మోదీతో కలిసిగుల్జారాహౌస్‌లోని తన నివాసంలో ఉంటున్నారు.ప్రహ్లాద్ మోదీకి నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు కలరు.వీరికి గుల్జారాహౌస్‌లో న్యూ పూనమ్ జుయెల్లర్ షాపు ఉంది.కాగా పాఠశాలకు సెలవులు కావటంతో ప్రహ్లాద్ మోదీ కుమార్తెలు, మనవళ్లు, మనవరాళ్లు గుల్జారాహౌస్‌లోని ప్రహ్లాద్ మోదీ ఇంటికి వచ్చారు.వేసవి సెలవులలో పాతబస్తీలో ఉందామని వచ్చిన ప్రహ్లాద్ మోది మనవళ్లు,మనవరాళ్లు అగ్ని ప్రమాదంలో మృతి చెందారు. శనివారం అత్తాపూర్‌లో జరిగిన విందు కార్యక్రమం పాల్గొని తిరిగి ఇంటికి వచ్చారు.ఆదివారం ఉదయం ఆరున్నర గంటల మధ్య జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రహ్లాద్ మోదీ భార్య,మున్నీమోదీ, కుమారుడు ఫంకజ్, కోడలు వర్ష, ఫంకజ్ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు,ప్రహ్లాద్ మోదీ కూతుర్లు శీతల్,రజనీతో పాటు వారి పిల్లలు చనిపోయిన సంఘటన ఎంతగానో కలచి వేసింది.ప్రహ్లాద్ మోదీ సోదరుడు రాజేంద్ర కుమార్ మోదీ, భార్య సుమిత్ర,అభిషేక్‌తోపాటు అగ్ని ప్రమాదంలో 17 మంది చనిపోవటంతో బంధువులు,కుటుంబ సభ్యులు ఎంతగానో రోధిస్తున్నారు.అగ్ని ప్రమాదం విషయం తెలియగానే పాతబస్తీలోని బంగారం నగల వ్యాపారులు తమల దుకాణాలను మూసివేసి సంతాపం ప్రకటించారు.కాగా ప్రహ్లాద్ మోదీ కుటుంబంలో ఇద్దరు కూతుళ్ల ప్రమాదం నుంచి బయట పడ్డారు.కాగా అత్తాపూర్‌లో నిర్మించిన కొత్త ఇంటికి మారాలనుకున్న సమయంలో అగ్ని ప్రమాదంలో మృతి చెందారు.కాగా పాతబస్తీకి చెందిన మీర్ జాహెద్ అనే వ్యక్తి భవనంలోని షెటర్ తొలగించి బాధితులను బయటకు తీసుకు వచ్చిన సమయంలో స్వల్ప గాయలకు గురయ్యాడు.

# సరస్వతి పుష్కరాలలో పోటెత్తిన భక్తులు

### జనసంద్రంగా మారిన కాళేశ్వరం దారులు

### అన్నీ వాహనాలు కాళేశ్వరం వైపే..

### శని, ఆదివారాలలో కొనసాగిన భక్తుల ప్రవాహం

**కాళేశ్వరం, మే 18, ప్రభాతవార్త:** నాలుగో రోజూ కాళేశ్వరం లో జరుగుతున్న సరస్వతి పుష్కరాలకు పోటెత్తిన భక్తుల ప్రవాహం పెరిగిపోయింది. పుష్క రాలకు తరలి వస్తున్న భక్తులు జనసంద్రంగా మారిపోయారు. కారులన్ని కాళేశ్వరం వైపే కొనసాగాయి.త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రం చత్రియాయుధం త్రిజన్మ పాపసంహారం ఏకబిల్వం శివార్పణం...త్రిలింగ క్షేత్రం, త్రివేణి సంగమ తీరానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. సరస్వతి పుష్కరాల్లో 4వ రోజు ఆదివారం ఉదయం నుండే లక్షలాది మంది భక్తులు త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్త జనం కాళేశ్వరం క్షేత్రానికి చేరుకున్నారు. శనివారం ట్రాఫిక్ జామ్ కావడంతో ఎదురైన ఇబ్బందులు తిరిగి పునరావృతం కాకుండా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా వాహనాల రాకపోకలు సాగాయి.

**సైకత లింగాలు..**

సరస్వతి అంతర్వాహిని నది పుష్కరాలను పురస్కరించుకని భక్తులు త్రివేణి సంగమ తీరాన పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం గంగమ్మ ఒడిలో జంగమయ్యను ఆరాధిస్తున్నారు. సైకత లింగాలను తయారు చేసుకున్న భక్తులు శివ నామస్మరణలో చేస్తూ భక్తిని చాటుకుంటున్నారు. నది తీరంలో పవిత్ర స్నానాలు ఆచరించిన తరువాత నదీ తీరంలోనే సైకత లింగాలను తయారు చేసి శివుడిని ప్రత్యేకంగా పూజించే ఆనవాయితీని పాటిస్తారు. అనంతరం త్రివేణి సంగమాన్ని పూజించి దీపారాధన చేసి గంగమ్మకు మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆ తరువాత సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన 17 అడుగుల ఏకశిల సరస్వతి మాతను, శ్రీ కాళేశ్వర, ముక్తీశ్వర స్వామిని, శుభానంద దేవిని, సరస్వతి మాతను దర్శించుకుంటున్నారు. ఆధ్యాత్మికతతో ఉట్టిపడుతున్న త్రివేణి సంగమ తీరం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయింది.



**మొంటెల వాయినం..**

పుష్కరుడు సంచరించే వేళ ముత్తయిదులు మొంటెల వాయినం మొక్కులు తీర్చుకుంటున్నారు. సుభాషిణీలకు సాంప్రాదాయబద్ధమైన ఆచారంలో భాగంగా మొంటెల వాయినాలు ఇస్తూ దీర్ఘ సుమంగలిగా ఉండేలా దీవెనలు అందుకుంటున్నారు. ఏరియల్ సర్వే...త్రివేణి సంగమ క్షేత్రమైన కాళేశ్వరంలో భక్తుల రద్దీ కొనసాగుతున్న నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. గగనంలో సంచరిస్తూ నది తీరం, వాహనాలు రాకపోకలతోపాటు ఏర్పాట్లు తదితర సేవలను పర్యవేక్షి ంచారు.

## మిస్‌వరల్డ్ ఫార్మాట్‌ను విడుదల చేసిన మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్

### 31న హైటెక్స్‌లో ఫైనల్ పోటీలు

**హైదరాబాద్,మే 18,ప్రభాతవార్త :** హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. 108 దేశాల నుండి వచ్చిన అందాల భామలు కిరీటం కోసం పోటీ పడుతున్నారు.ఖండాల వారీగా విభజించి, తుది రౌండ్‌కు నలుగురిని ఎంపిక చేస్తారు. ఈ నెల 31న ఫైనల్ జరగనుంది. అయితే, రామప్ప దేవాలయాన్ని సందర్శించినపుడు జరిగిన ఒక చిన్న సంఘటన వివాదానికి దారితీసింది. అదలా ఉంచితే.. మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్..ఈ పోటీల ఫార్మాట్‌ని వెల్లడించింది. విశ్వనగరం హైదరాబాద్ మరో అరుదైన ఘనత సాధించింది.ఈ ఏడాది భాగ్యనగరం వేదికగా మిస్ వరల్డ్ పోటీలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్.. ఈ పోటీల ఫార్మాట్‌ని వెల్లడించింది.హైదరాబాద్ వేదికగా జరుగుతున్న 72వ ప్రపంచ సుందరి పోటీల్లో.. సుమారు 108 దేశాల భామలు అందాల కిరీటం కోసం పోటీపడుతున్నారు. కంటెస్టెంట్లను ఇప్పటికే ఖండాల వారీగా గ్రూపులుగా విభజించారు. ఒక్కో ఖండం నుంచి 10 దేశాల పోటీదారులు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంటారు. వీరిలోంచి టాప్5ను ఎంపిక చేస్తారు. ఆ తర్వాత టాప్2 తీసుకుంటారు. ఇలా టాప్‌లో నిలిచిన వీరిలో ఒకరు ఆయా ఖండం తరఫున విజేత, మరొకరు రన్నరప్ అవుతారు. న్యాయనిర్ణేతలు ఒక్కో ఖండం నుంచి ఒక్కర్ని విజేతగా ప్రకటిస్తారు. ఆతర్వాత నాలుగు ఖండాల గ్రూపుల్లోంచి నలుగురు సుందరీమణులు చివరి రౌండ్‌కు చేరుకుంటారు. ఇక మిస్ వరల్డ్ ఫైనల్ ఈనెల 31న హైటెక్స్‌లో జరుగుతుంది. ఈ తుది రౌండ్ పోటీల్లో వీరిలోంచి అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చిన సుందరీమణిని మిస్ వరల్డ్‌గా ఎంపిక చేస్తారు.

మిగతా ముగ్గుర్ని ఒకటి, రెండు,మూడో రన్నరప్‌గా ప్రకటిస్తారు. దీని కన్నా ముందు.. ఒక్కో ఖండం తరఫున మొదటి రన్నరప్‌గా నిల్చిన వారు.. ఫైనల్ రౌండ్ తర్వాత ఆయా ఖండాల విజేతలుగా ప్రకటిస్తారు. మిస్ వర్డల్ పోటీల్లో భాగంగా.. శనివారం నాడు క్రీడల ఛాలెంజ్ పోటీలు జరిగాయి. దీనిలో మిస్ వరల్డ్ ఎస్తోనియా ఎలిస్ రాండ్మా విజేతగా నిలిచి స్వర్ణ పతకం గెలుచుకున్నారు. అలానే మే 22న టాలెంట్ ఛాలెంజ్ ఫైనల్, 23న హెడ్ టూ హెడ్ ఛాలెంజ్ ఫైనల్, 24న మిస్ వరల్డ్ టాప్ మోడల్, 26న బ్యూటీ విత్ ఏ పర్పస్ ప్రాజెక్టుల ప్రదర్శన పోటీలు జరగనున్నాయి. తెలంగాణ ప్రభుత్వం అంత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నది. మిస్ వరల్డ్ 2025 పోటీల కోసం వివిధ దేశాల నుండి వచ్చిన అందాల భామలు.. ఇప్పటికే తెలంగాణలోని పలు చారిత్రక కట్టడాలను, దేవాలయాలను సందర్శించారు. ఈ క్రమంలో ఓ చిన్న సంఘటన వివాదాస్పదంగా మారింది. సుందరీమణులు రామప్ప దేవాలయాన్ని సందర్శన కోసం వెళ్లిన సమయంలో.. కొందరు మహిళా వాలంటీర్లు వారికి కాలు కడుక్కునేందుకు సాయం చేశారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో దీనిపై వివాదం రాజుకుంది. కొందరు దీన్ని సమర్థించగా.. మరికొందరు మన ఆడ బిడ్డల ఆత్మగౌరవాన్ని వాళ్ల కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని విమర్శించారు.

# పిఎస్ఎల్‌వి సి-61 రాకెట్ విఫలం

### రక్షణ ఉపగ్రహం కక్ష్యకు చేరకముందే గతితప్పిన రాకెట్

### సాంకేతిక లోపాలను విశ్లేషిస్తున్నామన్న ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్

### కీలక ఉపగ్రహ వైఫల్యంతో అందరిలో నిరాశ, నిస్పృహలు



ఇస్రో ఛైర్మన్ నారాయణన్

**శ్రీహరికోట (తడ),మే 18, ప్రభాతవార్త:** కోట్లాది మంది భారతీయులు ఎన్నో ఆశలతో ఎదురు చూసిన ఉపగ్రహ ప్రయోగ విజయం సిద్ధించలేదు. సరిహద్దు రక్షణలో అత్యంత కీలకం అవుతుందని భావించిన ఇఒఎస్09 ఉపగ్రహం నిర్ణీత కక్ష్యకు చేరలేదు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు తిరుగులేని విజయాలు అందించిన పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్‌వి-సి61) ఈ సారి గతి తప్పింది. ఆదివారం ఉదయం ఉదయం సరిగ్గా 5.59 గంటలకు శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం మొదటి లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగించిన పిఎస్ఎల్‌వి-సి61 రాకెట్ విఫలం చెందింది. కేవలం 6 నిమిషాల 16 సెకన్ల వ్యవధిలోనే దారి తప్పింది. నాలుగు దశలతో నిర్మించిన ఈ రాకెట్ మొదటి, రెండు దశలు విజయవంతంగా దాటుకుని మూడో దశలో దిశ మారిపోయింది. అది ఘన ఇంధన దశ. 1993 సెప్టెంబర్ 20న పిఎస్ఎల్‌వి సిరీస్ ప్రారంభమయింది. ఈ సిరీస్‌లోని మొట్టమొదటి రాకెట్ పిఎస్ఎల్‌వి-డి1 కూడా సరిగ్గా మూడవ దశలోనే గతి తప్పింది. అయితే ఆ తర్వాత ఎన్నో పిఎస్ఎల్‌విలు మరెన్నో ఘన విజయాలు అందిం చాయి. భారత్ ఇప్పటివరకు 63 పిఎస్ఎల్‌వి రాకెట్లు ప్రయోగించగా, ఇది మూడవ వైఫల్యం మాత్రమే. శ్రీహరికోట నుంచి రాకెట్ నింగికి దూసు కెళ్లినతర్వాత 376.8 సెకన్లకు దారి మళ్లి నట్లు



సంకేతాలువచ్చాయి. ఈ రాకెట్‌ను నియంత్రిస్తున్న త్రివేండ్రంలోని ఇస్రో వారి భూకేంద్రం మొట్టమొదట ఈ వైఫల్యం గుర్తించింది. అప్పటిదాకా అంతా బాగానే ఉంది. మొదట ఆరు స్ట్రాపాన్లు, మొదటి ఘన ఇంధన దశ, రెండవ ద్రవ ఇంధన దశ నిర్ణీత కాలంలో ముగిసింది. మూడవ ఘన ఇంధన దశ వైఫల్యం కొంపముంచింది. ఈ దశను శ్రీహరికోటలోనే రూపొందించారు. 3.6 మీటర్ల పొడవు, రెండు మీటర్ల వ్యాసం, హెచ్‌టిబిడి అనే ఘన ఇంధనాన్ని ఇందులో నింపారు. 7.65 టన్నుల ఘన ఇంధనంతో ఈ మూడో దశ నిర్మాణమైంది.

**ఉత్కంఠ భరిత క్షణాలు..**

త్రివేండ్రం నుంచి వైఫల్యం నీడలు తొలిసారి బయటపడిన తర్వాత రాకెట్ ప్రయోగ దృశ్యాలను దూరదర్శన్ లైవ్ నిలిపివేశారు. అప్పుడే రాకెట్ గతి తప్పినట్లు శ్రీహరికోటలోని మీడియా సెంటర్‌లో పెద్ద తెరలపై వీక్షించి పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. స్క్రీన్ మీద రాకెట్ దారి మళ్లినట్లు ఒక దృశ్యం కనిపించింది కూడా. మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ప్రయోగాన్ని వీక్షించిన ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్‌తో పాటు ఇతర శాస్త్రవేత్తలు, 18 మంది కేంద్ర పార్లమెంటరీ కమిటీబృందం సభ్యులు, మాజీ ఛైర్మన్ ఎఎస్ కిరణ్‌కుమార్ తదితరులు రాకెట్ ప్రయోగం ఏమయిందన్న సందేహాలతో ఉన్నారు. ఆ తర్వాత కొద్ది క్షణాలకు దూరదర్శన్ వారు మళ్లీ లైవ్ ప్రసారం చేశారు. అయితే ఈ సారి రాకెట్ ప్రయోగ దృశ్యాలు కాకుండా ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ మిషన్ కంట్రోల్ సెంటర్‌నుంచి ప్రసంగిస్తున్నారు. ఈ ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలో ప్రవేశ పెట్టలేకపోతున్నాం. కారణాలను విశ్లేషించి మళ్లీ చెప్తాం అంటూ దూరద ర్శన్‌లో క్లుప్తంగా మాట్లాడి వెళ్లిపోయారు. ఆతర్వాత ఛైర్మన్ నారాయణన్‌తో పాటు షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ మీడియాసెంటర్‌కు హడావుడిగావచ్చి పిఎస్ రాకెట్ ప్రయోగం విజయవంతం కాలేదనిచెప్పి క్షణాల్లోనే వెనుతిరిగారు.

## మిస్ వరల్డ్ పోటీదారులను అలరించిన సెక్రటేరియట్ డ్రోన్‌షో



### ప్రభుత్వ ప్రాధాన్యతలు, పథకాల పరిచయంతో ఆకాశంలో అద్భుతం

### 'తెలంగాణ జరూర్ ఆనా' నినాదం వినిపించిన మిస్‌వరల్డ్ ప్రతినిధులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మే 18:** రాష్ట్ర పాలనా కేంద్రం సెక్రటేరియట్‌ను మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందర్శించారు. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ వినిపిస్తుండగా సచివాలయం ఆవరణలోని తెలంగాణ తల్లి విగ్రహానికి మిస్ వరల్డ్ ప్రతినిధులు పుష్పాంజలి ఘటించారు. కంటెస్టెంట్ల అందరి సమక్షంలో 10 దేశాలకు చెందిన ప్రతినిధులు తెలంగాణ తల్లికి పుష్పాంజలి అర్పించారు. మిస్ ఇండియా నందిని గుప్తా ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు. ఆ తర్వాత పాతబస్తీ గుల్జార్ హౌస్ ఫైర్ ఆక్సిడెంట్ మృతులకు సచివాలయంలో మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు, మంత్రులు, అధికారులు కొద్ది నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. తెలంగాణ తల్లి విగ్రహంతో మిస్ వరల్డ్ మగువలు సెల్ఫీలు తీసుకున్నారు. టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు సాదర స్వాగతం పలికారు.

ప్రజల అభీష్టం మేరకు తమ పాలన సాగుతోందని, పాలనా కేంద్రమైన సచివాలయం సాక్షిగా ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని తెలిపారు. తెలంగాణ పర్యాటక ప్రాంతాలను సుస్థిర అభివృద్ధిలో భాగంగా పర్యావరణ హితంగా డెవలప్ చేస్తున్నామని, వాటిలో చాలా ప్రాంతాలను సందర్శించిన మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా ప్రపంచవ్యాప్తంగా పనిచేయాలని మంత్రి కోరారు. సచివాలయం సాక్షిగా 'తెలంగాణ జరూర్ ఆనా' అంటూ మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు నినదించారు.ఆ తర్వాత ఆకాశంలో అద్భుతంగా కొనసాగిన డ్రోన్ షో ఆహుతులను విశేషంగా ఆకర్షించింది. ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతలు, పథకాల అమలు తీరును మిస్ వరల్డ్ కంటెస్టెంట్లకు పరిచయం చేసేలా డ్రోన్ షో కొనసాగింది. రైజింగ్ తెలంగాణ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటం ఆకాశంలో డ్రోన్లతో ఆవిష్కరించినప్పుడు ఆహుతులంతా చప్పట్లతో ఆహ్వానించారు. యువతకు స్కిల్ యూనివర్సిటీ, తెలంగాణ తల్లి,రాజీవ్ ఆరోగ్య శ్రీ, రేవంతన్న సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, సబ్సిడీ సిలిండర్, ఇందిరా మహిళాశక్తి తదితర పథకాలను తెలిపేలా ఆకాశంలో డ్రోన్ల ద్వారా ప్రదర్శించారు. సుమారు వేయి డ్రోన్లతో చేసిన విన్యాసాలు మిస్ వరల్డ్ కంటెస్టెంట్లతో పాటు హాజరైన ప్రముఖులను అలరించాయి. కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర ప్రజాప్రతినిధులు, చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## బంగాళాఖాతంలో 'శక్తి' తుఫాను

### పలు జిల్లాలను అప్రమత్తం చేసిన వాతావరణ శాఖ

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త :** దక్షిణ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తమిళనాడు నుంచి ఆంధ్రప్రదేశ్ వైపు కదులుతోంది. రానున్న రోజుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఇది తుపానుగా మారనుంది. దీనికి శక్తి తుపాను అని పేరు పెట్టారు. దీంతో వారం రోజుల పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. వీటి ప్రభావంతో వారం రోజుల పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా దక్షిణాది రాష్ట్రాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, పిడుగులు పడే అవకాశం కూడా ఉందని, వర్షం పడే సమయంలో చెట్ల కిందకు వెళ్లకూడదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. తెలంగాణలో అక్కడక్కడా భారీ వర్షం కురుస్తుందని ఐఎండీ తెలిపింది. సాయంత్రం 5గంటల తరువాత పశ్చిమ తెలంగాణలో వర్షం మొదలై రాతంత్రా కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని గద్వాల్, మహబూ నగర్, నిజామాబాద్, బెల్లంపల్లి, జగిత్యాల ఇలా కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అయితే, గాలి వేగాన్ని బట్టి వర్షం పడే ప్రాంతాలు మారే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు రాబోయే మూడు రోజుల్లో తెలంగాణలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాగల మూడు రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుండి ఐదు డిగ్రీలు తక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ వాతావరణం మేఘావృతం అయ్యి ఉంటుంది. సాయంత్రం రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.



## మహిళలు ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి సీతక్క

**ములుగు, మే 18, ప్రభాతవార్త:** రాష్ట్రంలో తొలిసారిగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ములుగు ఆధ్వర్యంలో డేటా ప్రో సంస్థ ట్రైనింగ్ పార్టనర్‌గా ములుగు జిల్లా జగ్గన్నపేటలోని మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం జిల్లాలోని జగ్గన్నపేటలో ఈ శిక్షణ ప్రాంరభోత్సవ కార్యక్రమాన్ని జిల్లా సంక్షేమ అధికారిణి కూచన శిరీష అధ్యక్షతన నిర్వహించగా మంత్రి సీతక్క శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళలను స్వయం ఉపాధి వైపు నడిపించేలా తొలిసారి ములుగు జిల్లాలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆర్థిక సౌజన్యంతో (నిధులతో), డేటా ప్రో సంస్థ ట్రైనింగ్ పార్టనర్‌గా రూపొందించిన మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా 175 మంది మహిళలకు 30 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ సమాజంలో ఒకప్పుడు మహిళలపై ఉన్న వివక్ష నేడు లేదని, అందరూ సమానంగా ఉపాధి అవకాశాల కోసం ప్రయత్నిస్తూ కుటుంబ నిర్వహణలో పురుషులతో సమానంగా స్త్రీలు కూడా భాగమవుతున్నారని అన్నారు.

## పాతబస్తీలో అగ్నిప్రమాద మరణాలపై కెసిఆర్ దిగ్భ్రాంతి.. సంతాపం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 18:** పాతబస్తీ చార్మినార్ సమీపంలోని గుల్జార్ హౌస్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో 17 మంది అభాగ్యులు మృత్యువాత పడడం పట్ల బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తీవ్ర సంతాపం ప్రకటించారు. అగ్నిప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించి కాపాడాలని, మరణించిన వారి కుటుంబాలకు తగు ఆర్థికసాయం చేసి అండగా నిల వాలని ప్రభుత్వానికి కేసీఆర్ సూచించారు. మరణించిన వారి ఆత్మ లకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబాలకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీలోని గుల్జార్ హౌస్ వద్ద జరిగిన అగ్నిప్రమాద ఘటన వివరాలు తెలిసి అత్యంత షాక్‌కు, బాధకు గురైనట్లు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ పేర్కొన్నారు.. ఈ విషాద ఘటన చాలా హృదయవిదారకంగా ఉందని,ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకొని క్షతగాత్రులకు మెరుగైన ఉచిత చికిత్స అందిం చేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్థానిక బిఆర్ఎస్ పార్టీ నేతలకు ప్రమాదస్థలం వద్ద సహాయకార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.

## సీనియర్ ఫొటోజర్నలిస్టు శివకుమార్ మరణంపై సిఎం సంతాపం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 18:** సీనియర్ ఫొటో జర్నలిస్టు పి.వి.శివకుమార్(66) అకాల మరణంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. శివకుమార్ ది హిందూ పత్రికలో సీనియర్ స్పెషల్ న్యూస్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేసి రిటైరయ్యారు. హైదరాబాద్‌కు చెందిన శివ కుమార్ ఫొటో జర్నలిస్టుగా తన కెరీర్‌లో ఉత్తమ అవార్డులు అందు కోవటంతోపాటు పత్రికా రంగానికి విశేష సేవలందించారని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. శివకుమార్ కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. సీనియర్ ఫొటో జర్నలిస్టు శివకుమార్ అకాల మరణంపై రెవెన్యూ, హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. శివకుమార్ కుటుంబానికి సానుభూతి తెలియజేశారు.

# 'థగ్ లైఫ్ యాక్షన్‌ప్యాక్డ్ ట్రైలర్ రిలీజ్



**ఇండియన్ సినిమా లెజెండరీస్** కమల్ హాసన్, మణిరత్నం పైలీ యాంటిసిపేటెడ్ గ్యాంగ్‌స్టర్ డ్రామా థగ్ లైఫ్ జూన్ 5న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ట్రైలర్ ఆరంభం నుంచే నమ్మకద్రోహం, ఈగో కూడిన వరల్డ్‌లోకి ఆడియన్స్‌ని తీసుకెళుతుంది. కమల్‌హాసన్ పవర్ ఫుల్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో అదరగొట్టారు. శింబు, కమల్ బాండింగ్ కథలో వెరీ క్రూషియల్. కమల్ హాసన్ ఫెరోషియస్ పాత్రలో కనిపించగా, సింబు పాత్ర యంగ్ ఎనర్జీ వుంది. ఇది మామూలు రివెంజ్ స్టోరీ కాదు ఒక సిద్ధాంత పోరాటం. మణిరత్నం ఈ భావోద్వేగ కథని అద్భుతంగా తీర్చిదిద్దారు. ప్రతి ఫ్రేమ్ న్యూయాన్స్‌తో ఎక్సయిట్మెంట్ పెంచింది. రవికే చంద్రన్ సినిమాటోగ్రఫీ అద్భుతంగా వుంది. ఏఆర్ రెహమాన్ బీజీఎం ఒక ఎపిక్ స్టోరీని వండర్ ఫుల్‌గా ప్రజెంట్ చేసింది. ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ రేజర్‌షార్ప్‌గా ప్రతి మూమెంట్ వాల్యుబుల్‌గా వుంది. రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం నిర్మాణ విలువలు ఉన్నత స్థాయిలో వున్నాయి. ట్రైలర్ సినిమాపై అంచనాలని భారీగా పెంచింది. థగ్ లైఫ్ థియేటర్లలో గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించనుందని ట్రైలర్ ప్రామిస్ చేస్తోంది. హీరో నితిన్ ఫాదర్ ఎన్ సుధాకర్ రెడ్డి శ్రేష్ మూవీస్ ద్వారా ఈ సినిమా తెలుగులో విడుదల కానుంది. గతంలో విక్రమ్, అమరన్ లాంటి బ్లాక్‌బస్టర్లు అందించిన ఈ సంస్థ ఇప్పుడు థగ్ లైఫ్ భారీగా విడుదల చేయబోతోంది.

# నవీన్ చంద్ర 'కరాళ్లి ఘనంగా ప్రారంభం

**మందలపు ప్రవల్లిక** సమర్పణలో విక్రాంత్ ఫిల్మ్ క్రియేషన్స్ బ్యానర్ మీద నవీన్ చంద్ర, రాశీ సింగ్, కాజల్ చౌదరి హీరో హీరోయిన్లుగా మందలపు శివకృష్ణ నిర్మిస్తున్న తొలి చిత్రం 'కరాళ్లి. ఈ మూవీకి రాకేష్ పొట్టా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత సాహు గారపాటి, రాజా రవీంద్ర వంటివారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. చిత్ర యూనిట్‌కు సాహు గారపాటి స్క్రిప్ట్‌ను అందజేశారు. ముహూర్తపు సన్నివేశానికి సాహు గారపాటి క్లాప్ కొట్టగా, శ్రీహర్షిణి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అధినేత గోరంట్ల రవికుమార్, యాస్పైర్ స్పేసెస్ మేనేజింగ్ డైరెక్టర్ తుమాటి నరసింహా రెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెర్సటైల్ స్టార్ నవీన్ చంద్ర మాట్లాడుతూ, కొత్త వారు కొత్తపాయింట్‌తో వచ్చినప్పుడు సినిమాలు నిర్మించేందుకు శివలాంటి ధైర్యం ఉన్న వాళ్లు ముందుకు రావాలి.'కరాళ్లి అనే టైటిల్ ఎంత కొత్తగా, డిఫరెంట్‌గా ఉందో సినిమా కూడా అంతే కొత్తగా ఉంటుంది. ఇంత వరకు నేను చేయని ఓ డిఫరెంట్ యాక్షన్ డ్రామా. కాజల్ చౌదరి నటించిన అనగనగా ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. మా సినిమాకు మంచి టీం దొరికింది. ఇంత వరకు నన్ను ఆడియెన్స్, మీడియా ఎంకరేజ్ చేస్తూనే వచ్చింది. ఈ మూవీని ఆడియెన్స్ అంతా ఎంజాయ్ చేసేలా రూపొందిస్తున్నామని అన్నారు.

చిత్ర నిర్మాత మందలపు శివకృష్ణ మాట్లాడుతూ, నేను కేంద్ర ప్రభుత్వ మాజీ ఉద్యోగిని. అక్కడ వీఆర్ఎస్ తీసుకుని సినిమాల మీద ప్యాషన్‌తో ఇంత వరకు కూడబెట్టుకున్న డబ్బులతో ఇక్కడకు వచ్చాను. నాకున్న ప్యాషన్‌తోనే ప్రొడక్షన్ స్టార్ట్ చేశాను. ఆ టైంలోనే రాకేష్ పొట్ట కథను చెప్పారు. నాకు ఆ కథ చాలా నచ్చింది. క్వాలిటీలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మిస్తాం. కొత్త యాక్షన్ మూవీని అందరి ముందుకు తీసుకు వస్తాం. నాకు ఇది ఫస్ట్ మూవీ అయినా సరే నా మీద నమ్మకంతో ముందుకు వచ్చి నవీన్ చంద్రకి థాంక్స్ అని అన్నారు.



చిత్ర దర్శకుడు రాకేష్‌పొట్టా మాట్లాడుతూ,నవీన్ సర్‌తో పని చేయడం ఆనందంగా ఉంది. నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన ఆయనకు థాంక్స్. నేను చెప్పిన స్క్రిప్ట్ నచ్చడంతో నిర్మించేందుకు వచ్చిన శివకి థాంక్స్. ఈ సినిమా పెద్ద హిట్ అవుతుందని మేం చాలా నమ్మకంగా ఉన్నాం అని అన్నారు. హీరోయిన్ కాజల్ చౌదరి మాట్లాడుతూ,ఈ ప్రాజెక్ట్ అద్భుతంగా ఉండబోతోంది. నాకు స్క్రిప్ట్ చాలా నాకు నచ్చింది. నవీన్ చంద్ర సినిమాలు, ఆయన ఎంచుకునే కథలు ఎలా ఉంటాయో చెప్పాల్సిన పని లేదు. మళ్లీ ఈ మూవీతో మంచి కథతో మీ అందరి ముందుకు రాబోతోన్నాం. నాకు అవకాశం ఇచ్చిన శివకి, రాకేష్‌కి థాంక్స్ అని అన్నారు. కెమెరామెన్ అపూర్వ అనిల్ శాలిగ్రామ్ మాట్లాడుతూ,నవీన్ సర్‌తో రెండో సారి పని చేస్తున్నాను. ఇంతకు ముందు అమ్ము, సినిమా బండికి పని చేశాను. మళ్లీ నవీన్ చంద్రతో పని చేయడం ఆనందంగ ఉంది అన్నారు.

## మధ్య ప్రదేశ్ షెడ్యూల్ పూర్తి చేసుకున్న

# 'అమరావతికి ఆహ్వానం'



**ప్రజెంట్ హారర్ సినిమాల** ట్రెండ్ నడుస్తోంది మంచి కథాబలంతో తెరకెక్కిన హారర్, థ్రిల్లర్ చిత్రాలకు థియేటర్స్ లోనే కాకుండా ఓటీటీల్లోనూ మంచి డిమాండ్ ఉంది. ఆ కోవలోనే ఉత్కంఠభరితమైన కథ, కథనంతో తెరకెక్కుతోన్న హారర్ థ్రిల్లర్ 'అమరావతికి ఆహ్వానం'. శివ కంఠంనేని, ఎస్తర్, ధన్య బాలకృష్ణ, సుప్రిత, హారీష్ ప్రధాన పాత్రలతో తెరకెక్కుతోన్న ఈ మూవీలో సీనియర్ నటులు అశోక్ కుమార్, భద్రమ్, జెమిని సురేష్, నాగేంద్ర ప్రసాద్ కీలకపాత్రలు పోషించారు. టాలెంటెడ్ డైరెక్టర్ జీవికె ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బేనర్‌పై కేఎస్ శంకర్‌రావు, ఆర్ వెంకటేశ్వర రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో షూటింగ్ పూర్తి చేసుకున్న చిత్ర యూనిట్ తాజాగా మధ్యప్రదేశ్ షెడ్యూల్ కంప్లీట్ చేశారు. మధ్య ప్రదేశ్ చింద్వార జిల్లాలోని తామ్య హిల్స్, పాతాళ్ కోట్, బిజోరి, చిమ్‌తీపూర్ వంటి పలు అందమైన లొకేషన్స్‌లో దాదాపు 20 రోజుల పాటు చిత్రీకరణ జరిపారు. ఈ సందర్భంగా హీరో శివ కంఠంనేని మాట్లాడుతూ, అమరావతికి ఆహ్వానం టైటిల్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ప్రజెంట్ ట్రెండ్‌ని దృష్టిలో పెట్టుకుని దర్శకుడు జీవీకే ఒక మంచి హారర్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. టెక్నికల్‌గా కూడా ఈ సినిమా చాలా బాగుంటుంది.

# జూన్‌లో రిలీజ్‌కు 'ఫణ్ణి సిద్ధం

**టాలెంటెడ్ డైరెక్టర్** డాక్టర్ వీఎన్ ఆదిత్య రూపొందిస్తున్న గ్లోబల్ మూవీ 'ఫణ్ణి. ఈ థ్రిల్లర్ సినిమాను ఓఎంజీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై, ఏయు ఐ స్టూడియో సమర్పణలో డాక్టర్ మీనాక్షి అనిపిండి ఇంగ్లీషు, తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఒక నల్ల పాము (బ్లాక్ ఫైన్) ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ విజువల్ వండర్ మూవీలో కేథరిన్ ట్రెసా, మహేష్ శ్రీరామ్, నేహాకృష్ణ, తనికెళ్ల భరణి, కాశీ విశ్వనాథ్ ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ రోజు నిర్మాత, మ్యూజిక్ డైరెక్టర్ డాక్టర్‌మీనాక్షి అనిపిండి పుట్టినరోజు సందర్భంగా ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన మూవీ టీమ్...సినిమా రిలీజ్ అప్డేట్ ఇచ్చారు. జూన్ నెలాఖరులో ఫణి చిత్రాన్ని గ్లోబల్ మూవీగా రిలీజ్ చేయబోతున్నట్లు వెల్లడించారు. సంగీత దర్శకురాలైన డాక్టర్ మీనాక్షి అనిపిండి అమెరికాలో మీనాక్షి సుస్వర అకాడెమీ ద్వారా లైట్ మ్యూజిక్, కర్ణాటిక్ మ్యూజిక్, లలిత సంగీతం నేర్పిస్తూ నేటి తరానికి మన సంగీత వారసత్వాన్ని అందిస్తున్నారు. మరోవైపు 'ఫణ్ణి చిచిత్రంతో ఒక విభిన్న ప్రయత్నం చేస్తూ నిర్మాతగా తన అభిరుచి చాటుకుంటున్నారు డాక్టర్ మీనాక్షి అనిపిండి. ఈ చిత్రానికి ఆమె నిర్మాణ బాధ్యతలతో పాటు సంగీతాన్ని అందించారు. డాక్టర్ మీనాక్షి అనిపిండి 'ఫణ్ణి చిత్రానికి అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణ కాబోతోంది. ప్రేక్షకులకు ఒక సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేందుకు 'ఫణ్ణి చి మూవీ సిద్ధమవుతోంది.



నటీనటులు : కేథరీన్ ట్రెసా, మహేశ్ శ్రీరామ్, నేహా కృష్ణ, తనికెళ్ల భరణి, కాశీ విశ్వనాథ్, రంజిత, యోగిత కొటద్ది, ప్రశాంతి హారతి, సాన్య, ఆకాష్ ఇంటి, ఫీబూఫీ, అనిల్ శంకరమంచి, కిరణ్ గుడిపల్లి, బాల కర్రి, దయాకర్, శాంద్రా, కెల్లీ, కార్లా, తదితరులు. టెక్నికల్ టీమ్: బ్యానర్, ఓ.ఎం.జీ ప్రొడక్షన్స్, సమర్పణ ఏయు ఐ స్టూడియో పద్మ నాభరెడ్డి, కాస్ట్యూమ్ డిజైనింగ్, మీరా జగన్నాథ రాజు, ప్రొడక్షన్ డిజైనింగ్ ప్రత్యూష మికినేని పీఆర్ఓ జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్),పబ్లిసిటీ ఇంచార్జ్ డిజిటల్ మమతా రెడ్డి కాసం, వర్షా జైన్, ,మ్యూజిక్ డైరెక్టర్, నిర్మాత : డాక్టర్ మీనాక్షి అనిపిండి, రచన: పద్మావతి మల్లాది,ఎడిటర్ : కెమెరామెన్ : బుజ్జి.కె., సాయికిరణ్ : అయినంపూడి సీజీ వి.ఎఫ్.ఎక్స్, హెన్రీలిపటోవ్, శ్రీకాంత్ శాఖమూరి, స్టంట్స్: జాన్ కాన్, కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం: డాక్టర్ వీఎన్ ఆదిత్య.

## జూన్ 6న విడుదల కానున్న

# 'శ్రీశ్రీశ్రీ రాజావార్లు



**నార్నే నితిన్,** చిత్ర పరిశ్రమలోకి ఎన్టీఆర్ బావమరిదిగా ఎంట్రీ ఇచ్చి వరుస విజయాలు అందుకుంటున్న యంగ్ అండ్ ఎనర్జిటిక్ హీరో. తనకంటూ ఓ పందాన్ని ఏర్పరచుకుని ప్రేక్షకుల మదిలో నటన పరంగా మంచి మార్కులు సంపాదించుకుంటున్నారు నార్నే నితిన్ .అలాగే జాతీయ అవార్డు విన్నర్ , 'శతమానం భవతి దర్శకుడు సతీష్ వేగేశ్న దర్శకత్వంలో నార్నె నితిన్' 'శ్రీ శ్రీ శ్రీ రాజావార్లు జూన్ 6న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన సరసన సంపద హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీవేధాక్షర మూవీస్ పతాకంపై చింతపల్లి రామారావు నిర్మించారు. అన్నికమర్షియల్ ఎలిమెంట్స్‌తో యూత్ ఫుల్ యాక్షన్ ఎంటర్ టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రం అత్యధిక థియేటర్లలో 6న ప్రేక్షకులకు ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ, ఒక మంచి కమర్షియల్ ఎలిమెంట్స్‌తో బిగ్ హిట్ మూవీని నిర్మించాలని నార్నె నితిన్, వేగేశ్న సతీష్ కాంబినేషన్లో ఈ చిత్రాన్ని రూపొందించాం. మా చిత్రహీరో నార్నె నితిన్ ఇటీవల మంచి యూత్ ఫుల్ ఎంటర్టైనర్ మూవీస్‌తో వరుస విజయాలు అందుకుంటున్నారు. ఇక 'శ్రీశ్రీశ్రీ రాజావార్లు విషయానికొస్తే మంచి గ్రామీణ నేపథ్యంలో సాగే వెరైటీ ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఇది.పూర్తి కమర్షియల్ ఫార్మాట్‌లో భారీ తారాగణంతో తెరకెక్కించారు దర్శకుడు సతీష్ వేగేశ్న. అలాగే ఎన్టీఆర్ ఎంతో మెచ్చి, ఈ కథను ఎంపిక చేశారు.

# 'ఎన్టీఆర్,నీల్ణ మూవీ నుంచి నో అప్డేట్

**ప్రపంచవ్యాప్తంగా** భారీ క్రేజ్‌ను దక్కించుకున్న మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్.. కెజియఫ్ సిరీస్, సలార్ వంటి సంచలనాత్మక బ్లాక్‌బస్టర్‌లను అందించిన మావెరిక్ మేకర్ ప్రశాంత్ నీల్‌తో కలిసి సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కి వర్కింగ్ టైటిల్‌గా 'ఎన్టిఆర్ నీల్' అని పేరు పెట్టారు. ఇప్పటికే ఈ మూవీకి సంబంధించిన ఫస్ట్ షెడ్యూల్ పూర్తయింది. ఎన్టీఆర్ పుట్టినరోజు (మే 20) సందర్భంగా అప్డేట్ ఉంటుందని అభిమానులు ఆశించారు. కానీ బర్త్ డే సందర్భంగా ఎన్టిఆర్.నీల్ నుంచి ఎటువంటి అప్డేట్ ఉండదని మేకర్లు క్లారిటీ ఇచ్చారు. ఎందుకంటే ఎన్టీఆర్ నటించిన 'వార్ 2' నుంచి అప్డేట్ రానుండటంతో మేకర్లు ఎన్టిఆర్.నీల్ అప్డేట్‌ను పోస్ట్ పోన్ చేశారు. మళ్లీ సరైన సమయాన్ని చూసి మాస్ మిస్సైల్‌ను దించుతామని మేకర్లు హామీ ఇచ్చారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్‌ప్యాక్డ్ మూవీని జూన్ 25, 2026న రిలీజ్ చేయనున్నారు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం, ఇతర భాషలలో విడుదల కానున్న ఈ చిత్రం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. భారీ యాక్షన్ సన్నివేశాలతో, అత్యంత భారీ ఎత్తున ఈ చిత్రాన్ని ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్నారు. బ్లాక్‌బస్టర్ హిట్‌లకు ప్రసిద్ధి చెందిన ప్రశాంత్ నీల్ ఈ ప్రాజెక్ట్‌కు తన ప్రత్యేకమైన మాస్ విజన్‌ను తీసుకువస్తాడని, ఎన్టీఆర్‌లోని మరో కోణాన్ని తెరపై తీసుకువస్తాడని అభిమానులు భావిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌లపై కళ్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని గుల్షన్ కుమార్, భూషణ్‌కుమార్, టి. సిరీస్ ఫిల్మ్ సమర్పిస్తున్నారు. రవిబస్రూర్ సంగీతం అందిస్తున్నారు.



# 'షష్టిపూర్తి నుంచి మరోపాట విడుదల

**ఇప్పటి వరకూ మూడు** రొమాంటిక్ పాటలు విడుదల చేసిన 'షష్టిపూర్ణి సినిమా బృందం, ఇప్పుడు టైటిల్ జస్టిఫికేషన్ చేస్తూ 'షష్టిపూర్ణి నేపథ్యంలో పాటను విడుదల చేసింది. ఈ పాటను ప్రముఖ దర్శకుడు నాగ్ అశ్విన్ విడుదల చేసి, యూనిట్ కి బెస్ట్ విషెస్ తెలిపారు. డా. రాజేంద్ర ప్రసాద్, అర్చన కాంబినేషన్‌లో రూపేష్,ఆకాంక్షసింగ్ హీరో హీరోయిన్లుగా పవన్ ప్రభ దర్శకత్వంలో మా ఆయి (ఎమ్ ఎఎఎ ఎల్ఇ) ప్రొడక్షన్స్ పతాకంపై రూపేష్ నిర్మించిన 'షష్టిపూర్ణి చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. ఈ రోజు



విడుదల చేసిన షష్టిపూర్తి నేపథ్యంలో వచ్చే గీతాన్ని చైతన్య ప్రసాద్ రచించగా, కార్తీక్, విభావరి ఆప్టే జోషి పాడారు. స్వర్ణ మాస్టర్ నృత్య దర్శకత్వం చేశారు. ఈ పాట గురించి దర్శకుడు పవన్ ప్రభ మాట్లాడుతూ,'వేయి వేణువుల నాదం మోగే హాయి హాయి హృదయా! ప్రేమ మంత్రముల గానం' అంటూ సాగే ఈ గీతాన్ని చైతన్య ప్రసాద్ అద్భుతంగా రాశారు. ఇకపై ఎవరు 'షష్టిపూర్ణి జరుపుకున్న ఈ పాటను ప్లే చేసి తీరాల్సిందే. ఇళయరాజా స్వరాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సింది ఏముంటుంది? ఈ పాట రికార్డింగ్‌ని ప్రత్యక్షంగా వీక్షించి పులకించి పోయాను. సీనియర్ కళా దర్శకులు తోట తరణి ఓ మండువ లోగిలిని ఈ పాట కోసం అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. నిజంగా ఓ పెళ్లి వేడుకలో ఉన్నపుడు మనకు ఎలాంటి ఫీలింగ్ కలుగుతుందో, ఈ పాట చూస్తున్నపుడు అలాంటి ఫీలింగ్ కలుగుతుంది. రాజేంద్ర ప్రసాద్, అర్చన, మా హీరో హీరోయిన్లు రూపేష్, ఆకాంక్ష సింగ్‌లు ఈ పాటలో నిజంగా జీవించారు. చాలాకాలం గుర్తుండి పోయే పాట ఇద్ణి అని తెలిపారు.

# 'కేసరి ఛాప్టర్ 2ణ తెలుగు ట్రైలర్ రిలీజ్

**బాలీవుడ్ స్టార్** అక్షయ్ కుమార్ నటించిన హిస్టారికల్ కోర్ట్ డ్రామా 'కేసరి ఛాప్టర్ 2: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ జలియన్‌వాలా బాగ్' థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడుతూ, ఇప్పటికే సుమారు రూ.100 కోట్ల వసూళ్లు సాధించింది. కరణ్ సింగ్ త్యాగీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ప్రస్తుతం నాలుగో వారంలోను హౌస్ ఫుల్ గా రన్ అవుతుంది. అక్షయ్‌కుమార్, ఆర్. మాధవన్, అనన్య పాండే నటించిన ప్రధాన పాత్రలు, ఎమోషన్స్ తో నిండిన కోర్ట్ సన్నివేశాల్లో వారి నటనకు విశేష ప్రశంసలు లభించాయి. ఇప్పుడు ఈ చిత్రం తెలుగులోకి డబ్ చేయబడి మే 23న విడుదల కాబోతుంది. ఇప్పటికే హిందీ వర్షన్‌కు విమర్శకుల ప్రశంసలతో పాటు భారీ వసూళ్లు రావడంతో, తెలుగు ప్రేక్షకుల్లో ఈ సినిమాపై భారీ ఆసక్తి నెలకొంది.

తాజాగా తెలుగు ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. జలియాన్‌వాలా బాగ్ హత్యాకాండ తరువాత జరిగిన సంఘటనలు, బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి, అక్షయ కుమార్ పాత్ర చేసిన న్యాయపోరాటాన్ని అద్భుతంగా ప్రజెంట్ చేసిన ఈ ట్రైలర్ అదిరిపోయింది. అక్షయ్‌కుమార్ తన పాత్రలో ఒదిగిపోయారు. తన కెరీర్‌లోని అత్యుత్తమ నటన ప్రదర్శించారు. ఆర్. మాధవన్, అనన్య పాండే పాత్రలు కూడా ఆకట్టుకున్నాయి. దర్శకుడు సమగ్ర పరిశోధనతో పాటు భావోద్వేగంతో నిండిన కోర్ట్ సన్నివేశాలకు రియలిస్టిక్‌గా, ఆకట్టుకునేలా చూపించాడు. డబ్బింగ్ క్యాలిటీ అద్భుతంగా వుంది. తెలుగు ట్రైలర్‌కు అన్ని వైపుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది.ఈ చిత్రాన్ని ధర్మా ప్రొడక్షన్స్, లియో మీడియా కలెక్టివ్, కేప్ ఆఫ్ గుడ్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మించారు. సురేష్ ప్రొడక్షన్స్ లాంటి ప్రముఖ సంస్థ ఈ సినిమాను విడుదల చేయడంవల్ల, తెలుగు రాష్ట్రాల్లో దీన్ని భారీ స్థాయిలో విడుదల చేయను న్నారు. 'కేసరి ఛాప్టర్ 2 తో ప్రేక్షకులకు పవర్ ఫుల్ సినిమాటిక్ ఎక్స్పీరియన్స్ అందించబోతుంది.





# వేడికి సహజ మంత్రం !

పెరుగుతున్న వేడి మనల్ని ఉక్కిరిబిక్కిరి చేసేస్తోంది కదూ ! దీనికి ఉక్కబోతకి చర్మం జిడ్డెక్కడం, దద్దుర్లు, దురద సహా ఇంకెన్ని సమస్యలో! పోగొట్టుకోవడానికి మార్కెట్‌లో బోలెడు ఉత్పత్తులు. కానీ ఖర్చేమో ఎక్కువ.



దాన్ని తగ్గిస్తూ సహజ మార్గాలను ప్రయత్నిద్దామా? నిపుణులా వాటికే ఓటేయమంటున్నారు. అవేంటంటే..

◆ పనిమీద అలా బయటికి వెళ్లొచ్చామంటే చాలు. ముఖం ఎర్రగా కమిలిపోతుంది. కొందరిలో కాసేపటికి తగ్గుతుంది. కానీ చాలామందిలో దద్దుర్లు, చర్మమంతా నల్లగా మారడం లాంటివి కనిపిస్తాయి. తప్పించుకోవాలంటే ఇంటికి రాగానే ముఖాన్ని శుభ్రం చేసుకొన్నాక కలబంద గుజ్జును రాసి చూడండి. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఈ సమస్యలన్నింటికీ చెక్ పెట్టేస్తాయి. గ్రీన్ టీని చల్లార్చి దూదితో రాసి, ఆరాక కడిగినా మంచిదే.

◆ ఇంట్లో ఉన్నా ఉక్కబోత తక్కువా? అదేమో చెమటకాయలు, దురదలకు దారితీస్తుంది. సాధారణంగా పౌడర్ చల్లుతుంటాం కదా? బదులుగా ఓట్‌మీల్‌ని ప్రయత్నించండి. దీన్ని మెత్తగా పౌడర్‌లా చేసుకుని, బకెట్ గోరువెచ్చని నీటిలో రెండు పెద్ద చెంచాలు కలపాలి. పావుగంట అలా వదిలేసి, ఆ నీటితో స్నానం చేయండి. ఇలా తరచూ చేస్తే సరి. చర్మానికి పోషణ అందుతుంది. సమస్యా అదుపులోకి వస్తుంది.

◆ చెమటకి జిడ్డుగా అనిపిస్తుందని మాయిశ్చరైజర్‌ని రాయడానికి సందేహించేవారే ఎక్కువ. దీంతో చర్మం నిర్జీవంగా, కళావిహీనంగా తయారవుతుంది. రాత్రుల్లు స్నానం చేశాకగానీ, ఉదయం స్నానానికి ముందుగానీ కొబ్బరి నూనెను ఒళ్లంతా పట్టించండి. నలుగుకు ముందులా కాకుండా రెండు మూడు చుక్కలు వేసుకుంటూ మృదువుగా రాసుకుంటూ వెళితే చాలు. దీనిలో సమృద్ధిగా ఉండే ఫ్యాటీయాసిడ్లు కావాల్సిన తేమను అందిస్తూనే చర్మం అందంగా, ఆరోగ్యంగా ఉండేలానూ చూస్తాయి. అదీ జిడ్డే అనిపిస్తే పుచ్చకాయ రసాన్ని రాసుకొని, ఆరాక కడిగినా చాలు. చిన్నవే కానీ.. చర్మసంరక్షణలో చూపే ప్రయోజనమెంతో. ఈ చిట్కాలతో వేసవి నుంచి చర్మాన్ని కాపాడుకుందా మరి.

# ఆమె ఎంతో స్ఫూర్తిదాయకం ..



పోలీసు యూనిఫాం వేయాలనేది ఆమె కల. దీనికోసం మైళ్లదూరం నడిచి వెళ్లి మరీ చదువుకుంది. లక్ష్యాన్ని చేరి జీవితపు పరీక్షలో నెగ్గింది. అంతలో క్యాన్సర్ మహమ్మారి ఆమెకు మరో పరీక్ష పెట్టింది. రెండేళ్లపాటు ఈ వ్యాధితో పోరాడి గెలిచింది. విధులు నిర్వహిస్తూనే గ్రామీణ బాలికలకు స్వీయరక్షణలో ఉచిత శిక్షణ ఇస్తున్న సునీతాచౌదరి గూర్చి తెలుసుకుందాం.. మాది రాజస్థాన్‌లో జోధ్‌పూర్ సమీపంలోని గ్రామం. ఇక్కడ బాల్యవివాహాల సంప్రదాయం ఉంది. దీంతో మూడేళ్లప్పుడే నాకు పెళ్లైంది. అమ్మానాన్నది వ్యవసాయం. చిన్నప్పటి నుంచి పోలీసు అవ్వాలనేది నా కల. దీనికోసం చదువుకుంటానంటే 'పెళ్లైంది, చదువేంటి..' అని అందరూ అంటే, నాన్న మాత్రం నాకు మద్దతు ఇచ్చి, స్కూల్లో చేర్చుకున్నారు. రోజూ ఆరు కిలోమీటర్ల దూరం నడిచి మరీ బడికెళ్లేదాన్ని. మా ఇంట్లో కరెంట్ లేదు. దీంతో వీధి లైటు వెలుగులోనే చదువుకునేదాన్ని. సెలవు రోజుల్లో అమ్మానాన్నలకు పొలంలో సాయం చేసేదాన్ని. పదో తరగతి పూర్తిచేయడంతో ఊర్లోవాళ్లంతా ఆశ్చర్యపోయారు. ఎందుకంటే మా గ్రామంలో పదోతరగతి చదివిన మొదటి అమ్మాయిని నేనే. ఆ తర్వాత మా అత్తింటివాళ్లు వచ్చి నన్ను తీసుకెళ్లారు. అక్కడికెళ్లిన తర్వాత నా పోలీసు కలను మా వారికి చెబితే ఆప్లై చేయమన్నారు. తన సహకారంతో దరఖాస్తు చేశా. సంబంధిత పరీక్షలకు హాజరైన పాసైనవారిలో నేను మాత్రమే అమ్మాయిని. తొమ్మిదినెలల శిక్షణ తర్వాత మా గ్రామం నుంచి మొదటి మహిళా కానిస్టేబుల్‌ని కూడా నేనే. నా లక్ష్యాన్ని సాధించానని అమ్మానాన్న గర్వపడ్డారు. అలా నా 19వ ఏట పోలీసు యూనిఫాం ధరించి విధుల్లో చేరా.



**మహమ్మారితో...**

ఉద్యోగంలో చేరిన ఏడాదిలోపే తీవ్రమైన కడుపునొప్పి రావడం మొదలైంది. భరించలేనంత బాధతో ఆసుపత్రికెళ్లి వైద్యపరీక్షలు చేయించుకున్నా. అండాశయ క్యాన్సర్ రెండో స్టేజీలో ఉన్నట్లు వైద్యులు చెప్పారు. మనసుకు నచ్చిన కెరియర్‌లో సంతోషంగా సాగుతున్న నా జీవితం ఒక్కసారిగా తలకిందులైంది. పేదరికంలో ఉంటూనే అనుకున్న లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేశాను, ఈ మహమ్మారితో పోరాడటానికి ధైర్యంగా సిద్ధపడ్డాను. మా అత్తగారింట్లో వైద్యం చేయించలేమంటే నాన్న తనతో ఇంటికి తీసుకెళ్లారు. అప్పు చేసి మరీ వైద్యం చేశారు. 'ఆడపిల్ల కోసం ఎందుకలా అప్పు చేసి మరీ ఖర్చు పెడుతున్నావ'ని ఊర్లో అంతా విమర్శించినా, నాన్న పట్టించుకోలేదు. ఆడపిల్ల అయినా, మగపిల్లాడైనా ఒక్కటే అని చెప్పేవారు. కీమో థెరపీలకు నా జుట్టు అంతా రాలిపోయింది. చూసినవాళ్లంతా హేళన చేసేవారు. దీంతో గదికే పరిమితమై ఒంటరిగా ఉండేదాన్ని. బరువు 35 కిలోలకు తగ్గిపోయా. ధైర్యాన్ని వీడకుండా క్యాన్సర్‌తో పోరాడా. చివరకు నేనే గెలిచా. వ్యాధి నయమైంది. అయితే అమ్మనయ్యే అవకాశం లేదని తెలిసి తీవ్ర వేదనకు అవకాశం ఉంది. రెండేళ్లకు తిరిగి విధుల్లో చేరా. ఈ మహమ్మారితో మరణం వరకు వెళ్లి వెనక్కి వచ్చిన నాకు నావంతు సమాజానికి ఏదైనా సేవ చేయా లనే ఆలోచన మొదలైంది. ఇదే నన్ను గ్రామాలన్నీ పర్యటించేలా చేసింది. మైళ్ల దూరం నడిచివెళ్లే విద్యార్థులకు ఆత్మరక్షణ విద్య నేర్పించాలని. దాంతో రోజూ డ్యూటీ తర్వాత చుట్టుపక్కల స్కూళ్లకెళ్లి విద్యార్థులకు ఆత్మరక్షణ విద్య నేర్పుతున్నా. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పిస్తున్నా. ఇప్పటివరకు వందలమంది పిల్లలకు వీటిలో ఉచిత శిక్షణనిచ్చా. భవిష్యత్తులోనూ ఆడపిల్లల సంక్షేమానికి పాటుపడతానని చెబుతున్న ఈ 'పోలీసువాలీ దీదీ' కథ స్ఫూర్తిదాయకం కదూ!

# ఎడారి మొక్కలు ఎంతందమో!

**మొక్కలు పెంచడం ఓ కళ.. అందులోనూ హౌస్ ప్లాంట్ కలెక్షన్‌లో కాక్టీ సేకరణ ఓ సరదా వ్యాపకం. ఒక్కొక్కటీ ఒక్కో రకం. పరిమాణం, ఆకృతి, విరిసే సమయం.. వంటివన్నీ వేటికవే భిన్నంగా ఉంటాయి. వాటిల్లో కొన్ని ఇవి..**

**బన్నీ ఇయర్స్ :** చూడ్డానికి ఈ మొక్క ఆకులు కుందేలు చెవుల్లా ఉంటాయి కాబట్టి అ పేరు వచ్చింది. వీటినే ఏంజెల్ వింగ్ కాక్టస్ అని కూడా పిలుస్తారు. ఫ్లాట్‌గా ఉండే పాడ్స్‌పై చుక్కలతో కొత్తగా కనిపిస్తాయివి. ఈ మొక్కలకు కనీసం ఐదారు గంటలైనా నేరుగా ఎండ తగిలేలా చూసుకుంటే చాలు.. ఇంటిలోపల చక్కగా ఎదుగుతాయి. నీటి అవసరం తక్కువ. అరుదుగా పసుపు రంగు పూలు వస్తాయి.



**ఈస్టర్ కాక్టస్ :** వసంత రుతువు ప్రారంభంలో వికసిస్తుంది. ఆకులు ఏడాదంతా ఆకర్షణీయంగా కనిపిస్తాయి. దీనికి ప్రకాశవంతమైన వెలుతురు కావాలి. అలాగని నేరుగా ఎండ తగిలితే మాత్రం ఆకులు మాడిపోయనట్లు అవుతాయి. మట్టి బాగా పొడిబారినప్పుడు నీళ్లు పోస్తే చాలు.



**థ్యాంక్స్ గివింగ్ కాక్టస్ :** ఇది ఎక్కువ కాలం జీవించే ఎడారి మొక్క దీనికి ముళ్లు ఉండవు. సున్నితమైన ఈ మొక్కకు నక్షత్రాకారంలో పూలు ఉంటాయి. దీనికి 12 గంటల చొప్పున ప్రకాశవంతమైన కాంతీ చీకటీ సమానంగా అవసరం. అప్పుడే ఆరోగ్యంగా అందంగా ఎదుగుతుంది.



# నడక నేర్చుకుంటూనే ..

బుడిబుడి అడుగులేసేటప్పుడు పడుతూ లేచే బుజ్జాయిలను చూసిన ప్రతిసారీ భయపడుతుంటాం. తప్పటడుగులేస్తూనే.. పరుగులు పెట్టాలనే వారి ఆసక్తి చూస్తుంటే ముచ్చటేసినా.. గాయాలవకుండా కాపలా కాస్తుంటాం. బ్రేక్ లేకుండా వారి నడక సాగేలా వాకర్స్ సాయాన్నిస్తాం. అలా నడకతోపాటు ఆట, కొత్తపాఠాలను నేర్పే సరికొత్త డిజైన్ వాకర్లు వచ్చాయి. అవేంటో చూద్దాం.

**బొమ్మల బండి..** 10-12 నెలల మధ్య చిన్నారులు తమని తాము నిలబెట్టుకవోడానికి తగిన శక్తిని కూడబెట్టుకుంటారు. అడుగులేయడానికి ఏదైనా ఆసరా కోరుకుంటారు. ఆ సమయంలో వారు వినియోగించడం కోసం వాకర్ లేదా స్ట్రోలర్‌ను డిజైనర్లు ఇప్పుడు మరింత ప్రత్యేకంగా తీర్చి దిద్దుతున్నారు. ప్లాస్టిక్, చెక్క, స్టాండులకు చక్రాల ఏర్పాటుతో తేలిగ్గా కదులుతాయివి. అంతేనా, వీటిని నడక కోసం మాత్రమే కాకుండా బొమ్మలు పెట్టుకునే సౌకర్యాన్ని కల్పిస్తూ రూపొందిస్తున్నారు. దీనివల్ల మధ్య మధ్యలో కాసేపు కూర్చునీ వాటితో ఆడుకుంటారు. అలాంటి బొమ్మల బండ్లే ఇవన్నీ. భలేగున్నాయి కదూ..!









**ఆసక్తి కలిగిస్తూ..** పిల్లలు నడిచేటప్పుడు ఆసరాగా నిలిచే వాకర్స్ ఇప్పుడు ఎన్నో రకాలుగా దొరుకుతున్నాయి. అదనపు హంగులెన్నో అద్దుకుని ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా రకరకాల జంతువులూ, పక్షులబొమ్మలు, రంగుల్లో అక్షరాలు, ఇంద్రధనస్సుని తలపించే డిజైన్ల వంటివెన్నో వాకర్‌పై కనిపిస్తూ.. చిన్నారులకు కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తున్నాయి. ఇవన్నీ వారిని ఆకర్షిస్తూ, ఆడుకోవాలనే ఆసక్తిని కలిగిస్తాయి. కొత్త విషయాలను నేర్చుకునేలా చేసి పలు రకాల నైపుణ్యాలనూ అందిస్తున్నాయి. ఇలాంటి ఓ వాకర్‌ని మీ బుజ్జాయికీ అందించాలనిపిస్తోంది కదూ..



# ఈ కాలంలో జిడ్డు సమస్యా?

అసలే ఎండాకాలం.. చర్మాన్ని ఎంత జాగ్రత్తగా సంరక్షించుకున్నా ఏదో ఒక సమస్య తలెత్తుతుంది. ఇక జిడ్డు చర్మతత్వం ఉన్న వారి వెతలు చెప్పనక్కర్లేదు. ఎంత శుభ్రం చేసుకున్నా, ఎన్ని జాగ్రత్తలు పాటించినా వారి చర్మం పదే పదే జిడ్డుగా మారుతుంటుంది. నిజానికి మనం చేసే కొన్ని పొరపాట్లే ఈ సమస్యకు కారణమంటున్నారు నిపుణులు. తద్వారా మొటిమలు, మచ్చలు, బ్లాక్‌హెడ్స్, వంటి ఇతర దుష్ప్రభావాలూ తప్పవంటున్నారు. మరి, వేసవిలో జిడ్డు చర్మతత్వం ఉన్నవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో తెలుసుకుందాం..



**నీటి శాతం లోపిస్తే! ...** మన శరీరంలోని సెబేషియస్ గ్రంథులు విడుదల చేసే సీబమ్ చర్మాన్ని తేమగా ఉంచుతుంది అయితే అది మరింత ఎక్కువగా ఉత్పత్తవడం వల్ల చర్మం జిడ్డుగా మారుతుంది. నీళ్లు ఎక్కువగా తాగకపోయినా సీబమ్ ఉత్పత్తి పెరుగు తుందంటున్నారు నిపుణులు. అదెలాగంటే. మన శరీరాన్ని సరిపడా నీళ్లు అందడం లేదు. తద్వారా అవసరానికి మించి సీబమ్ ఉత్పత్తి పెరుగు తుందంటున్నారు నిపుణులు. అదెలాగంటే. మన శరీరానికి సరిపడా నీళ్లు అందనప్పుడు శరీరం తగిన నీటి స్థాయుల కోసం సెబేషియస్ గ్రంథులపై ఆధారపడుతుంది. తద్వారా అవసరానికి మించి సీబమ్ ఉత్పత్తవుతుంది. ఇది జిడ్డు చర్మాన్ని మరింత జిడ్డుగా మార్చుతుంది. కాబట్టి ఇలా జరగకూడ దంటే ఎవరికి వారు తమ బరువును బట్టి సరైన మోతాదులో నీళ్లు తాగడం ముఖ్యం.

**ఈ నూనెల వల్లే .. !** అందాన్ని పెంపొందించుకోవడంలో అత్యవసర నూనెల పాత్ర కీలకం! అయితే వీటిలో కొన్ని నూనెలు చర్మంపై జిడ్డును బ్యాలన్స్ చేసి.. మొటిమలు, అలర్జీ.. వంటి సౌందర్య సమస్యల నుంచి విముక్తి కలిగిస్తే.. మరికొన్ని నూనెలు మాత్రం ఈ జిడ్డుదనాన్ని మరింతగా పెంచుతాయంటున్నారు నిపుణులు. కొబ్బరినూనె ఇదే కోవకు చెందుతుందట! అందుకే ఈ సమస్య ఉన్న వారు రోజువారీ పాటించే సౌందర్య చికిత్సల్లో కొబ్బరి నూనెను ఉపయోగించకపోవడమే మంచిదంటున్నారు. అలాగే దీన్ని జుట్టుకు పట్టించినా.. జుట్టు కూడా మరింత జిడ్డుగా మారుతుంది. కాబట్టి జిడ్డు సమస్య మరీ ఎక్కువగా ఉన్న వారు మాత్రం కొబ్బరి బదులుగా రోజ్‌మేరీ, జెరానియం.. వంటి అత్యవసర నూనెల్ని ఉపయోగిస్తే.. సీబమ్ ఉతత్తి అదుపులో ఉంటుంది. ఫలితంగా చర్మం మరింత జిడ్డుగా మారకుండా జాగ్రత్తపడచ్చు.

**మాయిశ్చరైజర్ ఇలా...** జిడ్డు చర్మతత్వం ఉన్న వారు మాయిశ్చరైజర్ రాసుకుంటే చర్మం మరింత జిడ్డుగా మారుతుందని దాన్ని ఉపయోగించడమే మానేస్తుంటారు. కానీ ఇది కూడా చర్మం మరింత జిడ్డుగా మారేందుకు దోహదం చేస్తుంట. అలాగే ఒక చర్మతత్వం ఉన్న వారు మరో చర్మతత్వానికి సంబంధించిన మాయిశ్చరైజర్ రాసుకున్నా ఈ సమస్య తలెత్తుతుందంటున్నారు నిపుణులు.



**మేకప్ ఎక్కువైనా ? ...** కొంతమందికి వృత్తిలో భాగంగా మేకప్ వేసుకోక తప్పదు. మరి కొంతమందికి రోజూ మేకప్‌తో తమ అందానికి మెరుగులు దిద్దుకుంటుంటారు. ఈ క్రమంలో కొంతమంది మరీ ఎక్కువగా మేకప్ వేసుకుంటుంటారు. జిడ్డు చర్మతత్వం ఉన్న వారు ఇలా అధిక మొత్తంలో మేకప్ వేసుకునాన చర్మం మరింత జిడ్డుగా మారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అదెలాగంటే మేకప్ వేసుకునే క్రమంలో చర్మ రంధ్రాలు మూసుకుపోవడంతో పాటు ఎక్కువ మొత్తంలో నూనెలు విడుదలవు తాయట! తద్వారా చర్మం మరింత జిడ్డుగా మారుతుంది. కాబట్టి మేకప్ మోతాదులో ఉండేలా చూసుకోవాలి. అదీ అత్యవసరమైతేనే వేసుకోవడం మంచిది.



# అతిగా ఉడికిస్తున్నారా?

చికెన్‌ని వేగంగా వండాలి అనుకుంటే ఆ రుచి రాదు. దీన్ని దినుసులతో మారినేట్ చేసిన తర్వాత ఎంత సేపు ఉంచితే అంత రుచిగా ఉంటుంది. లేత చికెన్‌ని ఎంచుకుని.. అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉప్పు, నూనె, పెరుగు లేదా నిమ్మరసం కలిపి 2 గంటలు పాటు ఉంచాలి. ఇంకా మృదువుగా రావాలనుకుంటే రాత్రంతా ఫ్రిజ్‌లో ఉంచొచ్చు. అంత సమయం లేదంటే కనీసం అరగంటైనా ఉంచాలి. ఇక ఉల్లిపాయల్ని గోధుమ రంగులోకి వచ్చే వరకు వేయించాలి. ముందే చికెన్ వేస్తే తీయగా ఉంటుంది. అలాగే చిక్కటి నరగేవీ కావాలనుకుంటే వేయించిన వాటిని మిక్సీ పట్టండి. తక్కువ మంట మీద ఉడకనివ్వాలి. టొమాటోలు వేస్తే కొంతమందికి నచ్చదు. అలాంటప్పుడు టొమాటోలని ప్యూరీ చేసి వేస్తే కూరకి మంచి రుచి వస్తుంది. స్టౌ కట్టేయడానికి ఐదు నిమిషాల ముందు మసాలా పొడులు వేసుకోవాలి. చక్కని సువాసన వస్తుంది. అలాగే చికెన్‌ని ఎక్కువ సేపు ఉడికించ కూడదు.



# ఏకాగ్రతను పెంచే బంతాట

**కాలక్షేపం అంటూ ఫోన్లూ, ట్యాబ్‌లకు అతుక్కుపోతోన్న** పిల్లల మనసు మళ్లించాలంటే ఆరుబయట ఆడించే ఆటే సరైన మార్గం. ఇవి వారికి శారీరక శ్రమను అందించడమే కాదు, మెదడునీ చురుగ్గా ఉంచుతాయి. అలాంటిదే ఈ బ్యాలెన్సింగ్ బాల్ గేమ్. దీనికోసం మీరు చేయాల్సిందల్లా.. ముందు ఒక లక్ష్యం ఏర్పాటు చేయాలి. దానికి ఐదు మీటర్ల దూరం వరకూ కాస్త ఎడం ఇచ్చి సమాంతరంగా రెండు గీతలు గీయాలి. ఇద్దరు చిన్నారుల్ని లక్ష్యానికి మరోవైపు లైన్ చివర నిలబెట్టాలి. వారి చేతికి ఒకేలాంటి కర్రలిచ్చి ఇద్దరినీ పట్టుకోమనాలి. ఇప్పుడు వాటిపై ఓ బంతిని పెడితే, కింద గీత దాటకుండా ఆ బాల్ కింద పడకుండా ఇద్దరూ బ్యాలెన్స్ చేసుకుంటూ లక్ష్యాన్ని చేరుకోవాలి. ఈ ఆట ఏకాగ్రతను పెంచడంతో పాటు, ఇతరులతో సులువుగా కోఆర్డినేట్ చేసుకునే సామర్థ్యాన్ని పెంచుతుంది.



# నిర్లక్ష్యం చేస్తే..

**ధర్మసాధనంబు తనువు** అన్నారు. ఏ ధర్మాన్ని సాధించాలన్నా శరీరం ప్రధాన సాధనం. మోక్షం శారీరకమైంది కాకపోయినా దాన్ని సాధించటానికి శరీరం అవసరం. దేహం ఆరోగ్యంగా ఉంటే మనసు, హక్కు రెండూ నియంత్రణలో ఉంటాయి. ఈ మూడు కలిస్తేనే నత్రికరణ శుద్ధి, యోగసిద్ధి ఇది మోక్షానికి మార్గం. కాబట్టి వీటన్నిటికీ మూలమైన శరీరాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. 'శరీరమాద్యంఖలు ధర్మసాధనమ్' అని కదా ఆర్యోక్తి. అంటే ఏ ధర్మాన్ని సాధించాలన్నా ముందుగా శరీరాన్ని జాగ్రత్తగా పరిరక్షించుకోవాలి అని అర్థం. శరీర పోషణ, మనసు నిలకడగా ఉంచుకోవడం, ఆత్మ స్వరూపం, పరతత్వ సాధన ఈ నాలుగూ జీవితంలో క్రమంగా సాధించవలసిన అంశాలు. వాటిని ఎలా సాధించాలో అనుగీత చెబుతుంది. అందువల్ల మోక్షసాదనలో శరీర ప్రాధాన్యాన్ని అశ్రద్ధ చేస్తే వచ్చే అనార్థలను విపులంగా వివరించింది అనుగీత. ఒక వ్యక్తి అత్యుత్సాహంతో తన స్థాయికి మించి కానీ, అలసత్వంతో తన స్థాయికి తగ్గి కానీ ప్రవర్తించ కూడదు. శరీర పోషణకు ఎంతో ముఖ్యమైన ఆహార స్వీకరణలో కూడా స్థాయి. కాలం, గుణాలను దృష్టిలో ఉంచుకోవాలి. ఎవరికి వారు తమ శరీరం-వాత, పిత్త,కఫ ప్రకృతుల్లో ఏదో గుర్తించి. దానికి అనుగుణమైన ఆహారం తీసుకోవాలి. అందుకు విరుద్ధమైన ఆహారం తీసుకోవడం, అతిగా తినడం, సమయానికి తినకపోవడం-ఈ మూడింటిపై ఎవరు శ్రద్ధ పెట్టరో. వారికి ఆహారమే శత్రువు అవుతుంది. రుతుచర్యను (రుతువును బట్టి జీవనశైలి) పాటించని శరీరంలో త్రిదోషాలు (వాత, పిత్త, కఫ) విజృంభించి ఆయా భాగాలను దెబ్బతీస్తాయి. ఆ బాధను కొంతకాలం భరించినప్పటికీ శరీరం రోగగ్రస్తంగానే జీవిస్తుంది. ఆ ఒత్తిడిని తట్టుకోలేని నాడు శరీరంలోని ప్రాణ శక్తులు తమ తమ స్థానాల్ని విడిచిపెట్టి వెళ్లిపోతాయి. అదే మరణమంటే ఇలా త్రివిధ దోషాలు, ఒక్కొక్కదాని లక్షణం, అది విజృంభించినప్పుడు శరీరంలో వచ్చే మార్పులు, దాని పర్యవసానాలు తదితర అంశాలతో ముక్తికి మూలమైన శరీర తత్వాన్ని విస్పష్టం చేస్తుంది అనుగీత.



ఆధ్యాత్మికం

# పిండి కలపటం సులువిక !

**చపాతీలు** చేయడం, కాల్చడం కంటే.. పిండి కలపడం ఒకింత ప్రయాసతో కూడిన పని. పిండి కనుక మెత్తగా లేకపోతే చపాతీలు అప్పడాల్లా పెళుసుగా ఉంటాయి. ఆ పని సులువుగా చేసేందుకు ఓ సాధనం ఉంద. అవును.. ఇక చేతులు నొప్పెట్టకుండా 'ఆటా మిక్చర్ ఫుడ్ ప్రాసెసర్'తో పిండిని సులువుగా కలిపేయొచ్చు. ఇది చపాతీపిండి కలపడానికే కాదు గుడ్డుసొనను గిలకొట్టడం లాంటి పనుల్లోనూ ఉపయోగపడుతుంది. నచ్చితే ఆన్‌లైన్‌లో తెప్పించుకోండి.



# టీ పొడితో జిడ్డు వదిలించొచ్చు !

వంట చేసేటప్పుడు వెలువడే పొగ, ఆవిరి, నూనె చిందడం... వంటి వాటి వంట గట్టు, గోడలపై జిడ్డు, మురికీ పేరుకు పోతాయి. వీటిని వదిలించడం పెద్ద పనే. ఇలాంటప్పుడు ఈ చిట్కాలు పాటించండి సులువుగా శుభ్రం చేయొచ్చు.

- లీటరు నీళ్లల్లో రెండు చెంచాల టీపొడినికలిపి సగం అయ్యేవరకూ మరిగించాలి. ఆపై ఈ మిశ్రమానికి పావు కప్పు బేకింగ్ సోడా, చెంచా నిమ్మరసం చేర్చి... మరకలపై చల్లి స్టీలు పీచుతో రుద్దాలి. ఆపై కాసేపాగి కడిగితే సరి.
- అరకప్పు చొప్పున వినెగర్, గిన్నెలు తోమే లిక్విడ్ తీసుకోవాలి. దీనికి ఒక కప్పు గోరువెచ్చని నీళ్లు కూడా కలిపి ఈ మిశ్రమాన్ని స్ప్రే బాటిల్‌లో పోసుకోవాలి. ఆపై జిడ్డుగా ఉన్న వంటగట్టు, గ్యాస్ బల్లపై చల్లి ఓ పది నిమిషాల తర్వాత రుద్ది శుభ్రపరిస్తే చాలు. తళతళలాడుతుంది.
- కప్పు కుంకుడు రసంలో కప్పు బేకింగ్ సోడా, కాస్త నిమ్మరసం కలిపి పేస్ట్‌లా చేయండి. దీన్ని జిడ్డుగా ఉన్న చోట రాసి ఐదు నిమిషాలు వదిలేయండి. తర్వాత పీచుతో రుద్ది కడిగేస్తే చాలు, మురికి, మరకలు సులువుగా వదిలి పోతాయి. దోమలు, బొద్దింకలు... వంటి క్రిమి కీటకాలూ రావు.





## పావోలినికి ఇటాలియన్ టైటిల్

### మాజీ ఛాంపియన్ గౌఫ్ ఓటమి

**న్యూఢిల్లీ:** ఇటాలియన్ ఓపెన్ టైటిల్-2025ను ఇటలీకి చెందిన జాస్మిన్ పావోలిని కైవసం చేసుకుంది. రోమ్‌లో జరిగిన ఫైనల్లో జాస్మిన్ పావోలిని 6-4, 6-2 తేడాతో కోకో గౌఫ్‌ను ఓడించి ఇటాలియన్ ఓపెన్‌ను గెలుచుకుంది. ఇటీవల రోలాండ్ గారోస్‌ను ఓడించి తన రెండవ 1000 సిరీస్ టైటిల్‌ను సాధించింది. 1985లో మాజీ యూఎస్ ఓపెన్ ఛాంపియన్ గౌఫ్‌ను ఓడించి రాఫెల్లా రెగ్గీ తర్వాత రోమ్ ఈవెంట్‌ను గెలుచుకున్న తొలి ఇటాలియన్ మహిళగా పావోలిని నిలిచింది. ఇక 29 ఏళ్ల ఆమె ఓపెన్ ఎరాలో తన తొలి రోమ్ టైటిల్‌ను గెలుచుకున్న మహిళ కాగా, పావోలిని కంటే ఎనిమిది సంవత్సరాలు చిన్నదైన గౌఫ్, 2002లో సెరెనా విలియమ్స్ తర్వాత కిరీటాన్ని గెలుచుకున్న అతి పిన్న వయస్కురాలిగా అవతరించే అవకాశాన్ని కోల్పోయింది. కాగా జెంగ్ క్విన్వెన్‌పై జరిగిన సెమీఫైనల్ విజయంలో లాగానే, గౌఫ్ 55 అన్‌ఫోర్స్‌డ్ ఎర్రర్‌లు చేసి, సర్వ్‌లో ఏడు డబుల్ ఫాల్ట్‌లతో ముందుకు సాగింది, దీంతో పావోలిని విజయం సులభతరం అయింది. అయితే పావోలిని ఇంకా సింగిల్స్ మరియు మహిళల డబుల్స్ టోర్నమెంట్‌లను గెలుచుకోలేకపోవడం విశేషం.




## వరల్డ్ ఛాంపియన్‌గా షెర్బిని

### రికార్డు స్థాయిలో 8వ టైటిల్ సొంతం

### రెండో రౌండ్‌లోనే ఇంటికి భారత్ ప్లేయర్లు

**న్యూఢిల్లీ:** స్క్వాష్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో షెర్బిని రికార్డు స్థాయిలో 8వ టైటిల్‌ను గెలుచుకుని తొలి కిరీటాన్ని కైవసం చేసుకుంది. చికాగోలో జరిగిన స్క్వాష్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఈజిప్షియన్లు మహిళల విభాగంలో ఛాంపియన్‌గా నూర్ ఎల్ షెర్బిని, పురుషుల విభాగంలో మోస్తఫా అసల్ ఛాంపియన్‌లుగా నిలిచారు. ఈ ఈవెంట్‌లో వరుసగా 10వ ఫైనల్ ఆడుతున్న 29 ఏళ్ల ఎల్ షెర్బిని, స్వదేశీయురాలు మరియు ప్రపంచ నంబర్ త్రి హనియా ఎల్ హామ్మామిని 3-1 (11-5, 11-9, 4-11, 11-7) తేడాతో ఓడించి తన ఎనిమిదో టైటిల్‌ను గెలుచుకుంది. ప్రపంచ నంబర్ టు షెర్బిని ఎనిమిది ప్రపంచ ఛాంపియన్‌షిప్ కిరీటాల నికోల్ డేవిడ్ యొక్క ఆల్‌టైమ్ రికార్డును సమం చేసింది. కాగా పురుషుల ఫైనల్లో, ప్రపంచ నంబర్ వన్ అసల్ ప్రపంచ నంబర్ టు మరియు స్వదేశీయుడు అలీ ఫరాగ్‌ను 3-0 (11-7, 11-8, 11-3) తేడాతో ఓడించి తన తొలి టైటిల్‌ను గెలుచుకున్నాడు. 24 ఏళ్ల అసల్ ఇప్పుడు పిఎస్‌ఎ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లు మరియు బ్రిటిష్ ఓపెన్ టైటిళ్లతో పాటు, ప్రపంచ నంబర్ 1 స్థానాన్ని కూడా కైవసం చేసుకున్నాడు. ఈ టోర్నీ ఫైనల్‌లో 33 ఏళ్ల ఫరాగ్ చేతిలో ఓడిపోయి ఉంటే అతను ఈ స్థానాన్ని కోల్పోయేవాడు. ఇక ఈ ఎడిషన్ ఈవెంట్‌లో భారత్‌లో ఐదుగురు పాల్గొన్నారు. పురుషుల విభాగంలో వేలవన్ సెంథిల్‌కుమార్ ప్రారంభ రౌండ్‌లోనే ఓడిపోగా, అభయ్ సింగ్, భారత నంబర్ 1 రమిత్ టాండన్ మరియు అరంగేట్ర వీర్ చోత్రాని రెండవ రౌండ్‌లోనే నిష్క్రమించారు. మహిళల డ్రాలో, 17 ఏళ్ల అరంగేట్ర ఆటగాడు అనాహత్ సింగ్ రెండవ రౌండ్‌లోనే నిష్క్రమించాడు.




## టెస్ట్‌లలో డబుల్ హీరోస్

### సెంచరీల్లో టాప్ 5 భారత్ బ్యాటర్లు

### అద్భుతమైన విజయాలు అందించిన ప్లేయర్లు

**న్యూఢిల్లీ:** రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ నుంచి వైదొలగడంతో టీమ్ ఇండియా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. జట్టులో ముఖ్యంగా బ్యాటింగ్‌లో అనుభవజ్ఞులైన బ్యాటర్లు లేరు. జట్టు పూర్తిగా యువ, కొత్త ఆటగాళ్లతో నిండిపోయింది. టెస్ట్ క్రికెట్‌లో కేవలం సెంచరీలు మాత్రమే కాదు డబుల్ సెంచరీల మోత మోగించి భారత్‌కు అద్భుతమైన విజయాలు అందించిన ప్లేయర్లు చాలా మంది ఉన్నారు. టెస్ట్ క్రికెట్‌లో ఎన్నో మంది దిగ్గజ భారతీయ బ్యాటర్లు సెంచరీల మీద సెంచరీలు సాధించి చరిత్ర సృష్టించారు. విరాట్ కోహ్లీ నుండి సునీల్ గవాస్కర్ వరకు చాలా మంది ప్లేయర్లు డబుల్ సెంచరీలతో భారత్ కు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించారు. అటువంటి టాప్ 5 హీరోల్లో టెస్టు క్రికెట్ లో అత్యధిక డబుల్ సెంచరీలు సాధించిన భారత ప్లేయర్ల లిస్టులో మొదటి స్థానంలో కింగ్ కోహ్లీ ఉన్నాడు. కోహ్లీ 123 టెస్టులలో 46.85 సగటుతో 9230 పరుగులు సాధించాడు. ఇందులో 30 సెంచరీలు, 31 అర్ధసెంచరీలు ఉన్నాయి. అలాగే, 7 డబుల్ సెంచరీలు కూడా బాదాడు. ఇక ఈ ప్లేయర్ల జాబితాలో టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ రెండో స్థానంలో ఉన్నాడు. 103 టెస్టులలో 49.43 సగటుతో 8503 పరుగులు కొట్టాడు. ఇందులో 23 సెంచరీలు, 31 అర్ధసెంచరీలు ఉన్నాయి. సెహ్వాగ్ టెస్టు 6 డబుల్ సెంచరీలతో పాటు రెండు ట్రిపుల్ సెంచరీలు కూడా సాధించాడు. అత్యధిక డబుల్ సెంచరీలు బాదిన భారత ప్లేయర్ల లిస్టులో మూడో స్థానంలో సచిన్ టెండూల్కర్ ఉన్నాడు. 200 టెస్టులలో 53.78 సగటుతో 15921 పరుగులు సాధించిన సచిన్ టెండూల్కర్ 51 సెంచరీలు, 68 అర్ధసెంచరీలు సాధించాడు. టెస్టు క్రికెట్ లో అత్యధిక సెంచరీలు బాదిన రికార్డు సచిన్ పేరిట ఉంది. టెండూల్కర్ టెస్టులో 6 డబుల్ సెంచరీలు సాధించాడు. ప్రపంచ క్రికెట్ లెజెండరీలలో ఒకరైన రాహుల్ ద్రవిడ్ భారత జట్టు కోసం ఎన్నో మారపురాని ఇన్నింగ్స్ లను ఆడాడు. అత్యధిక డబుల్ సెంచరీలు బాదిన భారత ప్లేయర్ల లిస్టులో రాహుల్ ద్రవిడ్ నాల్గవ స్థానంలో ఉన్నాడు. ద్రవిడ్ 163 టెస్టులలో 52.63 సగటుతో 13265 పరుగులు సాధించాడు. ఇందులో 36 సెంచరీలు, 63 అర్ధసెంచరీలు ఉన్నాయి. ద్రవిడ్ టెస్టు క్రికెట్ లో 5 డబుల్ సెంచరీలు చేశాడు. కాగా భారత్ తరపున టెస్టు క్రికెట్‌లో అత్యధిక డబుల్ సెంచరీలు బాదిన ప్లేయర్ల లిస్టులో ఐదవ స్థానంలో సునీల్ గవాస్కర్ ఉన్నాడు. సన్నీ 125 టెస్టులలో 51.12 సగటుతో 10122 పరుగులు సాధించాడు. ఇందులో 34 సెంచరీలు, 45 అర్ధసెంచరీలు ఉన్నాయి. అలాగే, టెస్టులో 4 డబుల్ సెంచరీలు సాధించాడు.



## పంజాబ్ కింగ్స్ హ్యాట్రిక్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025లో కీలక మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ హ్యాట్రిక్ విజయం సాధించింది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 10 పరుగుల తేడాతో గెలుపొందింది. దీంతో 12 మ్యాచ్‌ల్లో 8 మ్యాచ్‌ల్లో విజయం అందుకున్న పంజాబ్ ప్లే ఆఫ్స్‌కు అడుగు దూరంలో నిలిచింది. జైపూర్‌లో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 219 పరుగులు చేసింది. ఈ లక్ష్య ఛేదనలో రాజస్థాన్ 7 వికెట్లు నష్టానికి 209 పరుగులకే పరిమితమైంది. యశస్వి జైస్వాల్ 25 బంతుల్లో 50 పరుగులు, 9 ఫోర్లు, 1 సిక్స్‌తో చెలరేగిపోయాడు. అలాగే వైభవ్ సూర్యవంశీ 15 బంతుల్లో 40 పరుగులు, 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో మరోసారి మెరుపు ఆరంభం ఇచ్చినా రాజస్థాన్‌కు ఓటమి తప్పలేదు. ఆ తర్వాత వచ్చిన సంజు శాంసన్ 16 బంతుల్లో 20 పరుగులు, 1ఫోరు, 1సిక్స్, రియాన్‌పరాగ్ 11బంతుల్లో 13పరుగులు, 1సిక్స్‌కొట్టి దూకుడుగా ఆడలేకపోయారు. ధ్రువ్ జురెల్ 31 బంతుల్లో 53 పరుగులు, 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో అర్ధ సెంచరీ చేసి పోరాడినా మిగిలిన బ్యాటర్ల నుండి సరైన సహకారం అంద లేదు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన పంజాబ్ స్పిన్నర్ హార్ ప్రీత్ బ్రార్ కీలక సమయంలో వికెట్లు తీసి రాజస్థాన్‌ను దెబ్బతీశాడు. యున్సెన్, ఒమర్జాయ్ రెండేసి వికెట్లు పడగొట్టారు. యశస్వి జైస్వాల్, సూర్యవంశీ ఇన్నింగ్స్ ఆరంభం నుంచే ఫోర్లు, సిక్సర్లతో పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. అర్ష్‌దీప్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో జైస్వాల్ వరుసగా 4 ఫోర్లు, 1 సిక్స్ బాది 22 పరుగులు పిండుకున్నా ఫలితం లేకుండా పోయింది. అంతకు ముందు ప్లే ఆఫ్స్ రేసులో ఉన్నపంజాబ్ కింగ్స్ బ్యాటింగ్ చేసి భారీ స్కోర్ చేసింది. టాపార్డర్ విఫలమైనా యువకెరటం నేహాల్ వధేరా(70) అర్ధ శతకంతో రెచ్చిపోయాడు. పవర్ ప్లేలోనే మూడు వికెట్లు పడినా కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(30)తో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. డెత్ ఓవర్లలో ఆఖర్లో శశాంక్ సింగ్(59 నాటౌట్), అజ్మతుల్లా ఒమర్‌జాయ్(21 నాటౌట్) విధ్వంసంక బ్యాటింగ్‌తో అలరించారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లను ఉతికారేస్తూ బౌండరీలతో విరుచుకుపడ్డారు. అయితే ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య(9)ను తక్కువ స్కోర్‌కే ఔట్ చేసిన తుషార్ దేశ్‌పాండే రాజస్థాన్‌కు రెండో ఓవర్లోనే బ్రేకిచ్చాడు. కాసేపటికే ఈ మ్యాచ్‌తో అరంగేట్రం చేసిన మిచెల్ ఓవెన్(0)ను క్వెనా మఫాకాడకౌట్ చేశాడు. అయినాసరే ప్రభ్‌సిమ్రన్‌సింగ్(0) దూకుడుగాఆడాడు. శ్రేయాస్ అయ్యర్(30) జతగా పంజాబ్ స్కోర్ బోర్డును ఉరికించాడు. అయితే దేశ్‌పాండే మరోసారి షాకిస్తూ ప్రభ్‌సిమ్రన్‌ను ఔట్ చేశాడు. దాంతో, పవర్ ప్లే 3.1 ఓవర్‌కే పంజాబ్ కీలకమైన 3 వికెట్లు కోల్పోయింది. దేశ్‌పాండే విజృంభణతో34కే మూడు కీలక వికెట్లు పడిన పంజాబ్‌ను అయ్యర్, నేహాల్ వధేరా(70)లు ఆదుకున్నారు. క్రీజులో కుదురుకున్నాక జోరు పెంచిన ఇద్దరూ బౌండరీలతో హడలెత్తించారు. దాంతో, 10 ఓవర్లకు పంజాబ్ స్కోర్ 97కు చేరింది. అయితే దంచికొడుతున్న అయ్యర్ రియాన్ పరాగ్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. ఆ తర్వత గేర్ మార్చిన వధేరా ఆకాశ్ మధ్వాల్ బౌలింగ్‌లో రెండో ఫోర్లతో అర్ధ శతకం సాధించాడు.



## హాకీ టోర్నీలో 4 దేశాలతో భారత్ ఢీ

### 25న చిలీతో పోరు

**న్యూఢిల్లీ:** ఈ ఏడాది డిసెంబరులో జరిగే మహిళల జూనియర్ ప్రపంచ కప్ టోర్నమెంట్‌కు సన్నాహాల్లో భాగంగా భారత జట్టు ఈ నెలలో నాలుగు దేశాల టోర్నీలో పోటీపడనుంది. అర్జెంటీనాలోని రొసారియా నగరంలో ఈ నెల 25 నుండి జూన్ 2 వరకూ జరిగే ఈ టోర్నీలో భారత్‌తో పాటు, అర్జెంటీనా, చిలీ, ఉరుగ్వే జట్టు పాల్గొంటున్నాయి. ఈ టోర్నీలో ఆడనున్న భారత్ జట్టును హాకీ ఇండియా ప్రకటించింఇ. 24 మంది సభ్యులతో కూడిన భారత్ జూనియర్ మహిళల హాకీ జట్టుకు గోల్‌కీపర్ నిధి నాయకత్వం వహిస్తుంది. డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరిగే ఈ టోర్నీలో భారత జట్టు తమ తొలి మ్యాచ్‌ను ఈ నెల 25న చిలీతో ఆడుతుంది. ఆ తర్వాత టీమిండియా వరుసగా ఈ నెల 26న ఉరుగ్వేతో, అర్జెంటీనాతో 28న, చిలీతో 30న, ఉరుగ్వేతో జూన్ 1న, అర్జెంటీనాతో 2న తలపడుతుంది. భారత్ జూనియర్ మహిళల హాకీ జట్టులో నిధి (కెప్టెన్, గోల్‌కీపర్), ఏంజిల్ హర్షరాణి మింజ్ (గోల్‌కీపర్), మమితా ఓరమ్, లాల్‌తట్లుయాంగి, మనీషా, పూజా సాహూ, పార్వతి టొప్నో, నందిని, సాక్షి శుక్లా (డిఫెండర్లు), ప్రియాంక యాదవ్, అనీషా సాహూ, రజని కెర్కెట్టా, బినామా ధన్, ఖైదెమ్ షిలీమా చాను, సంజన హోరో, సుప్రియా కుజుర్, ప్రియాంక డోగ్రా (మిడ్ ఫీల్డర్లు), హీనా బానో, సోనమ్, సుఖ్‌వీర్ కౌర్, గీతా యాదవ్, లాల్‌రిన్‌పుయ్, కనిక సివాచ్, కర్మన్‌ప్రీత్ కౌర్ (ఫార్వర్డ్లు), స్టాండ్‌బై విద్యశ్రీ, హుదా ఖాన్, మనీమని దాస్, సెలెస్టినా హోరో ఉన్నారు.

## లాంచ్ కాబోయే 'ఇవి' కార్లు ఇవే!

**ముంబై, మే 18:** ఎలక్ట్రిక్ వాహనాల విభాగం రోజురోజుకూ వృద్ధి చెందుతుంది. అగ్రశ్రేణి కార్ల తయారీ సంస్థలన్నీ ఐసీఈ నుంచి నుండి 'ఇవి' వాహనాలవైపు వేగంగా మారుతున్నారు. కియా, మహీంద్రా, మారుతి సుజుకి, టాటా ఎంజీ వంటి కంపెనీలు కొత్త కార్లను లాంచ్ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యం



లో ఈ ఏడాది రిలీజవ్వబోయే 'ఇవి' కార్ల గురించి తెలుసుకుందాం. కియా క్లావిస్ 'ఇవి' కియా క్లావిస్ 'ఇవి' త్వరలో లాంచ్ కానుంది. కియా కంపెనీ ఇప్పటికే ఈ మోడల్ ఇంధన వెర్షన్‌ను ప్రవేశపెట్టింది. ఈ మోడల్‌లో భవిష్యత్‌లో ఈవీ వెర్షన్ లాంచ్ కానుందని నిపుణులు చెబుతన్నారు. ఈ మోడల్ హాట్ సెల్లింగ్ ఉత్పత్తిగా ఉంది. క్రెటా ఎలక్ట్రిక్ నుండి చాలా కీలకమైన హార్డ్‌వేర్‌ను తీసుకుంటుందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి మోడల్ రెండు బ్యాటరీ కాన్ఫిగరేషన్‌లలో అందించే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నారు. ఎంజీ ఎం9 భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో ప్రదర్శించిన జేఎస్‌డబ్ల్యూ ఎంజీ ఎం9ని భారత మార్కెట్‌కు త్వరలో తీసుకురానుంది. ఎంజీ ప్రీమియం శ్రేణిలో ఉన్న ఈ కారు 90 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో వస్తుంది. అలాగే ఈ కారును ఓ సారి ఛార్జ్ చేస్తే దాదాపు 430 కి.మీ. మైలేజ్ అందిస్తుందని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్ఓ మహీంద్రా కంపెనీ ఎక్స్‌యూవీ 3 ఎక్స్ఓ కారును ఈవీ వెర్షన్‌లో త్వరలో లాంచ్ చేయనుంది. ఈ కారు 2025 చివర్లో మార్కెట్‌లో లాంచ్ అయ్యే అవకాశం ఉంది. ఈ లాంచ్ గురించి కంపెనీ ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. అధికారికంగా లాంచ్ అయిన తర్వాత, ఈ మోడల్ టాటా పంచ్ 'ఇవి'కు నేరుగా పోటీగా ఉంటుందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. టాటా హారియర్ 'ఇవి' 2025 బీఎంజీఈ సమయంలో టాటా కంపెనీ హారియర్ 'ఇవి'ను ప్రదర్శించింది. టాటా కంపెనీ ఈ కారుకు సంబంధించిన అన్ని పరీక్షలను దాదాపు పూర్తి చేసిందని, త్వరలోనే హారియర్ 'ఇవి'మార్కెట్‌ను పలుకరించనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2025 ముగిసేలోపు ఈ కారు మార్కెట్‌లో లాంచ్ అయ్యే అవకాశం ఉంది.

## కార్ల కోసం వేసవి చిట్కాలు

**ముంబై, మే 18:** దేశంలోనిదాదాపు అన్ని ప్రాంతాల్లో ప్రస్తుతం 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇలాంటి సమయంలో కార్లను కూడా చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. ఎండలో డ్రైవింగ్ చేయడం వల్ల మీకు అసౌకర్యం కలగడంతో పాటు కారుకూ నష్టం వాటిల్లుతుంది. ముఖ్యంగా విండ్ షీల్డ్ పగుళ్లు తీస్తుంది. పెయింట్ వాడిపోయే ప్రమాదం ఉంది. అధిక వేడి కారణంగా టైర్లు హీటెక్కిపోతాయి. ఇలాంటి సమయంలో ఈ కింద తెలిసిన విధంగా కార్లను సంరక్షించుకోవాలి. ఎండా కాలంలో కారును వాడకుండా ఇంటిలోనే ఉంచడం కుదరదు. మన అవసరాలకు అనుగుణంగా దాన్ని ఉపయోగించుకోవాలి. కాబట్టి సాధ్యమైనంత వరకూ కారును నీడ కింద పార్కు చేయాలి. ఎందుకంటే సుమారు 30 నిమిషాల పాటు కారు ఎండలో ఉంటే లోపలి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతాయి. ప్రయాణం సమయంలో ఒక అరగంట పాటు చెట్ల కింద ఆపడంవల్ల మీతోపాటు కారుకు మంచి జరుగుతుంది. క్యాబిన్ చల్లబడడమే కాకుండాపెయింట్, డాష్ బోర్డులో పగుళ్లు రాకుండా ఉంటాయి. పార్కింగ్ చేసే ప్రదేశాల్లో నీడ లేనప్పుడు సన్ షేడ్‌లు, విండో వైజర్లను ఉపయోగించుకోవాలి. ఇవి సూర్యరశ్మిని నిరోధించి, కారు లోపలి భాగాన్ని చల్లగా ఉంచుతాయి. ముందు వెనుక ఉన్న కిటికీలపై వీటిని ఉంచడంమంచిది. అదే సమయంలో స్టీరింగ్ వీల్, సీట్లపై తువాళ్లు కప్పడం మర్చిపోవద్దు. తువాళ్లపై నీటిని చల్లడం వల్ల మరింత చల్లదనం అందుతుంది. ఈ పద్ధతులు కారు లోపల భాగం వేడెక్కకుండా చూడటానికి ఎంతో సహాయపడతాయి. బయట గాలి కారు లోపలకు వెళ్లడానికి వీలుగా, లోపలి భాగం వేడెక్కకుండా ఉండేందుకు కొద్దిగా కిటికీల తెరవడం చాలా మంచిది. దీనివల్ల లోపలి గాలిబయటకు, బయట గాలి లోపలకు వెళ్లి ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. ఇటీవల సౌరశక్తితో పనిచేసే ఫ్యాన్లు ఎక్కువగా తయారవుతున్నాయి. వాటిని కారులో ఏర్పాటు చేసుకోవడం వల్ల ప్రయోజనం కలుగుతుంది. ఇంజిన్ ఆఫ్‌లో ఉన్నప్పుడు క్యాబిన్ ఉష్ణోగ్రతను సరిచేస్తాయి. ఎండలో పార్కు చేసిన సమయంలోనూ ఉపయోగపడతాయి.



## వాణిజ్యం


## ఆన్‌లైన్ మోసాలకు ఎయిర్‌టెల్ చెక్

**ముంబై, మే 18:** భారతదేశంలో ప్రముఖ టెలికం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ అన్ని కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్స్‌లో హానికరమైన వెబ్‌సైట్లను రియల్ టైమ్‌లో గుర్తించి బ్లాక్ చేసేలా కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఏఐ ఆధారంగా తీసుకున్న ఈ పరిష్కార చర్యలు ఎస్ఎంఎస్, ఈమెయిల్, ఓటీటీ మెసేజింగ్ యాప్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌తో సహా సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్స్ ద్వారా యాక్సెస్ చేసే ప్రమాదకరమైన లింక్లను గుర్తించి బ్లాక్ చేస్తుంది. ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాల నుంచి వినియోగదారులను రక్షించడం లక్ష్యంగా ఈ కీలకచర్యలు తీసుకున్నారు. ఎయిర్టెల్‌మొబైల్, బ్రాడ్‌బ్యాండ్ నెట్వర్క్‌లో ఇంటిగ్రేట్ చేసిన ఈ సేవ అదనపు ఖర్చు లేకుండా అందరు వినియోగదారు లకు ఆటోమెటిక్‌గా అందుబాటులో ఉంటుంది. హానికరమైన వెబ్‌సైట్ గుర్తించినప్పుడు వినియోగ దారులు బ్లాక్‌ను వివరించే నోటిఫికేషన్ పేజీకి మళ్లించి ఆ పేజీ క్లోజ్ అవుతుంది. భారతదేశం అంతటా సైబర్ మోసం బాగా పెరిగిపోతున్న నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నామని ఎయిర్‌టెల్ ప్రతినిధులు చెబుతున్నారు. ముఖ్యంగా డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్‌ను ఉపయోగించి స్కామర్లు ఎక్కువగా దోపిడీ చేస్తున్నారు. సాంప్రదాయ ఓటీపీ దొంగతనం, స్పామ్ కాల్స్‌కు అతీతంగా హానికరమైన లింక్లను ఉపయోగించే అధునాతన పథకాలు ఇప్పుడు మిలియన్ల మంది వినియోగదారులను లక్ష్యంగా చేసుకుంటున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ మోసాలను అరికట్టేందుకు ఎయిర్టెల్ ఇంజనీర్లు ఏఐను ఉపయోగించి రియల్‌టైమ్ డొమైన్ ఫిల్టరింగ్‌ను నిర్వహించే మల్టీలెవల్ నిఘా వ్యవస్థను అభివృద్ధి చేశారు. ఇది వెబ్ ట్రాఫిక్‌ను గ్లోబల్ రిపోజిటరీలతో ఎయిర్టెల్ అంతర్గత డేటాబేస్లో క్రాస్‌రిఫరెన్స్ చేస్తుంది. ఇలాంటి చర్యలతో వినియోగదారులు మోసపోతామనే ఆందోళన లేకుండా ఇంటర్నెట్ బ్రౌజ్ చేయడమే తమ లక్ష్యమని ఎయిర్‌టెల్ ప్రతినిధులు చెబుతున్నారు. ఆరు నెలల ట్రయల్స్ తర్వాత కచ్చితత్వంతో కూడిన బ్లాకింగ్ సిస్టమ్‌ను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సేవ ప్రస్తుతం హర్యానా సర్కిల్లో అందుబాటులో ఉంది. త్వరలో దేశవ్యాప్తంగా విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.




## ఈ వారం కొత్త ఐపిఒలు ఇవే..

**న్యూఢిల్లీ, మే 18:** ఆటో విడిభాగాల కంపెనీ బెల్‌రైజ్ ఇండస్ట్రీస్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 21న ప్రారంభం కానుంది. 23న ముగియనున్న ఇష్యూకి రూ.85-90 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూలో భాగంగా రూ.2,150 కోట్లుగా నమోదైంది. కంపెనీ ప్రధానంగా ఆటోరంగంలోని సేఫ్టీ క్రిటికల్ సిస్టమ్స్‌ను రూపొందించడంతో పాటు, ఇతర ఇంజినీరింగ్ సొల్యూషన్స్ అందిస్తోంది. టెక్స్‌టైల్ తయారీ కంపెనీ బొరానా వీవ్స్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 20న ప్రారంభం కానుంది. 22న ముగియనున్న ఇష్యూకి రూ.205-216 ధరల శ్రేని ప్రకటించింది. ఇష్యూలో భాగంగా 67.08 లక్షల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. తద్వారా రూ.145 కోట్లు సమీకరించే యోచరలొఓ ఉంది. 19న యాంకర్ ఇన్వెస్టర్లకు షేర్లను విక్రయించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 69 షేర్లకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇష్యూ నిధులను కొత్త తయారీ యూనిట్ ఫైనాన్స్ వ్యయాలతో పాటు, వర్కింగ్ కేపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. గుజరాత్‌లోని సూరత్ వద్ద ఏర్పాటు చేస్తున్న యూనిట్ ద్వారా గ్రే ఫ్యాబ్రిక్‌ను ఉత్పత్తి చేయనుంది.




## సాలరీ అకౌంట్‌తో ప్రయోజనాలెక్కువే..

**ముంబై, మే 18:** చాలా మందికి బ్యాంకు అకౌంట్లు ఉంటాయి. అయితే కొన్ని ఖాతాల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. కానీ చాలా మందికి తెలియవు. బ్యాంకు అందించే వివిధ రకాల ఖాతాలు ఉన్నాయి. వీటిలో కరెంట్ ఖాతా, ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతా, సేవింగ్స్ ఖాతా మొదలైనవి ఉన్నాయి. సాధారణంగా చాలా మందికి పొదుపు ఖాతాల ఉంటాయి. మీరు ఆ అకౌంట్‌ను సాలరీ అకౌంట్‌గా మార్చుకోవచ్చు. ఇదిలా ఉండగా, సాలరీ అకౌంట్‌తో చాలా ప్రయోజనాలు ఉంటాయంటున్నారు నిపుణులు. ఆ ప్రయోజనాలు చాలా మందికి తెలియవు. దీనివల్ల ప్రజలు సాలరీ అకౌంట్‌ను నిర్వహించడానికి భయపడుతుంటారు. సాలరీ అకౌంట్ కింద ఓవర్‌డ్రాఫ్ట్ ప్రయోజనం ప్రజలకు లభిస్తుంది. ఓవర్‌డ్రాఫ్ట్ అంటే అత్యవసర పరిస్థితుల్లో మీరు ఖాతా నుండి డబ్బును ఉపసంహరించుకోవచ్చు. అంటే మీ అకౌంట్‌లో డబ్బులు లేకున్నా ఓవర్ డ్రాఫ్ట్ ద్వారా కొంత అమోంట్‌ను పొందవచ్చు. ఓవర్‌డ్రాఫ్ట్ సద్వినియోగం చేసుకున్న తర్వాత అత్యవసర పరిస్థితుల్లో మీరు డబ్బు అప్పుగా తీసుకోవాల్సిన అవసరం ఉండదు లేదా క్రెడిట్ కార్డును ఎక్కువగా ఉపయోగించాల్సిన అవసరం ఉండదు. చాలా బ్యాంకులు సాలరీ అకౌంట్‌లకు బీమా కవరేజీని కూడా అందిస్తున్నాయి. మీరు దీని కింద ఆరోగ్య బీమా తీసుకుంటే ఆకస్మిక వైద్య ఖర్చుల గురించి మీరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆరోగ్య బీమా వల్ల కూడా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. నేటి కాలంలో వైద్య ఖర్చులు పెరుగుతున్నాయి. ఈలోగా బీమా మాత్రమే ఉపయోగపడుతుంది. అయితే, దీని కోసం మీరు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. మీ వేతనం అంత కాకపోతే ప్రభుత్వం రూ. 5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమాను కూడా అందిస్తుంది. ఇది ఆయుష్మాన్ యోజన ద్వారా లభిస్తుంది. అయితే, ఈపథకం ప్రయోజనాలను పొందడానికి ఒక జీతం నిర్ణయించింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.